VICTORY

విక్టరీ

# సర్దార్
# వల్లభ్‌భాయి పటేల్



బయోగ్రఫీ సిరీస్

# సర్దార్ వల్లభ్‌భాయి పటేల్

సి.వి.ఎస్.రాజు


## విక్టరీ పబ్లిషర్స్

డోర్. నెం. 29-2-34,
రామమందిరం వీధి,
ఏలూర్ రోడ్,
విజయవాడ- 520 002.
ఫోన్ : 0866 - 2444156

డోర్. నెం. 2-4-1085, ప్లాట్ నెం. 3,
సాయిలక్ష్మీనికేతన్,
రామకృష్ణా హాస్పటల్ ఎదురు వీధి,
నింబోలి అడ్డా, హైదరాబాద్ 500027
ఫోన్ : 040- 65528228
సెల్ : 9390168228

# సర్దార్ వల్లభ్‌భాయి పటేల్

©Ln. **I. Ramakumar,** PMJF
Vijayawada.

ప్రథమ ముద్రణ – 2017

**సోల్ డిస్ట్రిబ్యూటర్స్ : ఆంధ్రప్రదేశ్**

**సాయి వెంకటేశ్వర బుక్ డిపో**
26-27-77, బాటా షోరూమ్ ఎదురు,
గాంధీనగర్, విజయవాడ – 520 003.
**ఫోన్ : (0866) 2570192**

**సోల్ డిస్ట్రిబ్యూటర్స్ : హైదరాబాద్**

**బుక్ సెలక్షన్ సెంటర్**
కె.డి. హౌస్, 3-5-121/ఇ/1/2,
షాలిమార్ ఫంక్షన్ హాల్ దగ్గర,
రామకోటి, హైదరాబాద్.
**ఫోన్ : (040) 23446841, 23446843**
**(ఇ-మెయిల్) bschydin@gmail.com.**

**బుక్ సెలక్షన్ సెంటర్**
తిరుమల కమర్షియల్ కాంప్లెక్స్,
కామత్ హోటల్ ఎదురు, ఎస్.డి.రోడ్,
సికింద్రాబాద్. **ఫోన్ : (040) 23446849**

**నవోదయ బుక్ హౌస్**
ఆర్య సమాజం మందిర్ ఎదురు రోడ్డు,
కాచిగూడ, హైదరాబాద్.
**మొబైల్ : 92474 71361**

**మనవి :** మాచే ప్రచురించబడిన అన్ని రకముల పుస్తకములు అన్ని ప్రముఖ బుక్ షాపులలోను, విశాలాంధ్ర మరియు ప్రజాశక్తి బుక్ హౌస్ అన్ని బ్రాంచిలలోను లభించును. లభించని యెడల మమ్ములను నేరుగా సంప్రదించగలరు. పుస్తకాలలో ఏవైనా లోపాలు, తప్పులు ఉన్నా తెలియచేసిన తదుపరి ముద్రణలో సరిచేయగలం. ఏ విషయమైన **ramakumarimmadisetty @yahoo.com** మెయిల్‌కు తెలియ జేయవచ్చును. మీకు కావలసిన పుస్తకాలకు : **SBI online A/c. No. 31712393082 సాయి వేంకటేశ్వర బుక్ డిపో, విజయవాడ** పేరున జమచేసి, మీకు దగ్గర గల ట్రాన్స్‌పోర్టు వివరాలు తెలుపవలెను.

***Published by :* విక్టరీ పబ్లిషర్స్, విజయవాడ**

**We have made many efforts to present this book without errors. But some errors might have crept in. We do not take any legal responsibility for such errors and omissions. If you bring them to our notice we shall correct them in our next edition. All disputes are subject to Vijayawada Jurisdiction only.**

# ముందుమాట


ఒకదేశంలో నివసించే గొప్ప నాయకుల జీవితచరిత్రలే దేశచరిత్ర అవుతుంది. మహాత్మాగాంధీ నాయకత్వంలో స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొన్న గొప్ప నాయకుడు సర్దార్ వల్లభ్‌భాయి పటేల్. భారతదేశపు ఉక్కుమనిషిగా అతడు పేరుపొందాడు. అతనికి అంతటి బలమైన ఇచ్ఛాశక్తి ఉంది. పటేల్ ఒక న్యాయవాది, నాయకుడు, గొప్ప వక్త. అన్ని రాష్ట్రాలను విలీనం చేయడమే అతని దేశభక్తికి తార్కాణం.

భారతమాత గర్వించదగిన కుమారుడు పటేల్. ప్రతిఒక్కరు అతని జీవిత చరిత్రను తెలుసుకుని, అతడు చేసిన ఘనకార్యాలను గుర్తించి, అతని అడుగుజాడలలో నడవాలి. అతని జీవితచరిత్ర అందరిలోను దేశభక్తిని, అంకిత భావాన్ని, పట్టుదలను రేకెత్తించాలి.

- రచయిత

# విషయసూచిక


1. పటేల్ కుటుంబం ..... 5
2. బాల్యము - విద్య ..... 7
3. న్యాయవాద వృత్తి ..... 10
4. బారిస్టర్‌గా ..... 16
5. మునిసిపల్ ఉద్యోగం ..... 22
6. బార్డోలి పోరాటం ..... 25
7. కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా ..... 28
8. గాంధీ - సర్దార్ ..... 30
9. జైలు నుండి విడుదల ..... 33
10. కాంగ్రెస్ మంత్రిత్వ శాఖలు ..... 35
11. క్విట్ ఇండియా ఉద్యమం ..... 38
12. అయోమయ స్థితి ..... 41
13. విభజన ..... 43
14. స్వాతంత్ర్యం ..... 47
15. రాజ్యాంగ సభ - శాసనసభ ..... 50
16. హోమ్‌శాఖామంత్రిగా ..... 52
17. రాష్ట్రాలకు మంత్రి ..... 54
18. చివరి సంవత్సరాలు ..... 58
19. సర్దార్ రాజకీయాలు ..... 62
20. వ్యవహార దక్షత కలవాడు ..... 65
21. సమాజ శ్రేయస్సు ..... 69
22. రక్షణ దళాలకు ..... 75
23. సమీకరణకు సమయం ఆసన్నమైంది ..... 78



# 1. పటేల్ కుటుంబం

పటేల్ పాతిదార్ల జాతికి చెందినవాడు. గుజరాత్ చరిత్రలో పాతిదార్లు ప్రముఖపాత్ర పోషించారు. వారు పంజాబు నుండి వలస వచ్చి మాహి, తపతి నదుల మధ్య ప్రదేశంలో స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. వారు భూమిని కౌలుకి తీసుకుని వ్యవసాయం చేసేవారు. వారు చాలా ధైర్యసాహసాలు కలవారు. వారిని రెచ్చగొడితే చట్టాన్ని అతిక్రమించడానికి కూడా సిద్ధపడతారు. వల్లభ్‌భాయిపటేల్‌ని, అతని అన్నను "తిరుగుబాటు దారులు" అనేవారు.

పాతిదారులు చక్కని వాక్చమత్కృతి కలవారు. వారిలో ఝూవేరిభాయికి ఒక ప్రత్యేకత ఉంది. దేశస్వాతంత్ర్యం కోసం అతడు ఝాన్సీలక్ష్మీబాయి సైన్యంలో చేరి బ్రిటిష్‌వారితో పోరాడాడు. సిపాయిల తిరుగుబాటు సమయంలో అతడు బ్రిటిష్‌వారికి పట్టుబడ్డాడు. అతనిని ఇండోర్‌లోని జైలులో వేశారు. అప్పటి మహారాజు మహర్‌రావ్ హోల్కారు. రాజు చదరంగం ఆడుతూ ఝూవేరిభాయిని తన ఆటను చూడమన్నాడు. ఝూవేరిభాయి చదరంగం ఆటలో నిపుణుడు. అతని ఆటకు మెచ్చి రాజు అతనిని విడుదల చేశాడు. యుద్ధాలతో విసిగిపోయిన ఝూవేరిభాయి యింటికి తిరిగివచ్చి వ్యవసాయం చేయడం మొదలుపెట్టాడు. తరువాత అతడు దైవభక్తుడయ్యాడు. అతడు ప్రాపంచిక సుఖాలను పరిత్యజించాడు. అతనిని అందరూ గౌరవించేవారు. అతని భార్య లడ్‌బాయి. వారికి ఆరుగురు సంతానం – అయిదుగురు కుమారులు, ఒక కుమార్తె. విఠల్‌భాయి పెద్దవాడు. వల్లభ్‌భాయి నాలుగవవాడు.

తల్లిదండ్రులు దైవభక్తి కలవారు. అందువల్ల వలభ్‌భాయి కూడా భక్తుడయ్యాడు. వ్యవసాయం వల్ల లభించిన ఆదాయమే వారి జీవనాధారం. అతడు స్వాతంత్ర్యసమరంలో చేరినప్పుడు ఒక సాధారణ వ్యవసాయదారుడు మాత్రమే.


వల్లభ్ భాయి నాదియాడ్‌లో జన్మించాడు. అతడు పుట్టినతేదీ సరిగా తెలియదు. కాని 31వ తేదీ అక్టోబరు 1875 అని రాసుకున్నాడు. సంతానంలో మధ్యవాడు కాబట్టి అతనికి తల్లిదండ్రుల ప్రేమ లభించలేదు. అతని అన్నలు పెత్తనం చలాయించేవారు. అయినప్పటికీ అతడు కూడా అధికారాన్ని చలాయించడానికి ప్రయత్నించేవాడు. ఆ రోజుల్లో బాలురు బయటికిపోయి డబ్బు సంపాదించేవారు. వల్లభ్‌భాయి కూడా అలాగే చేయాలనుకునేవాడు.

విద్యా విషయంలో వల్లభ్‌భాయి మొదట గుజరాతీ నేర్చుకుని తరువాత ఇంగ్లీషు నేర్చుకోవలసివచ్చింది. కాని స్కూలులో ఉన్న క్రమశిక్షణ పటేల్‌కి నచ్చలేదు. అతడు ఉపాధ్యాయుని కూడా ఆటపట్టించేవాడు. కొన్నాళ్లకు ఒక ఇంగ్లీషు స్కూలు స్థాపించబడింది. వల్లభ్‌భాయి ఆ స్కూలులో చేరాడు.

స్కూలులో చదువుతున్నప్పటికీ వ్యవసాయపనులలో తండ్రికి సాయంచేసేవాడు. అతడు మంచి వ్యవసాయదారుడయ్యాడు. పాతిదారులలో బాల్యవివాహాల ఆచారం ఉంది. తొమ్మిదేళ్ల వయస్సులోనే వల్లభ్‌భాయి జావేరిబాయిని వివాహం చేసుకున్నాడు.

రాజభాష కాబట్టి ఇంగ్లీషు బాగా నేర్చుకోవాలనుకున్నాడు పటేల్. పెట్లాడ్ అనే ఊరిలో ఒక ఇంగ్లీషు స్కూలుని స్థాపించారు. మరో ఆరుగురు విద్యార్థులతో కలిసి పటేల్ ఆ ఊళ్లో చిన్న గదిని అద్దెకు తీసుకున్నాడు. ఒకరి తరువాత ఒకరుగా వంట చేసేవారు. పటేల్ తన 22వ యేట, 1897లో మెట్రిక్యులేషన్ పరీక్ష ప్యాసయ్యాడు.

ఒకరోజు ఒక ఉపాధ్యాయుడు ఒక విద్యార్థిని తీవ్రంగా శిక్షించాడు. పటేల్ కోపంతో విద్యార్థులు స్కూలుని బహిష్కరించేటట్లు చేశాడు. పటేల్ షరతులకు ప్రధానోపాధ్యాయుడు అంగీకరించాడు. ఇంకొకసారి ఒక ఉపాధ్యాయుని మునిసిపల్ ఎన్నికలకు యింకొక ఉపాధ్యాయునికి ప్రత్యర్థిగా నిలబెట్టాడు కాని రెండవ ఉపాధ్యాయుడు తాను గెలుస్తానని, ఓడిపోతే మీసం తీయించుకుంటానని సవాలు చేశాడు. ఇతర విద్యార్థులతో కలిసి పటేల్ తన ఉపాధ్యాయుని కోసం ప్రచారం చేసి అతనిని నెగ్గించాడు. వెంటనే మంగలిని తీసుకుని వెళ్లి ప్రత్యర్థిని తన సవాలును నెరవేర్చుకోమన్నాడు. పటేల్‌యొక్క నిర్వహణ అంత సమర్థవంతమైనది. సాధారణంగా అతడు ఎవరితోను జోక్యం కలిగించుకోక పోయినా, విద్యార్థులందరూ అతనిని గౌరవిస్తారు.



# ౨. బాల్యం - విద్య

వల్లభ్‌భాయి సూరత్‌కి సమీపంలో ఉన్న నాదియాడ్‌లో 31 అక్టోబరు, 1875 లడ్‌బాయికి జన్మించాడు. అతని తండ్రి ఝూవేరిభాయి. వల్లభ్‌భాయి వీరులైన పాతిదారు జాతిలో పుట్టాడు. ఈ జాతివారు సుమారు 5వ శతాబ్దంలో ఉత్తరప్రదేశ్ నుండి గాని, పంజాబునుండి గాని, గుజరాత్‌కు వలసవచ్చి ఉంటారని పండితుల విశ్లేషణ. మొగలాయీలు గుజరాత్‌పై దాడిచేసినప్పుడు భారతసైన్యంలో ముందు వరుసలో ఉండి వీరు యుద్ధం చేశారు. మరాఠాలు మొగలులపై దండెత్తినప్పుడు వీరు మరాఠాలకు సహాయం చేసారు. బరోడా రాష్ట్రాన్ని స్థాపించడానికి పాతిదార్లు పిలాజీరావ్‌గైక్వాడ్‌కు సహాయం చేశారు.

ఝూవేరీభాయికి ఆరుగురు సంతానం. అయిదుగురు కుమారులు, ఒక కుమార్తె. వారు కరమ్‌సాద్‌లో నివసించేవారు. అతని భార్య లడ్‌బాయి సమర్థురాలైన గృహిణి. తక్కువ ఖర్చుతో కుటుంబాన్ని గడిపేది. సాయంకాలం ఆమె తన పిల్లలకు భక్తిపూరితమైన పాటలు పాడి వినిపించేది. రామాయణ, మహాభారత కథలు చెప్పేది. పటేల్ మీద ఆ కథలు చెరగని ముద్ర వేశాయి. అతడు పెద్దవాడయిన తరువాత తన ప్రసంగాలలో ఆ కథలను ఉదాహరణలుగా చెప్పేవాడు.

ఝూవేరిభాయి నిలకడలేని మనస్సు కలవాడు. అతని ఆలోచనలు మారుతూ ఉండేవి. ఆ గ్రామంలో ఉన్న ఆలయానికి వెళ్లి పూజలు చేసేవాడు. సాధువులను యింటికి



తీసుకుని వచ్చి భోజనం పెట్టేవాడు. అతడు లడ్ బాయిని వివాహం చేసుకొనకముందు యింటి నుండి పారిపోయి ఝాన్సీరాణి సైన్యంలో చేరాడు. ఆమె చనిపోయిన తరువాత యింటికి తిరిగివచ్చి వ్యవసాయం చేశాడు. అతడు వల్లభ్‌భాయి విద్య గురించి ఎక్కువగా పట్టించుకోకపోయినా, మతబోధ చేసి, సత్ప్రవర్తనునిగా తయారుచేశాడు.

వ్యవసాయ కుటుంబం నుండి వచ్చినందువల్ల తరువాత అతడు బారిస్టర్ అయినా తాను రైతునని గర్వంగా చెప్పేవాడు. రైతుల సంక్షేమం గురించి అతడు చాలా శ్రద్ధ తీసుకున్నాడు. 1971లో గుజరాత్‌లోని ఖేడా జిల్లాలోని రైతులతో శాంతియుత పోరాటాన్ని చేయించాడు. దానివల్ల అతడు ఒక్కసారిగా నాయకుడైపోయాడు. అతడు, "నా సంస్కృతి వ్యవసాయ సంస్కృతి" అనేవాడు. అతడు ప్రకృతి ప్రేమికుడు కూడా.

గ్రామంలో ఉన్న స్కూలులో పటేల్ చదివినప్పటికీ అతని తండ్రి అతనికి బోధించాడు. ఎవరి సహాయం లేకపోయినా అతడు స్వయంకృషితో చదువుకున్నాడు. స్కూలులోని ఉపాధ్యాయులు ప్రోత్సహించేవారు కాదు. స్వంతంగా తానే పుస్తకాలు చదువుకునేవాడు. ఆ విధంగా ఇంగ్లీషు నేర్చుకున్నాడు. అతనికి చాలా గొప్పవాడు కావాలనే కోరిక ఉండేది. ఆ కాలంలో ఎక్కువమంది నాయకులు లాయర్లే. అందువల్ల తానుకూడా లాయరు కావాలనుకునేవాడు. ఎక్కువ చదువులకోసం పెట్లాడ్ అనే గ్రామానికి వెళ్లాడు. ఆ గ్రామం తన గ్రామానికి ఏడు మైళ్ల దూరంలో ఉంది. కొంతమంది స్నేహితులతో కలిసి ఒక చిన్న యిల్లు అద్దెకు తీసుకున్నారు. వారు ఎప్పుడు చూసినా కలిసే ఉండేవారు. కాబట్టి వారిని "ఏడుగురు" అనేవారు.


వల్లభ్‌భాయి ఒకప్రక్క చదువుతూ ఉండగానే తల్లిదండ్రులు అతనికి పెళ్లి చేయాలని నిశ్చయించుకున్నారు. అప్పటివారి ఆచారం ప్రకారం అతనిది పెద్దలు నిశ్చయించిన వివాహమే. వల్లభ్‌భాయి తన తొమ్మిదవయేటనే జావేరిబాయిని వివాహం చేసుకున్నాడు. ఆమెది ప్రక్క ఊరే.

వల్లభ్‌భాయిపటేల్ పుట్టుకతోనే నాయకుడు. అన్యాయంగా తోటి విద్యార్థుల్ని ఉపాధ్యాయులు శిక్షిస్తే విద్యార్థుల హక్కులకోసం చిన్నతనంలోనే ఉపాధ్యాయులతో పోరాడాడు. ఒక విద్యార్థిని అన్యాయంగా శిక్షించినందుకు తన నిరసన తెలియచేశాడు. ఉపాధ్యాయుని తరఫున ప్రధాన ఉపాధ్యాయుడు క్షమాపణ కోరాడు. ఇంకొకసారి ఒక ఉపాధ్యాయడు ఒక వ్యాపారం పెట్టి విద్యార్థులందరూ పుస్తకాలు, పెన్సిళ్లు తనవద్దనే కొనాలని నిర్బంధించేవాడు. వాటిని ఎక్కువధరలకు అమ్మేవాడు. పటేల్ విద్యార్థులచేత వాటిని కొనడం మానిపించాడు. ఉపాధ్యాయుడు వాటి ధరలను తగ్గించాడు.

స్థానిక రాజకీయాలలో కూడా పటేల్ ప్రముఖపాత్రని పోషించేవాడు. నాదియాడ్ మునిసిపాలిటీకి అభ్యర్థిగా తన ఉపాధ్యాయుని నిలబెట్టాడు. దానికి ప్రత్యర్థి ధనికుడైన ఒక వ్యాపారి. అతడు ఉపాధ్యాయునికి సవాలు విసిరాడు. తాను ఓడిపోతే తన మీసాన్ని తీసివేస్తానన్నాడు. పటేల్ తన ఉపాధ్యాయునికోసం సహవిద్యార్థులతో కలిసి ప్రచారం చేసి గెలిపించాడు. సరాసరి ఆ వ్యాపారివద్దకు మంగలిని తీసుకుని వెళ్లి అతని మీసాన్ని తీయించివేశాడు.

ఆ విధంగా స్థానిక రాజకీయాలలో పాల్గొనడం వల్ల పటేల్‌కి ఆత్మవిశ్వాసం కలిగింది. అతనికి బాగా పేరు వచ్చింది. వల్లభ్‌కి పాశ్చాత్యుల ఆటలైన క్రికెట్టు మొదలైనవి యిష్టంలేదు. భారతీయ ఆటలనే యిష్టపడేవాడు. ముఖ్యంగా అతనికి కుస్తీ అంటే చాలా యిష్టం. అతడు ఆడేవాడు కూడా. అందువల్లనే అతని శరీరం దృఢంగా ఉండేది.


22 సంవత్సరాలకు వల్లభ్‌భాయి మెట్రిక్యులేషన్ ప్యాసయ్యాడు. పై చదువులకు తల్లిదండ్రులు అతన్ని బొంబాయి పంపుదామనుకున్నారు. కాని తాను బొంబాయి వెళ్తే తండ్రికి ఎవరు సహాయం చేస్తారనుకున్నాడు. కాని జిల్లా ప్లీడరు పరీక్షలు రాయడానికి ఒక స్థానిక లాయరు వద్ద పనిచేశాడు. అతనివద్దనున్న న్యాయశాస్త్రానికి సంబంధించిన పుస్తకాలను చదివాడు. పరీక్ష ప్యాసయ్యాడు. లాయరు వృత్తిలోకి ప్రవేశించాడు.



# 3. న్యాయవాద వృత్తి

గుజరాత్‌లో గోధ్రా ఒక పెద్ద గ్రామం. అక్కడ చిన్న చిన్న ఉద్యోగులు, చిన్న షాపులు, రైతులు మాత్రమే ఉండేవారు. ఆధునికత అక్కడ యింకా ప్రవేశించలేదు. ఆ గ్రామం చుట్టుప్రక్కల ఉన్న ప్రదేశాలు సమాచారసేకరణకు అనువుగా ఉండడంవల్ల అది హెడ్‌క్వార్టర్స్ అయింది. చిన్నచిన్న కేసులు పరిష్కరించడానికి అక్కడ కోర్టు ఉంది. వల్లభ్‌భాయి తన ప్రాక్టీసు కోసం యీ ఊరుని ఎంచుకున్నాడు. తనవద్ద పెద్ద పట్టణాలలో ప్రాక్టీసు చేయడానికి తగినంత డబ్బులేదు. తన స్నేహితునివద్ద కొంత డబ్బు అప్పు తీసుకుని గోధ్రాలోనే ప్రాక్టీసు మొదలుపెట్టాడు. అతనికి అంతకుముందే గోధ్రాతో పరిచయం ఉండడంకూడా అతనికి కలిసి వచ్చింది.

అతడు గోధ్రాలో రెండు సంవత్సరాలు మాత్రమే పనిచేశాడు. అతని ప్రాక్టీసు రాను, రాను అభివృద్ధిచెందింది. ఏడాదిలో అతడు 600/– రూపాయలు సంపాదించాడు. ఆ రోజుల్లో అది చాలా ఎక్కువే. గోధ్రాలో ప్రాక్టీసువల్ల అతడు సుశిక్షితుడయ్యాడు. అక్కడ కొంతమంది లాయర్లు మేజిస్ట్రేట్లకు బానిసలుగా ఉన్నారు. అటువంటి నీచమైన పని వల్లభ్‌భాయికి నచ్చదు. మేజిస్ట్రేటుకి అతడు మర్యాద యిచ్చేవాడు కాని తాను గొప్ప అనే భావన అతనికి కలగనిచ్చేవాడు కాదు. అందువల్ల లాయర్లు అతనిని దూరంగా ఉంచేవారు. ఇటువంటి పరిస్థితుల్లో గోధ్రాను విడిచిపెట్టాలనుకున్నాడు. అదే సమయంలో ప్లేగు వ్యాధి ప్రబలింది. అందువల్ల కూడా అతడు గోధ్రాను విడిచిపెట్టవలసివచ్చింది.



ఆ రోజుల్లో ఆ వ్యాధికి కారణాలు డాక్టర్లకు కూడా తెలియవు. కాబట్టి దానిని ఎలా నయం చేయాలో వారికి తెలియదు. అధికారులు ప్రజల్ని ఆ ప్రదేశాలన్నుండి ఖాళీ చేయమని చెప్పారు. ఆ వ్యాధివల్ల చాలామంది మరణించారు. వల్లభ్‌భాయి వారికి సహాయం చేద్దామనుకున్నాడు కాని ఆ వ్యాధి అతనికి కూడా సోకింది. కాబట్టి అతడు గోధ్రాని విడిచివెళ్లవలసివచ్చింది. భార్యని కరమ్‌సాద్‌కి పంపించివేశాడు. అతనికి విపరీతంగా తలనొప్పి, జ్వరం వచ్చాయి. అతడు నాదియాడ్ వెళ్లి ఒక పాతబడిన ఆలయంలో ఉన్నాడు. రానురాను కోలుకున్నాడు. అతడు కోలుకోవడం ఒక అద్భుతం. అది దేవుని కృప అన్నారందరూ. ఎంత బాధ ఉన్నప్పటికీ ఓర్చుకునే తత్వం పటేల్‌ది. అతడు చదువుకునేరోజుల్లో అతనికి సెగగెడ్డలేచింది. అది చాలా బాధపెడుతూంది. స్నేహితులు ఆపరేషన్ చేయాలని సూచించారు. అది ఆ గ్రామంలోని మంగలి చేస్తాడు. మంగలి ఒక యినుపకడ్డీని తెచ్చాడు. దాని చివర బాగా కాల్చాడు. ఆ కాలుతూ, ఎర్రగా ఉన్న కొనని గెడ్డమీద పెట్టాలి. పటేల్ చాలా చిన్నవాడు కాబట్టి తట్టుకోలేడనుకున్నాడు మంగలి. వెంటనే పటేల్ ఆ కడ్డీని తీసుకుని గెడ్డమీద పెట్టుకున్నాడు.

ఆ కాలంలో ఇంగ్లీషువారు తామే అధికులమని చెప్పుకునేవారు. ఎవరైనా వారిని కించపరిస్తే తీవ్రంగా కొట్టేవారు. వల్లభ్‌భాయి అన్న విఠల్‌భాయి అవినీతికి పాల్పడినందుకు ఒక న్యాయమూర్తిని నిందించాడు. ఆ నిందను ఋజువు చేయమన్నారు. అతడు ఋజువు చేశాడు. బొంబాయి హైకోర్టు ఆ నిందలో ఎంతవరకు నిజం ఉందో తేల్చమని ఒక కమిషన్‌ని ఏర్పాటుచేసింది. వారుకూడా ఆ నింద నిజమని తేల్చారు. ఉద్యోగులందరూ విఠల్‌భాయి మీద కక్షగట్టారు. విఠల్‌భాయి, వల్లభ్‌భాయి విరోధులుగా ఉన్నట్లు నటించారు. న్యాయమూర్తి ఏ కేసులోనైనా వల్లభ్‌భాయి పక్షాన తీర్పు యిచ్చేవాడు. వల్లభ్‌కి వచ్చిన డబ్బు యిద్దరూ పంచుకునేవారు.

వల్లభ్‌భాయి తీరికలేని న్యాయవాది అయ్యాడు. అతడు క్రిమినల్ కేసుల్నే తీసుకునేవాడు. దానివల్ల అతడు చాలా డబ్బు సంపాదించాడు. అతడు పోలీసుల్ని నిశితంగా క్రాస్-ఎగ్జామినేషన్ చేసేవాడు. అతడు నిందితునిపక్షాన నిలబడేవాడు. వల్లభ్‌భాయి విజయరహస్యం ఏమిటి ? అతడు మానవస్వభావాన్ని క్షుణ్ణంగా పరిశీలించగలగడమే అతని విజయరహస్యం. అంతేకాదు అతనికి న్యాయశాస్త్రజ్ఞానం, విషయాలను రాబట్టే నేర్పుకూడా ఉంది. కేసుని విశ్లేషించడంలో అతనికి నేర్పు ఉంది. లండన్ వెళ్లి బారిస్టర్ అయి న్యాయవాదవృత్తిని స్వీకరించినవారు బాగా పేరు, డబ్బు సంపాదించేవారు. కాబట్టి వల్లభ్‌భాయి కూడా లండన్ వెళ్లి తన ప్రతిష్ఠను పెంచుకోవాలనుకున్నాడు. లండన్ వెళ్లడానికి ప్యాసేజి వచ్చినా, నాలుగు సంవత్సరాల తరువాత కాని లండన్ వెళ్లలేకపోయాడు. ఎందుకంటే విఠల్‌భాయికి మొదట ప్యాసేజి వచ్చింది. అందువల్ల అతడు ముందుగా వెళ్లాలనుకున్నాడు. వల్లభ్‌భాయి తన అన్ననే ముందుగా ఇంగ్లండు పంపించాడు. అతని కుటుంబపోషణ తాను చూశాడు.

విఠల్‌భాయి భార్య దివాలీబాయి ఆమె ఎవరితోను సర్దుబాటు చేసుకుని ఉండలేని వ్యక్తి. అన్నదమ్ముల మధ్య అంత ప్రేమ ఉండడం ఆమెకు యిష్టంలేదు. వల్లభ్‌భాయికి తన వదినె స్వభావం బాగా తెలుసు. దివాలీబాయి సాధువుల్ని, బిచ్చగాళ్లను యింటికి తీసుకుని వచ్చి భోజనాలు పెట్టేది. ప్రతిరోజూ ఆమె అలా చేస్తూ ఉండడంతో వల్లభ్‌భార్య అడ్డుపెట్టింది. ఇంట్లో కలహాలు మొదలయ్యాయి. వారిద్దర్నీ శాంతింపచేయలేక తన భార్యని ఆమె పుట్టింటికి పంపించేశాడు.

విఠల్‌భాయి లండన్‌నుండి తిరిగివచ్చి తన భార్యని బొంబాయికి తీసుకునివెళ్లి అక్కడ స్థిరపడ్డాడు. తన భార్యాపిల్లల్ని వల్లభ్ తిరిగి తీసుకునివచ్చాడు. కాని జావేరిబాయి తీవ్రంగా వ్యాధి పాలయింది. ఆపరేషన్ చేయాలన్నారు. ఆమెను బొంబాయిలో ఒక హాస్పిటల్‌లో చేర్పించారు. ఆపరేషన్ చేసే తేదీ తెలియజేయమని అన్నకు చెప్పి తాను ఒక క్రిమినల్ కేసుని వాదించడానికి వెళ్లాడు. కాని ఆమె పరిస్థితి తీవ్రస్థాయిలో ఉండడంవల్ల వల్లభ్‌భాయి రాకముందే ఆపరేషన్ జరిగిపోయింది. ఆపరేషన్ విజయవంతమయింది. కాని మరునాడే ఆమె పరిస్థితి దిగజారిపోయింది. తనవద్ద ఎవరూ లేని స్థితిలో ఆమె మరణించింది. వల్లభ్‌కి టెలిగ్రాం అందినప్పుడు అతడు ఒక సాక్షిని విచారిస్తున్నాడు. అతడు తన బాధని తట్టుకుని న్యాయమూర్తి లేచేవరకు కోర్టులోనే ఉండి, ఆ తరువాత



తన భార్య మరణవార్త అందరికీ తెలియచేశాడు. అతనికి అప్పుడు 33 సంవత్సరాల వయస్సు.

వల్లభ్‌భాయిని లండన్‌వెళ్లి బారిస్టరు చదవమని విఠల్‌భాయి చెప్పాడు. అలాగైనా భార్య మరణాన్ని మరచిపోతాడని అతని ఉద్దేశం. వల్లభ్‌భాయి అంగీకరించాడు. లండన్ వెళ్లేముందు తన కుమార్తె మణిబెన్‌ని, కుమారుడు దీహ్యాభాయిని బొంబాయిలోని క్వీన్ మేరీ హైస్కూలు ప్రిన్సిపాల్ అయిన మిల్‌విల్సన్‌కి అప్పజెప్పాడు. ఆమె వారిని క్రిస్టియన్లుగా మార్చేస్తుందని సనాతనులు ఆక్షేపించారు. కాని వల్లభ్‌భాయికి విశ్వాసం ఉంది. ఆమెవద్ద ఉంటే వారికి ఇంగ్లీషు బాగా వస్తుందని అతని ఉద్దేశం.

బోర్సాద్ కోర్టులో వల్లభ్‌యొక్క చివరిరోజు గుర్తుంచుకోతగినది. చంపక్‌లాల్ అనే కంసాలి, పొరుగువాని భార్యతో వ్యభిచరించాలనుకున్నాడు. అతనికి ఆరునెలలు కఠినకారాగారశిక్ష విధించబడింది. వల్లభ్‌భాయి అతని తరఫున వాదించాడు. న్యాయమూర్తి కోర్టుకి ఆలస్యంగా వచ్చాడు. గుమస్తా ఏదో విషయం మీద వల్లభ్‌ని వివరణ అడిగాడు. వల్లభ్‌కి చాలా కోపం వచ్చింది. ఒక గుమాస్తా ఎదుట కేసుని వాదించడానికి తాను రాలేదని చెప్పాడు. తరువాత న్యాయమూర్తి వ్యభిచారం క్రిమినల్ కేసు కింద వస్తుందా అని పటేల్‌ని ప్రశ్నించాడు. గుమస్తాలాంటి ఛాందసులుంటే అప్పుడు క్రిమినల్ కేసు క్రిందకు వస్తుందని చెప్పాడు. న్యాయమూర్తి నిందితుని విడుదల చేశాడు.


మరునాడే వల్లభ్ లండన్ బయలుదేరాడు. తన ప్రయాణాన్ని రహస్యంగా ఉంచాడు. తిరిగివచ్చిన తరువాత అందర్నీ ఆశ్చర్యపరచాలని అతని ఉద్దేశం. లండన్ చేరిన తరువాత అక్కడున్న ముఖ్యమైన ప్రదేశాలన్నింటినీ సందర్శించాడు. అతనికి మిడిల్‌టెంపుల్‌లో ప్రవేశం లభించింది. మొదట అతడు ఒక హోటల్‌లో బసచేశాడు. కాని అది చాలా ఖరీదు కావడంతో బేయిస్‌వాటర్‌కు బస మార్చాడు. అతడు రాను పోను నడవవలసి వచ్చింది. గ్రంథాలయాన్ని పూర్తిగా ఉపయోగించుకున్నాడు. దాదాపు పదిగంటలు అక్కడే గడిపేవాడు.

ప్రతి విద్యార్థి 12 టెర్ములు చదవాలి. ఆరవటెర్మ్ తరువాత చివరి పరీక్ష రాయదలచుకుంటే వారు ఎక్కువమార్కులు సంపాదించాలి. వల్లభ్‌భాయి బాగా చదివి అర్హత సంపాదించాడు. చివరి పరీక్షలో కూడా బాగా మార్కులు సంపాదించాడు.

ఇండియన్ సివిల్ సర్వీస్ సభ్యులకు పాతిదారు పటేల్ కమ్యూనిటీ అంటే చాలా గౌరవం. ఎందుకంటే వారు కష్టపడి పనిచేస్తారు. వ్యాపారంలో వారికి నైపుణ్యం ఉంది. వల్లభ్ పరీక్షలో ప్యాసయినందుకు గోర్డన్‌షెపర్డ్ అతనిని అభినందించాడు. కష్టపడి చదవడంవల్ల, సరియైన వేళకు సరియైన ఆహారం లేకపోవడంవల్ల వల్లభ్ ఆరోగ్యం క్షీణించింది. ఇంకొక రెండు టెర్ములు మినహాయింపు యివ్వమని కోరాడు. కాని వారు అంగీకరించలేదు. అతనికి వైద్యం చేయించారు. ఆ సమయంలోనే అతడు ఐర్లాండ్, స్కాట్లాండులను సందర్శించాడు.

లండన్ నుండి తిరిగివచ్చిన తరువాత తన క్లయింట్లు అహ్మదాబాద్‌లో ఉండడంవల్ల అక్కడ ప్రాక్టీసు పెట్టాలనుకున్నాడు. ఎక్కడున్నా తన ప్రతిభను, సమర్థతను చూపగల ననుకున్నాడు. అతనికి రాజకీయాలలో ఆసక్తి లేదు. అతడు ఇంగ్లండులో ఉన్నప్పుడు ఇండియాలో బ్రిటిష్ ప్రభుత్వంపై తిరుగుబాట్లు జరిగాయి. గొప్ప నాయకులైన బిపిన్ చంద్రపాల్ ఇంగ్లండు వెళ్లి భారతీయ విద్యార్థుల్ని రెచ్చగొట్టాడు. కాని వల్లభ్ వేటిలోను పాల్గొనలేదు. ఇంటికి తిరిగివచ్చాడు. అప్పటికే విఠల్‌భాయి బొంబాయి లెజిస్లేటివ్ అసెంబ్లీకి సభ్యునిగా ఎన్నికయ్యాడు. వల్లభ్ 1921లో చేసిన ప్రసంగంలో, "మన స్వాతంత్ర్యం కోసం పోరాడేటప్పుడు పేదవారిగానే ఉండడానికి సిద్ధంగా ఉండాలి" అన్నాడు.

అహ్మదాబాద్ వల్లభ్ గొప్ప క్రిమినల్ లాయర్ అయ్యాడు. అతడు కేసుల్ని పరిష్కరించే విధానం గురించి ఒక స్నేహితుడు యిలా అన్నాడు. "అతడు సాక్షుల్ని క్లుప్తంగా క్రాస్ -ఎగ్జామిన్ (విచారణ) చేస్తాడు. అది చాలా సూటిగా ఉంటుంది. వ్యక్తిని చూడగానే అతడు ఎలాంటివాడో కనిపెట్టగలడు. కేసు ఎంత జటిలమైనా విజయం అతనిదే" అతడు ధైర్యవంతుడే కాని, మొండివైఖరి కాదు. అతడు న్యాయమూర్తినైనా, ప్రాసిక్యూటింగ్ కౌన్సిల్‌నైనా, పోలీసునైనా విడిచిపెట్టడు. ఉన్నది ఉన్నట్లుగా కుండబద్దలు కొట్టినట్లు చెబుతాడు. ఒక న్యాయమూర్తి చూపే పక్షపాతాన్నైనా బహిర్గతం చేస్తాడు. ఎప్పుడూ, ప్రతి కేసులోను విజయం వల్లభ్‌భాయిదే.



# 4. బారిస్టరుగా

వల్లభ్‌భాయి ఇంగ్లాండు ఎందుకు వెళ్లాడు ? దానికి రెండు కారణాలున్నాయి. తన న్యాయవాదవృత్తిని మెరుగుపరుచుకోడానికీ, ఇంగ్లాండులోని అన్ని సంస్థల్ని సందర్శించి, బ్రిటిష్‌వారు రవి అస్తమించని సామ్రాజ్యాన్ని ఎలా నిర్మించగలిగారో తెలుసుకోడానికి వెళ్లాడు. అతని కోరిక నెరవేరింది. అతడు మిడిల్ టెంపుల్ ప్రవేశించి, బాగా చదివి ఉపకారవేతనాలను కూడా పొందాడు. అతడు ఒక సంవత్సరం ముందుగానే కోర్సుని పూర్తిచేశాడు. ఇంకా ఒక యేడాది మిగిలింది. ఆ యేడాది అతడు ఇంగ్లాండులోని కోర్టుల్ని సందర్శించి, వాటి పనితీరును తెలుసుకున్నాడు. బ్రిటిష్‌వారి రాజ్యాంగంలో హక్కుల్ని గురించి లేకపోయినా అక్కడి ప్రజలు తమ హక్కుల్ని అనుభవిస్తున్నారు, వారు చట్టాన్ని గౌరవిస్తారు. వారు తమ జాతీయ వారసత్వాన్ని గురించి, తమ సాంప్రదాయాలను గురించి గర్వంగా చెప్పుకుంటారు. వారిలో పరస్పర భిన్నాభిప్రాయాలున్నా సామరస్యంగా పరిష్కరించుకుంటారు. వారు యితరులకు మర్యాద ఇస్తారు, కాని వారికి తామే అందరికంటే గొప్పవారమనే గర్వం ఉంది వారికి అధికారం కావాలి.

జీవితంలోని మంచిని ఆస్వాదించాలంటాడు వల్లభ్‌భాయి. అతడు ఇండియాకి తిరిగి వచ్చినప్పుడు సూట్లు, టోపీలు తెచ్చాడు. అతడు నిర్విరామంగా సిగరెట్లు కాల్చేవాడు. తరువాత గాంధీ ప్రభావం వల్ల మానుకున్నాడు. అతనికి బొంబాయిలో న్యాయమూర్తి పదవిని యిస్తామన్నారు. కాని తాను న్యాయవాదిగానే ఉంటానన్నాడు. అతడు స్వతంత్రుడు.

ఎవరికీ బానిసగా ఉండదలుచుకోలేదు. పైగా అతడు న్యాయవాదిగా చాలా సంపాదిస్తున్నాడు. బొంబాయి లా కాలేజీలో ప్రొఫెసరుగా ఉండమన్నారు. కాని అతడు గుజరాత్‌లోనే న్యాయవాదిగా ఉంటానన్నాడు. అతడు అహమ్మదాబాదులో చిన్న యిల్లు అద్దెకు తీసుకుని 1930 వరకు అక్కడే ఉన్నాడు. ఇప్పుడు ఆ యిల్లు లైబ్రరీగాను,రీడింగ్‌రూమ్‌గాను ఉపయోగపడుతూంది.

అహమ్మదాబాద్‌లో వస్త్ర పరిశ్రమ ఉంది. అక్కడి ప్రజలు ధనవంతులైనా నిరాడంబర జీవితాన్ని గడుపుతారు. వారు స్నేహశీలురు. ఆధ్యాత్మిక తత్పరులు. అక్కడ వల్లభ్ క్రిమినల్ కేసులు వాదించేవాడు. గొప్ప న్యాయవాదిగా పేరుపొందాడు. కేసు వాదించడానికి చాలా డబ్బు తీసుకునేవాడు. కేసును తప్పక గెలిచేవాడు. హత్యానేరం మీద కైరా జిల్లాలోని యిద్దరు వ్యక్తుల కేసులు వాదించాడు. వారిని బెయిలు మీద విడిచిపెట్టమని కోర్టుని కోరాడు. కాని పోలీసులు అభ్యంతరం తెలియజేశారు. పైగా కైరా జిల్లాలోని వారందరూ నేరస్తులే అని నిందించారు. వల్లభ్ కూడా ఆ జిల్లావాడే. కాబట్టి కైరా జిల్లావారికి అక్కడ న్యాయం జరగదని వల్లభ్ చెప్పాడు. వెంటనే న్యాయమూర్తి వారిద్దరినీ బెయిలు మీద విడుదలచేశాడు.

సాయంకాలాలలో వల్లభ్‌భాయి గుజరాత్ క్లబ్బుకి వెళ్లేవాడు. అతడు పేకాటలో నైపుణ్యం కలవాడు. అతడు పేకాటలో ఛాంపియన్‌గా గుర్తించబడిన వ్యక్తిని ఓడించాడు. ఆ క్లబ్బులో వల్లభ్ ప్రపంచంలో జరుగుతూన్న విషయాలను గురించి, వ్యక్తుల గురించి చర్చించేవాడు. విదేశీయుల పాలన మన దేశ ప్రజల ప్రవర్తనను పునాదిరాళ్లతో పెకలించివేసింది అనేవాడు. విదేశీప్రభుత్వం మనదేశభక్తి భావాలను అణచివేసింది. వల్లభ్ అటువంటి విధానాలను మార్చాలనుకున్నాడు. కాని అతనికి ఏ మార్గమూ కనపడలేదు. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కూకటివేళ్లతో పెకలించడం చాలా కష్టమనుకున్నాడు. అయినా అతడు రాజకీయాలవైపు మొగ్గుచూపలేదు. కుటుంబ పోషణకు తగినంత డబ్బు సంపాదిస్తే చాలనుకున్నాడు.

ఇండియా రాజకీయాలలో మార్పు వచ్చింది. బెంగాలును విభజించారు. రాజకీయ నిస్తబ్దత ఏర్పడింది. తరువాత ప్రపంచయుద్ధం వచ్చింది. బ్రిటిష్‌వారు యుద్ధంలో పాల్గొనవలసిందిగా ఇండియాను కోరారు. నిత్యావసరాల ధరలు పెరిగాయి. ఆహారపదార్థాలు సైనికుల కోసం తరలించారు. అదే సమయంలో ప్రభుత్వంలో వాటా యివ్వమని బ్రిటిష్‌వారిని ఇండియా కోరింది. బాలగంగాధరతిలక్ “హోంరూల్‌లీగ్”ని



స్థాపించాడు. అనిబిసెంట్ "ఆలిండియా హోంరూల్‌లీగ్''ను స్థాపించింది. వల్లభ్‌భాయి వీటిని పట్టించుకోలేదు. ఆ సమయంలో గాంధీ చంపారణ్ వచ్చాడు. బ్రిటిష్‌వారు గాంధీని ఆ జిల్లా విడిచి పెట్టి వెళ్లవలసిందిగా ఆదేశించారు. కాని గాంధీ వెళ్లలేదు. అంతకుముందు గాంధీ దక్షిణాఫ్రికాలో సత్యాగ్రహాన్ని చేపట్టాడు. భారతీయ కార్మికులపై విధించిన వార్షికపన్నును తీసివేయమన్నాడు. అది విజయవంత మయింది. గాంధీ గుజరాత్ క్లబ్బుకి వచ్చి ప్రజలను కార్యోన్ముఖులను చేయాలనుకున్నాడు. కాని వల్లభ్‌భాయిలో చలనం లేదు. అయితే గాంధీ చంపారణ్‌లో బ్రిటిష్‌వారికి ఎదురు నిలిచాడని తెలియగానే పరిస్థితుల్ని అర్థంచేసుకున్నాడు.

గుజరాత్‌క్లబ్బు 30 సంవత్సరాలకు పైగానే నిర్వహించబడుతూంది. కాని విలువైన పనులు ఏవీ చేయలేదు. అక్కడికి వచ్చినవారు గౌరవబిరుదులు కోసం మాత్రమే ఆలోచించేవారు. ఇంకొక ప్రక్క ప్రజల దృష్టిలో వారు దేశభక్తులుగా చలామణి అవుతున్నారు. వారు సమావేశాలు ఏర్పాటుచేస్తారు. తీర్మానాలు చేస్తారు. వాటిని ప్రభుత్వానికి అందజేస్తారు. కాని పర్యావసానం ఏమీ ఉండదు. వారు గాంధీని సమావేశానికి అధ్యక్షత వహించమని వల్లభ్‌ని కార్యదర్శిగా చేశారు. అప్పటినుండి వల్లభ్‌భాయి గాంధీ అనుయాయిగా మారిపోయాడు. ఆ సమావేశంలో గాంధీ తన ప్రసంగంలో భారతీయులకు రావలసినది యివ్వవలసినదిగా బ్రిటిష్ ప్రభుత్వాన్ని కోరాడు. గోధ్రాలో కూడా ఒక సభ జరిగింది. అది ఇంగ్లీషులో జరిగింది. కాబట్టి తీర్మానాలు గుజరాతీలో చేయమని గాంధీ చెప్పాడు. ప్రజలు గాంధీ యెడల ఆకర్షితులయ్యారు. గుజరాత్ సభ ప్రజాసంస్థగా మారింది.

సభ తీసుకున్న మొదటి నిర్ణయం వెట్టిచాకిరి నిర్మూలన. వల్లభ్ ప్రభుత్వానికి మూడు లేఖలు రాసినా ప్రభుత్వం స్పందించలేదు. వెంటనే అతడు ప్రజల హక్కుల గురించి కరపత్రాలు పంచిపెట్టాడు. ఇది వల్లభ్ యొక్క మొదటి తిరుగుబాటు సభ హక్కులకోసం పోరాడడమేకాక, ప్రజలకు సేవకూడా చేసింది. కైరాజిల్లాలో వరదలు

వచ్చినప్పుడు సభ సహాయక కార్యక్రమాలను చేపట్టింది. అహమ్మదాబాద్‌లో ప్లేగువ్యాధి వచ్చినప్పుడు ప్రజలను ఆ ప్రదేశాలనుండి ఖాళీచేయించి తాత్కాలిక ఆసుపత్రులను నెలకొల్పింది.

అధిక వర్షాల వల్ల కైరాజిల్లాలో పంటలు నాశనమయ్యాయి. అయినా ప్రభుత్వం పన్ను విధించింది. వారు అభ్యంతరాన్ని తెలియజేసినా లాభం లేకపోయింది. వారు వల్లభ్‌భాయి సహాయం కోరారు. సత్యాగ్రహం చేయమని గాంధీ ఆదేశించాడు. కమిషనర్‌ని పరిస్థితులను గురించి విచారణ జరపవలసినదిగా వల్లభ్ కోరాడు. కాని బలవంతంగానైనా పన్ను వసూలు చేస్తామని అతడు చెప్పాడు. రైతుల భూముల్ని తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించాడు. కాని రైతులు భయపడలేదు. కట్ట గలిగినవారు కట్టమని చివరకు ప్రభుత్వం ఆదేశించింది. సత్యాగ్రహం విజయవంతమయింది. అప్పటినుండి వల్లభ్‌భాయి దేనికయినా సత్యాగ్రహ ఆయుధాన్నే ఉపయోగించాడు. వల్లభ్ యొక్క సామర్థ్యం గురించి గాంధీకి తృప్తి కలిగింది.

వల్లభ్‌భాయి చేతలవాడు కాని మాటలవాడు కాదు. అహమ్మదాబాద్ మునిసిపాలిటీకి మొదటి కమిషనర్‌గా జె.ఎ. షిల్లిడీని నియమించారు. కాని అతడు ఆ పదవికి అనర్హుడు. అతడు నియంతగా మారాడు. ఆ సమయంలో వల్లభ్‌యొక్క స్నేహితులు అతనిని మునిసిపాలిటీలో అడుగుపెట్టవలసిందిగా ప్రోత్సహించారు. అతడు అంగీకరించాడు. అతడు కౌన్సిలర్‌గా ఎన్నికయ్యాడు. మునిసిపాలిటీలో జరుగుతున్న పరిస్థితుల్ని వల్లభ్ అవగాహన చేసుకున్నాడు. అంతా అవినీతిమయమని తెలుసుకున్నాడు. షిల్లిడీని బర్తరఫ్ చేయవలసిందిగా కోరి, అతనికి వ్యతిరేకంగా వాదించి, అతనిని బర్తరఫ్ చేయించగలిగాడు. అదేవిధంగా, అనుభవంలేని ఇంజనీర్‌ని కూడా తొలగించగలిగాడు.

మునిసిపాలిటీ పనిచేస్తున్న తీరును నిశితంగా పరిశీలించాడు. ప్రభుత్వోద్యోగులు, పలుకుబడిగలవారు ప్రభుత్వానికి పన్ను చెల్లించడం లేదని గ్రహించాడు. వారిని బహిర్గతం చేసి, వారిచేత పన్నులు కట్టించాడు. అప్పటికే వల్లభ్ రాజకీయాలలో చురుకుగా పాల్గొంటున్నాడు. రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా అతడు ఆందోళనను లేవదీశాడు. మునిసిపాలిటీ కూడా తమ ఉపాధ్యాయుల్ని ప్రభుత్వపాఠశాలలనుండి తీసివేసింది. వారి జీతాలకు, పింఛనుల ఢోకాలేదని వారికి ధైర్యం చెప్పాడు వల్లభ్. మునిసిపాలిటీ యొక్క తీరు ప్రభుత్వం యెడల సహాయనిరాకరణలో ఒక భాగమే. నిరంకుశంగా ఉన్న పాలకులపై మునిసిపాలిటీని పోరాటానికి సిద్ధంచేశాడు.

1924 వల్లభ్‌భాయి మునిసిపాలిటీకి ప్రెసిడెంటు అయ్యాడు. తన కాలాన్నంతటినీ మునిసిపాలిటీ వ్యవహారాల కోసమే వెచ్చించాడు. తన ఉద్యోగులతోపాటు తాను కూడా పట్టణంలో పర్యటించి, ప్రజల సమస్యల్ని తెలుసుకున్నాడు. వెంటనే ఆ సమస్యల్ని తీర్చేవాడు. 1927లో వర్షాలు ఎక్కువగా కురిశాయి. పట్టణం, అంతా నాశనమయింది. వెంటనే వల్లభ్ రాష్ట్రప్రభుత్వాన్ని సత్వర చర్చలు తీసుకోవలసినదిగా ఆదేశించాడు. సహాయకకేంద్రాలు ఏర్పాటయ్యాయి. గోధ్రా, అహమ్మదాబాద్‌లే కాకుండా మొత్తం గుజరాత్ అంతా అతలాకుతలమయింది. ఆ సమయంలో వల్లభ్‌భాయి అసెంబ్లీకి స్పీకరుగా ఉన్నాడు. ప్రభుత్వ సహాయంతోను, ప్రజల వితరణలతోను అనేక సహాయకశిబిరాలను ఏర్పాటుచేశారు. నీరు, ఆహారం సరఫరా అయ్యాయి. తరువాత రైతులకు అప్పులు యిచ్చారు. విత్తనాలు యిచ్చారు. వారంతా తమ కాళ్లమీద నిలబడగలిగారు.

వల్లభ్‌భాయికి తన గృహవాతావరణం సంతోషదాయకంగా లేదు. మునిసిపాలిటీ వ్యవహారాలలో తలమునకలుగా ఉండడంవల్ల తన పిల్లల గురించి పట్టించుకోలేదు. తగిన విద్యను వారికి అందించలేకపోయాడు. వారితో మాట్లాడడానికి కూడా అతనికి సమయంలేదు. తన కుమార్తె మాత్రం తరుచుగా అతనివద్దకు వచ్చేది. వారికి గాంధీయే తండ్రి అయ్యాడు. వారికి విద్య నేర్పించాడు. వల్లభ్‌భాయి కుమార్తె పట్టా పూర్తిచేసి సబర్మతి ఆశ్రమానికి వచ్చింది. ఆశ్రమంలో ఉన్న స్త్రీల సంఘానికి ఆమె సెక్రటరీ అయింది. బార్డోలి పోరాటంలో తండ్రివద్ద సెక్రటరీగా పనిచేసింది. తండ్రిని జాగ్రత్తగా కనిపెట్టుకుని ఉంది.

చీఫ్ ఆఫీసరు పదవికి వల్లభ్‌భాయి నామినేట్‌చేసిన అభ్యర్థిని పోటీచేయనీయలేదు. వల్లభ్‌భాయి తన అధ్యక్షపదవికి రాజీనామా చేశాడు. అతని పాలనలో అహమ్మదాబాద్ మునిసిపాలిటీ ఆదర్శమునిసిపాలిటీగా మారింది. తన ఉద్యోగులకు వల్లభ్‌భాయి ప్రోత్సాహం యిచ్చేవాడు.


తన మునిసిపాలిటీ వ్యవహారాలు చూసుకుంటూనే వల్లభ్ రాజకీయపోరాటంలోకి దిగాడు. ప్రపంచయుద్ధంలో పాల్గొంటే ఇండియాకి స్వాతంత్ర్యం యిస్తామని బ్రిటిష్ ప్రభుత్వం చెప్పింది. కాని యుద్ధానంతరం అధికారం అంతా తమ చేతుల్లో ఉంచుకుని కొంత స్వీయపరిపాలన మాత్రమే యిచ్చింది. గాంధీ రౌలత్ బిల్లును వ్యతిరేకిద్దామనుకున్నాడు. కాని అనారోగ్య కారణాలవల్ల ఆ పనిచేయలేకపోయాడు. అతడు

సివిల్ డిజొబీడియన్స్ ఉద్యమాన్ని ప్రారంభిద్దామనుకున్నాడు. వల్లభ్ మొదలైనవారు సిద్ధంగానే ఉన్నారు. గాంధీ ఆ చట్టానికి శాంతియుతంగా నిరసన తెలియజేయమని ప్రజలకు పిలుపుయిచ్చాడు. ఒక పెద్ద ఊరేగింపు నిర్వహించారు. పోలీసులు కాల్పులు జరిపారు. ప్రజలు ఉద్రిక్తులయ్యారు. ఆ ఊరేగింపు వల్లభ్ నాయకత్వంలో జరిగింది. కాల్పులు జరిగే ప్రదేశానికి గాంధీ వచ్చేసరికి ఆయనను అరెస్టు చేశారు. అది చూసి ప్రజలు యింకా ఉద్రేకపూరితులయ్యారు. హింసాకాండలు మొదలయ్యాయి. వల్లభ్ వాటిని అదుపులోకి తెచ్చాడు. అతనికి జిల్లా పోలీసు సూపరింటెండెంటు సహకరించాడు. తరువాత గాంధీని విడుదల చేశారు. సివిల్ డిజొబీడియెంట్ ఉద్యమానికి అది సమయం కాదని గుర్తించి గాంధీ దానిని ఆపుచేశాడు. కల్లోలాలు ముగిసిన తరువాత కలెక్టరు వారిని జరిమానా కట్టమన్నాడు. వల్లభ్ కూడా జరిమానా కట్టవలసివచ్చింది.

జలియన్‌వాలాబాగ్, యితర సంఘటనలవల్ల వల్లభ్‌భాయికి ప్రభుత్వం యెడల ద్వేషం పెరిగింది. వైస్రాయి తన ఉద్యోగులు చేసిన అరాచకాలను క్షమించి వదిలివేశాడు. తరువాత మార్షల్ లా ప్రవేశపెట్టారు. వల్లభ్ వీటిని సహించలేక పోయాడు. ప్రభుత్వంతో పోరాడాలంటే ఒకే ఒక ఆయుధం సత్యాగ్రహం, సహాయనిరాకరణ. కాని ఒక్కొక్కప్పుడు హింసలు కూడా చెలరేగవచ్చును. ప్రజలకు తరిఫీదు యిస్తే వారు నడుం బిగించగలరనే నమ్మకం వల్లభ్‌భాయికి ఉంది.

నాగపూర్ కాంగ్రెస్ సమావేశంలో "స్వరాజ్"నే కాంగ్రెస్ లక్ష్యంగా చేసుకుంది. విదేశీవస్తు బహిష్కరణ, అస్పృశ్యతానివారణ మద్యపాన నిషేధము మొదలైనవి చేపట్టారు. లాయర్లు తమ ప్రాక్టీసును విడిచిపెట్టారు. కాంగ్రెస్ సివిల్ డిజొబీడియెన్స్ ఉద్యమాన్ని మొదలుపెట్టాలనుకుంది. వ్యవసాయదారుల్ని భూమిశిస్తు కట్టవద్దని చెప్పింది. ఆ విధంగా బార్డోలిలో ఉద్యమం ప్రారంభమయింది. కాని హింసాత్మక సంఘటనలు జరగడంతో ఉద్యమాన్ని ఆపుచేశారు. గాంధీకి ఆరు సంవత్సరాలు జైలుశిక్ష విధించారు.

ప్రభుత్వం యొక్క నియంతృత్వానికి చరమగీతం పాడాలనుకున్నారు ప్రజలు. గాంధీలేని సమయంలో ప్రజలు వల్లభ్ యొక్క మార్గనిర్దేశకత్వం కోరేవారు. వల్లభ్ మొదటగా విద్యావిధానం మీద తన దృష్టిని కేంద్రీకరించాడు. తరువాత విదేశీవస్త్ర బహిష్కరణ, అసెంబ్లీలకు హాజరు కాకపోవడం, మొదలైనవి చేపట్టాడు. ఏచర్య చేపట్టినా ప్రభుత్వం లాఠీలకు, కాల్పులకు పనిచెప్పేది. సత్యాగ్రహం చేయడం స్వరాజ్యపార్టీకి యిష్టంలేదు.



# 5. మునిసిపల్ ఉద్యోగం

## (పోరాటాలు - సృజనాత్మకపని)

## (1917-1924)

**1917**-1924 సంవత్సరాలకాలంలో వల్లభ్‌భాయి యొక్క రాజకీయజీవితం రూపుదిద్దుకుంది. ఈ సమయంలోనే అతడు అహమ్మదాబాద్ మునిసిపాలిటీకి ప్రెసిడెంటు అయ్యాడు. సహాయనిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నాడు. వరదబాధితుల్ని ఆదుకున్నాడు. రైతులకు విధించిన పన్నులను గురించి పోరాటం చేశాడు. జెండా సత్యాగ్రహంలో పాల్గొన్నాడు. యింకా యితర రాజకీయ కార్యక్రమాలలో పాల్గొన్నాడు. కాబట్టి యీ కాలాన్ని రెండు భాగాలుగా విభజించవచ్చును. మునిసిపాలిటీలో పని, బార్డోలి పోరాటం. పటేల్ సోదరులు ఒక్కొక్కరు ఒక్కొక్క కార్యక్రమాన్ని చేపట్టారు. వల్లభ్‌భాయికి క్రిమినల్ లాయరుగా పేరుప్రఖ్యాతులు రావడంతో వివిధ సమావేశాలకు అధ్యక్షత వహించమని కోరుతున్నారు.

అదే సమయంలో గాంధీ దక్షిణాఫ్రికా నుండి తిరిగివచ్చాడు. తన అహింస, సత్యాగ్రహాలను గురించి అతడు గుజరాత్ క్లబ్బులో ప్రసంగాలు చేశాడు. అతని సందేశంయొక్క సారాంశం బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎదిరించడం. ఆ సమయంలోనే యింకొక



నినాదం "స్వరాజ్". బాలగంగాధర్‌తిలక్ యొక్క నినాదం "స్వరాజ్యం నాజన్మ హక్కు". వల్లభ్‌భాయి వీటిచే ప్రభావితు డయ్యాడు. ఆ సమయంలో స్థానిక పరి పాలన గురించి అహమ్మదాబాద్ మునిసి పాలిటీకి, ప్రభుత్వానికి మధ్య అభిప్రాయ భేదాలున్నాయి. మునిసిపాలిటీ యొక్క వ్యవహారాలు చూడడానికి ప్రభుత్వం ఒక ఐ.సి.యస్. ఆఫీసరుని కమిషనర్‌గా ఏర్పాటుచేయాలనుకుంది. అతనికి ఎక్కువ జీతం యివ్వాలనే ఉద్దేశంతో దానిని మునిసిపాలిటీ వ్యతిరేకించింది. పైగా ప్రభుత్వం అతనిని నియమించడం ద్వారా అధికారాన్ని చేజిక్కించుకోవాలనుకుంది. ఎన్ని వ్యతిరేకతలున్నా ప్రభుత్వం షిల్లిడేని కమిషనరుగా నియమించింది. ప్రజలు వల్లభ్‌భాయి మద్దతు కోరారు. ఆవిధంగా వల్లభ్‌భాయి మునిసిపాలిటీలో ప్రవేశించడం జరిగింది. గాంధీచే ప్రభావితుడై స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొన్నాడు.

వల్లభ్‌భాయి మునిసిపాలిటీలో ప్రవేశించకముందు ఉద్యోగులందరూ బానిసత్వ లక్షణాలు కలిగి ఉన్నారు. వల్లభ్ ఒక్కొక్కరిని ప్రత్యేకంగా కలుసుకుని నచ్చచెబితే వారు మనుష్యులయ్యారు. తాము ప్రజాసేవకులమని, అధికారుల సేవకులు కామని వారు గ్రహించారు. వారి సహకారంతో షిల్లిడీనే ఒక కేసులో యిరికించి, అతనిని సాగనంపగలిగాడు. ఆ రోజు అహమ్మదాబాద్ మునిసిపాలిటీ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు. ఉత్తరవిభాగ కమిషనరయిన ఎఫ్.జి. ప్రాట్‌తో పోరాడవలసివచ్చింది. అతడు ఒక ఇంజనీర్‌ని, ఒక హెల్త్ ఆఫీసరుని నియమించాలనుకున్నాడు. హెల్త్ ఆఫీసరుని నియమించడానికి వల్లభ్, ప్రజలు అంగీకరించారు. కాని ఇంజనీరు నియామకాన్ని వ్యతిరేకించారు. అతడు అసమర్థుడని ఋజువుచేసి అతనిని తొలగించగలిగారు.


ప్రజలహక్కులకోసం పోరాడే యోధునిగా వల్లభ్‌భాయి గుర్తింపుపొందాడు. అతడు మునిసిపాలిటీకి ప్రెసిడెంటుగా ఎన్నికయ్యాడు. అతని హయాంలో పట్టణం అంతా పర్యటించి, ప్రజల సమస్యలు తెలుసుకుని, వెంటనే పరిష్కారాలు సూచించాడు. ప్రతివారినీ

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోమని చెప్పాడు. దానివల్ల పట్టణం అంతా శుభ్రంగా ఉంటుందన్నాడు. ఒకనాడు తన ఉద్యోగులతో కలిసి హరిజనవాడకి వెళ్లాడు. అక్కడ వీధులను ఊడ్చే కార్యక్రమాన్ని చేపట్టాడు. ఈ కార్యక్రమం ప్రజల్ని ఆకర్షించింది. కాని కొంతమంది ఛాందసులు అతనిని విమర్శించి, బహిష్కరించాలనుకున్నారు.

పట్టణంలో నీటికొరత ఉంది. ఆ విషయం ప్రభుత్వం గుర్తించినా కొరత తీర్చడానికి ముందుకు రాలేదు. వల్లభ్‌భాయి ప్రజల విరాళాలతో బావులు తవ్వించి ఆ కొరత తీర్చాడు. అంతేకాక మురుగునీటిపారుదల సౌకర్యాన్ని కూడా కల్పించాడు. బైపాస్ రోడ్లను నిర్మించి ట్రాఫిక్ సమస్యని తీర్చాడు. పారిశ్రామికులుగా ఉన్న తన స్నేహితులను పురికొల్పి తమ కార్మికులకు యిళ్లను నిర్మించి యిమ్మని ప్రోత్సహించాడు. మరికొన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలనుకున్నాడు కాని మునిసిపాలిటీనుండి బయటికి వచ్చేశాడు.

1927 చివర అంబాలాల్ సారాభాయి కొత్తపార్టీని పెట్టాడు. అతడు లక్షాధికారి. చీఫ్ ఆఫీసర్, భగత్ నియామకంపై వల్లభ్‌భాయికీ, సారాభాయికి కలహం వచ్చింది. ఒకే ఒక వోటుతో సారాభాయి గెలిచాడు. వెంటనే వల్లభ్‌భాయి రాజీనామా చేశాడు. అతని మునిసిపల్ ఉద్యోగం అంతటితో ముగిసింది. అతని విరోధి అయిన కమిషనర్ ఆల్‌ఫ్రెడ్ మాస్టర్ కూడా వల్లభ్‌భాయిని మెచ్చుకున్నాడు.

ఇటువంటి పోరాటాలవల్ల అన్ని పరిస్థితులు వల్లభ్‌కి అర్థమయ్యాయి. మునిసిపాలిటీలో కలిగిన అనుభవాలే అతని రాజకీయ జీవితానికి నాంది అయ్యాయి.




# 6. బార్డోలి పోరాటం

స్వరాజ్య ఉద్యమంలో వల్లభ్‌భాయికి నమ్మకంలేదు. అది ఎటువంటి సృజనాత్మక కార్యక్రమాలు ఏవీ చేపట్టలేదు. స్వాతంత్ర్యం సంపాదించాలంటే ప్రజల్ని కూడగట్టుకోవాలి. ఆ పనిని వల్లభ్‌భాయి తన బార్డోలి పోరాటంలో నిరూపించుకున్నాడు. భూమిశిస్తు విధానాన్ని ప్రభుత్వం రూపొందించింది. పన్నుల్ని రానురాను పెంచుతూ ఉంటారు. రైతులు పన్ను కట్టలేకపోతున్నారు. దీనికి నిరసనగా వల్లభ్‌భాయి రైతులను పన్నుకి వ్యతిరేకింపచేశాడు. ప్రభుత్వం తన పొరపాటును సవరించుకుని కొత్త ఆదేశాలను జారీచేసింది.

1928లో బార్డోలీలో ఉన్న నాయకులు వల్లభ్‌భాయిని కలుసుకుని తమ నిస్సహాయతను తెలియజేశారు. భూమిపన్ను 30 యేళ్లలో 5.14 లక్షలనుండి 6.7 లక్షలకు పెంచారు. ఆ వ్యవధి దాటిపోయింది. ప్రభుత్వం పన్నును 22 శాతం పెంచింది. అదీ పరిస్థితి. ప్రభుత్వంపై పోరాటానికి వల్లభ్‌భాయి రైతుల్ని సిద్ధంచేశాడు. ఇప్పుడు అవకాశం వచ్చింది. పోరాటం చేస్తే ప్రభుత్వం ఊరుకుంటుందా ? ఎందుకంటే పన్నులే ప్రభుత్వానికి ముఖ్య ఆదాయంకదా ?

పన్నులవల్ల రైతులకు తీరని నష్టం కలుగుతుందని వల్లభ్‌కి తెలుసు. ప్రభుత్వంతో పోరాటానికి సిద్ధమేనా అని వారిని అడిగాడు. పోరాటంయొక్క ఫలితాల్ని గురించి కూడా చెప్పాడు. అరెస్టు చేస్తారని హింసిస్తారని తెలియజేశాడు. అన్ని పరిస్థితులు పరిశీలించాక పోరాటానికి నాయకత్వం వహించారు. గాంధీకూడా అనుమతించాడు.




వల్లభ్‌భాయి బొంబాయి గవర్నర్‌కు రైతుల పరిస్థితిని విచారించ వలసిందిగా ఒక ఉత్తరం రాశాడు. వారు పన్నులు కట్టలేని స్థితిలో ఉన్నారని చెప్పాడు. కాని దానికి జవాబు రాలేదు. వల్లభ్ ఆ ప్రదేశానికి చెందినవాడు కాదని ప్రభుత్వం తోసి పుచ్చింది. బ్రిటిష్‌వారి విభజించి పాలించు విధానం అది. వల్లభ్ ప్రజల్ని నిర్భయంగా నిలబడమని చెప్పాడు. అన్ని కమ్యూనిటీల వారిని ఉద్యమంలో చేరవలసినదిగా కోరాడు. హిందూ ముస్లింల సఖ్యత కోసం ప్రయత్నం చేశాడు. అతని కోరికకు మంచి స్పందన వచ్చింది. స్త్రీలను కూడా ఉద్యమంలో పాల్గొనేటట్లు చేశాడు. తాలూకాలో యుద్ధ వాతావరణం నెలకొంది. దేశం నలుమూలలనుండి ఉద్యమానికి విరాళాలు వచ్చాయి.


ప్రభుత్వం కొంతమంది రైతులకు కొన్ని సౌకర్యాలు కల్పించి ఉద్యమంనుండి వారిని విడదీయాలనుకుంది. పన్నులో మినహాయింపు యిచ్చింది. ఇటువంటి చర్యలను వల్లభ్‌భాయి ఖండించాడు. ఉద్యమంలో ఉన్న రైతులకు ప్రభుత్వం ఎక్కువ పన్ను విధించడమేకాక, వారి భూముల్ని కూడా స్వాధీనం చేసుకుంది. కాని రైతులు ఉద్యమాన్ని ఆపలేదు. హింసాత్మక ఘటనలకు దారితీసేటట్లు ఉందని గ్రహించాడు వల్లభ్‌భాయి. వారిని హింసకు పాల్పడవద్దని కోరాడు. గుజరాత్ కమిషనర్ వల్లభ్‌కు ఉత్తరం రాశాడు. దానిలో ఆందోళనకారులకు వల్లభ్ నాయకుడంటూ నిందించాడు. ఈ లేఖ ప్రజలకు ఆగ్రహం కలిగించింది. ఏ పనులూ చేయకుండా సహాయనిరాకరణ చేశారు. ప్రభుత్వం చాలా యిబ్బందికర పరిస్థితుల్లో పడింది. ప్రజలను భయపెట్ట దలచుకుంది. బలగాలను దింపింది. ఒక సాధువైన రవిశంకర్ మహరాజ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ప్రజలకు చాలా ఆగ్రహం కలిగింది. బాలురను కూడా పోలీసులు అరెస్టు చేశారు.

అయినా ఉద్యమం కొనసాగుతూనే ఉంది. ఏం చెయ్యాలో ప్రభుత్వానికి పాలు పోలేదు. వల్లభ్‌భాయి సమాంతర ప్రభుత్వం ఏర్పాటుచేశాడు. వల్లభ్‌ని అందరూ “బార్డోలి సర్దార్” అని పిలవడం ప్రారంభించారు. ప్రభుత్వం ప్రజలతో రాజీపడాలనుకుంది. ప్రజలు నష్టపోయిన వాటిని భర్తీ చేయమని వల్లభ్ అధికారుల్ని కోరాడు. కాని ప్రభుత్వం అంగీకరించలేదు. పునర్విచారణకు ప్రభుత్వం అంగీకరించలేదు. కె.ఎమ్. మున్షీ తాలూకాలో పర్యటించి వాస్తవాలను తెలుసుకున్నాడు. శాసనసభకు రాజీనామా చేశాడు. తన అభిప్రాయాలను తెలియజేస్తూ గవర్నర్‌కు లేఖ రాశాడు.

“టైమ్స్ ఆఫ్ ఇండియా” యీ ఉద్యమం గురించి “ప్రభుత్వం రాజీపడాలి లేదా మిలిటరీ బలగాన్ని దింపాలి అదొక్కటే మార్గం” అని రాసింది. రాజీ ప్రయత్నాలు జరిగాయి. గవర్నర్ సర్దార్‌ని కలిశాడు. సర్దార్ అవే షరతులు చెప్పాడు. భూమి పన్ను కట్టితే విచారణకు కమిటీని వేస్తానన్నాడు గవర్నర్. పౌర ఆందోళన విరమించమని చెప్పాడు.

పరిస్థితి తీవ్రంగా మారింది. ప్రభుత్వం మిలటరీని దింపడానికి నిశ్చయించుకుంది. ఆర్థికమంత్రి సర్ చునీలాల్ వి.మెహతా సర్దార్‌ని సమస్య పరిష్కారం కోసం పిలిపించాడు. సూరత్‌నుండి కౌన్సిల్ సభ్యులు చునీలాల్‌కు గవర్నర్ షరతులు అమలుజరిగేటట్లు చూడాలని లేఖ రాయాలి. సర్దార్ ఆ షరతుల్ని పాటించాలని కోరారు. తన షరతులను అంగీకరిస్తే గవర్నర్ షరతుల్ని అంగీకరిస్తానన్నాడు. నష్టపరిహారం యివ్వడం తప్ప మిగిలిన సర్దార్ షరతులన్నింటినీ ప్రభుత్వం అంగీకరించింది.

పునర్విచారణ జరిగింది. బార్డోలి ప్రజల కోరిక నెరవేరింది. దేశమంతటా బార్డోలీ విజయం ప్రాకింది. భూలాభాయిదేశాయి ప్రజల తరఫున వాదించారు. రైతుయొక్క స్తోమతని బట్టి పన్ను వేయాలని అతడు చెప్పాడు. బార్డోలి విజయం సత్యాగ్రహానికి విజయం. బార్డోలి సర్దార్ భారతదేశపు సర్దార్ అయ్యాడు.




# 7. కాంగ్రెస్ ప్రెసిడెంటుగా

**బా**ర్డోలీ ఉద్యమంయొక్క విజయం సర్దార్‌కు పేరు తెచ్చిపెట్టింది. సమావేశాలకు అధ్యక్షత వహించమని అతనికి ఆహ్వానాలు వచ్చాయి. అతనికి ప్రచారం అంటే యిష్టంలేదు. కాబట్టి ఆ ఆహ్వానాలను సున్నితంగా తిరస్కరించేవాడు.

మహారాష్ట్రలోని చాలా తాలూకాలలో ప్రభుత్వం భూమిపన్నును పెంచింది. ప్రజలు సహాయం కోసం సర్దారు వద్దకు వచ్చారు. నిర్భయంగా దానిని వ్యతిరేకించమని, ఎటువంటి త్యాగానికైనా సిద్ధంగా వుండమని వారికి సర్దార్ చెప్పాడు. రాజాజీ సర్దార్‌ని తమిళనాడుకు ఆహ్వానించాడు. సర్దార్ అక్కడ బార్డోలి ఉద్యమం గురించి ప్రసంగించాడు. కర్ణాటకలో రైతులనుద్దేశించి వారిని పెజంట్స్‌లీగ్‌లలో చేరమని, ప్రభుత్వోద్యోగుల చర్యల గురించి భయపడవలదనీ హెచ్చరించాడు. బీహార్‌లో జమీందారులకీ కౌలుదారులకీ మధ్య వివాదాలున్నాయి. కౌలుదారుల్ని తమ నాయకుల్ని కలుసుకుని జమీందారులతో సంప్రదించమని చెప్పాడు. స్త్రీలను పరదాలచాటున ఉంచడం సర్దార్‌కి బాధ కలిగించింది. అతడు ఎక్కడ ప్రసంగం చేసినా, నియంతృత్వంమీద వ్యతిరేకత కనపరిచేవాడు.

కలకత్తా కాంగ్రెస్ సమావేశంలో దేశానికి డొమినియన్ ప్రతిపత్తి కావాలని తీర్మానం చేశారు. డిసెంబర్ 31, 1929లోగా డొమినియన్ ప్రతిపత్తివ్వకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని ప్రభుత్వానికి కాంగ్రెస్ తెలియజేసింది. ప్రభుత్వం అంగీకరించదని సర్దార్‌కు తెలుసు. దేశం మొత్తం సత్యాగ్రహం చేయాలి. ప్రభుత్వం రౌండ్‌టేబుల్ సమావేశాన్ని




ఏర్పాటుచేసి కాంగ్రెస్‌ని ఆహ్వానించింది. కాని ప్రభుత్వం తగిన గ్యారంటీ యివ్వనందున కాంగ్రెస్ ఆ సమావేశంలో పాల్గొనలేదు.

లాహోర్ కాంగ్రెస్ సమావేశంలో సివిల్ డిజొబీడియెన్స్ ఉద్యమం తలపెట్టింది. అదే సమయంలో ఉప్పుమీద పన్నువేయడంపై గాంధీజీ సత్యాగ్రహం చేయదలిచాడు. పన్ను తొలగించమని గవర్నర్‌కు లేఖరాశాడు లేకపోతే చట్టాన్ని ఉల్లంఘించవలసివస్తుందని హెచ్చరించాడు.

లాహోర్ సమావేశం తరువాత సర్దార్ ప్రజల్ని పోరాటానికి ఆయత్తం చేసే పనులలో మునిగిపోయాడు. అతనిని అరెస్టు చేసి సబర్మతి జైలుకి పంపించారు. ఈలోపున గాంధీ దండికి ఊరేగింపు మొదలుపెట్టాడు. అన్ని గ్రామాలలోను గాంధీ ప్రసంగించాడు. అహింసాయుతంగా పోరాడమని ఉద్బోధించాడు. గాంధీని ప్రభుత్వం అరెస్టుచేసింది. అటువంటి క్లిష్టసమయంలో గుజరాత్ ప్రజలకు సహాయం చేయలేకపోయానని సర్దార్ బాధపడ్డాడు. సర్దార్ జైలునుండి విడుదల అయ్యాక కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించాడు. అతనిని పండిట్ మోతీలాల్ నెహ్రూ నామినేట్ చేశాడు.

ఒకసారి సర్దార్ తిలక్ సంస్మరణ సభకు ప్రజల్ని ఊరేగింపుగా తీసుకుని వెళ్తూ ఉంటే ప్రభుత్వం అతనిని అరెస్టుచేసి యెరవాడజైలుకు పంపించింది. అతడు విడుదల అయ్యాక కరాచీ సమావేశంలో ప్రెసిడెంటుగా ఎన్నికయ్యాడు. ఆ సమయంలోనే తిరుగుబాటు, హత్యానేరాలక్రింద భగత్‌సింగ్‌ని, అతని అనుచరుల్ని ప్రభుత్వం ఉరితీసింది. ప్రజలకు కాంగ్రెస్‌మీద నమ్మకం పోయింది. కాని గాంధీ, సర్దార్‌లు వారిని శాంతింప చేశారు. వారికి కోపం రావడానికి కారణం గాంధీ – ఇర్విన్‌సంధి ఒడంబడిక. బోస్, నెహ్రూలు ఆ ఒడంబడికను వ్యతిరేకించారు.


ప్రభుత్వం పన్ను చెల్లించమని ప్రజల్ని ఒత్తిడిచేస్తూంది. అంతేకాక బలప్రయోగం కూడా చేస్తూంది. ఒడంబడికను ఉల్లంఘించింది ప్రభుత్వం. ఉత్తరప్రదేశ్‌లోని రైతులను నిర్బంధించడాన్ని కాంగ్రెస్ ప్రెసిడెంటుగా సర్దార్ వ్యతిరేకించాడు. లండన్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో గాంధీ ప్రభుత్వాన్ని ఒప్పించలేకపోయాడు. ప్రభుత్వం నాయకులందరినీ అరెస్టుచేసింది.



# 8. గాంధీ - సర్దార్

**గాం**ధీజీని, సర్దార్‌ని యెరవాడజైలులో నిర్బంధించారు. ఇద్దరూ కలిసిఉండడం అదే మొదటిసారి. మహదేవ్ దేశాయ్ కూడా వారితో ఉన్నాడు. గాంధీజీకి సేవచేయడానికి సర్దార్‌కి మంచి అవకాశం లభించింది. గాంధీకి సౌకర్యంగా ఉండేటట్లు అతడు సేవచేశాడు. గాంధీ రెండుగంటలసేపు పళ్లుతోముకునేవాడు. సర్దార్ “గాంధీకి ఉన్నవి రెండేపళ్లు. వాటినే గంటలకొద్దీ తోముతాడు” అనేవాడు. గాంధీ టీ తాగడు. అందువల్ల సర్దార్‌కూడా టీ తాగడం మానివేశాడు. సర్దార్ ఎవరితోనైనా నిర్మొహమాటంగా మాట్లాడతాడు. గాంధీని కూడా విమర్శించేవాడు. గాంధీతో యిలా అనేవాడు. “మీతో మాట్లాడటం వల్ల లాభం ఏమైనా ఉందా ?” మహదేవ్‌దేశాయ్ పండ్లతొక్కలు తీయడం చాలా ఆలస్యం చేసేవాడు. గాంధీ దాన్ని వ్యతిరేకించేవాడు. మహదేవ్ గాంధీతో వాదించేవాడు. అప్పుడు సర్దార్ యిలా అనేవాడు. “గాంధీజీ ఎవరిమాటైనా వింటాడా?” వెంటనే గాంధీ, “వల్లభ్, నా నాలుకకంటె నీ నాలుకే పెద్దది” అనేవాడు “అయితే ఏంటి?” అన్నాడు సర్దార్.

తనమీద అబద్ధాలు చెప్పినందుకు గాంధీ లార్డ్‌శాంకీకి లేఖరాశాడు. వల్లభ్ గాంధీతో “అంతే పెద్దలేఖ ఎందుకు రాశారు ? నువ్వు అబద్ధాలకోరువి అని ఒక్కముక్క రాస్తే




చాలదా'' అన్నాడు. ఇంకొకసారి అతడే నిందారోపణతో రాసిన లేఖకు జవాబు రాశాడు. ఎందుకు రాశావని సర్దార్ అడిగితే "రాయాలి కాబట్టి" అన్నాడు. వెంటనే సర్దార్, "అతడు మిమ్మల్ని తిడుతున్నాడనా ? ఇలాగే మీరు ప్రజల్ని పాడుచేస్తున్నారు" అన్నాడు. "మీరు రాసిన లేఖ మీకు తప్ప యింకెవరికీ అర్థంకాదు" అనేవాడు.

వల్లభ్‌భాయి మహదేవ్‌దేశాయ్ వద్ద సంస్కృతం నేర్చుకున్నాడు. తన ప్రసంగాలలో వాటిని ఉపయోగిస్తూ ఉండేవాడు. జైలులో సర్దార్ కవర్లు తయారుచేసేవాడు. "సర్దార్‌కి ఆధ్యాత్మికత ఎక్కువ. అతడు రాజకీయాలలోకి వస్తే బాగుంటుంది" అనేవాడు. సర్దార్ వెంటనే, "చివరివరకూ మీ మనస్సులో ఏముందో ఎవరికీ చెప్పరు. మా పరిస్థితి ఎలాఉంటుందో ఊహించండి" అనేవాడు. ఉపవాసం చేసేటప్పుడల్లా సర్దార్ గాంధీని విమర్శించేవాడు. "నువ్వు కూడా ఉపవాసం చేయరాదా ?" అని గాంధీ అంటే, "ప్రజలు నన్ను బతకనివ్వరు" అనేవాడు సర్దార్. వల్లభ్‌భాయి యొక్క చమత్కారాలే నన్ను చురుకుగా ఉంచుతున్నాయనేవాడు గాంధీ.


ఒకసారి ఒక విలేఖరి గాంధీతో, "మీరు అందవిహీనమైన మీ భార్యతో ఎలా సంతోషంగా సంసారంచేస్తున్నారు ?'' అన్నాడు. వెంటనే సర్దార్, ''అతనిని కళ్లుమూసుకోమని చెప్పండి. అప్పుడతనికి సంతోషం కలుగుతుంది" అన్నాడు. ఇంకొక విలేఖరి సర్దార్‌ని "మీ భారీ శరీరంతో మీరు నడుస్తూన్నప్పుడు మీ పాదాలక్రింద చీమలు నలగకుండా ఎలా తప్పిస్తారు ?" అని అడిగాడు. వెంటనే సర్దార్, "అతనిని తలమీద కాళ్లుపెట్టుకుని నడవమనండి" అన్నాడు.

గాంధీజీకి జైలుజీవితం సుఖంగా ఉంది. ఎందుకంటే అతనికి విశ్రాంతి లభిస్తుంది. కాని సర్దార్‌కి కష్టంగా ఉంది. బార్డోలిలో ఉన్న ఆశ్రమాన్ని ప్రభుత్వం అమ్మకానికి పెట్టింది. సర్దార్ బాధపడ్డాడు. అయినా వెంటనే, "ఫరవాలేదు" మనకి స్వరాజ్యం రాగానే తెచ్చుకుందాం. ప్రస్తుతం యి జైళ్లను మనం ఆక్రమించుకోలేదా ?" అన్నాడు. హిందువుల్ని,

ముస్లింలను కలపడానికి గాంధీ ప్రయత్నించినప్పుడు సర్దార్ "రెండు రాళ్లమధ్య మీరెందుకు నలిగిపోతారు ?" అన్నాడు. గాంధీజీ లేఖలు రాయడం మానుకున్నాడు. ఎందుకంటే గుజరాతీలో తాను రాసిన లేఖల్ని అధికారులు ఆలస్యంగా పంపుతున్నారు. గాంధీజీ ఏవైనా కొత్త పద్ధతులు ప్రవేశపెట్టినప్పుడు కూడా సర్దార్ విమర్శించేవాడు.

గాంధీజీని విడుదలచేసి, వ్యక్తిగత సివిల్ డి జొబీడియెన్స్‌ను ప్రారంభించ మన్నందుకు వెంటనే అరెస్టుచేశారు. అయితే అతడు యెరవాడ జైలుకి తరలించ బడినప్పుడు వల్లభ్‌ని నాసిక్‌జైలుకి తరలించారు. వల్లభ్‌నుండి విడిగా ఉండడం గాంధీజీకి బాధ కలిగించింది.

జైలులో ఉండగానే వల్లభ్ తల్లి మరణించింది. స్విస్ నర్సింగ్ హోమ్‌లో అన్న విఠల్‌భాయి చనిపోయాడు. వల్లభ్, విఠల్‌భాయిల ఆదర్శాలు వేరైనా వారిమధ్య ఉన్న ప్రేమ సడలిపోలేదు.




# 9. జైలు నుండి విడుదల

సర్దార్‌కు ముక్కులో బాధ వుంది. అది చాలా బాధపెడుతూంది. కొంతమంది డాక్టర్లు పరిశీలించి, ఆపరేషన్ చేయాలన్నారు. ప్రభుత్వం అతనిని విడుదలచేసింది. కాని తన ఆపరేషన్‌ను వాయిదా వేసి గుజరాత్ ప్రజలకు సహాయం చేశాడు. ప్రభుత్వం రైతులనుండి దోచుకున్నవాటిని తిరిగి యిప్పించాలనుకున్నాడు. పదిలక్షలు విరాళం పోగుచేశాడు. పోరాటానికి సిద్ధంకమ్మని ప్రజలకు చెప్పాడు. కాంగ్రెస్ కమిటీలను కూడా పోరుకు ఆయత్తంచేశాడు.

బొంబాయిలో కాంగ్రెస్ సమావేశానికి సర్దార్ హాజరయ్యాడు. గాంధీ కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తానన్నాడు. ఎందుకంటే కాంగ్రెస్ తన విధానాలను పాటించడం లేదన్నాడు. ఒంటరిగా పోరాడతానన్నాడు. ప్రభుత్వం కొన్ని రాజ్యాంగ సవరణలు చేద్దామనుకుంది. కాంగ్రెస్ సమావేశంలో సర్దార్ ఆ సంస్కరణలను వ్యతిరేకించాడు. తమ ఆర్థిక ప్రణాళికను అంగీకరించమని కొంతమంది సోషలిస్టు భావాలు గలవారు కాంగ్రెస్‌పై ఒత్తిడి తెచ్చారు. సర్దార్ వ్యతిరేకించాడు. ఆచార్య నరేంద్రదేవ్, జయప్రకాశ్‌నారాయణ్‌లు కాంగ్రెస్‌నుండి విడిపోయి సోషలిస్టు పార్టీని స్థాపించారు.

సెంట్రల్ లెజిస్లేచర్‌కి ఎన్నికలలో పోటీచేయడానికి కాంగ్రెస్ నిర్ణయించింది. దానికి తగిన డబ్బుని సర్దార్ సమకూర్చాడు. బెంగాల్‌లో తప్ప మిగిలిన వాటన్నిటిలో




కాంగ్రెస్ ఘనవిజయాన్ని సాధించింది. అంతలో సర్దార్ తన ముక్కుకి ఆపరేషన్ చేయించుకున్నాడు. వెంటనే కార్యాచరణలోకి దిగాడు. గాంధీ అనారోగ్యం పాలయ్యాడు. సర్దార్ గాంధీని బొంబాయిలో డాక్టర్ల చేత పరీక్ష చేయించాడు.

1936లో లాహోర్ కాంగ్రెస్ సమావేశంలో నెహ్రూ నాయకత్వంలో సోషలిస్టులు తమ ప్రయత్నాలు మొదలుపెట్టారు. కాని కాంగ్రెస్‌కు సోషలిజమ్ మీద నమ్మకంలేదు. హరిపురా కాంగ్రెస్ సమావేశంలో కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా ప్రతిపాదన జరిగింది. నెహ్రూ కూడా ఒక అభ్యర్థి. సర్దార్‌కి పోటీ యిష్టంలేదు. నెహ్రూని ఎన్నుకోమని కాంగ్రెస్‌కు చెప్పాడు. ఎన్నిక అయ్యేముందు నెహ్రూ తనకు సోషలిస్టు అభిప్రాయాలున్నాయని ప్రకటించాడు.

నెహ్రూకి తనకి భేదాభిప్రాయాలున్నాయని సర్దార్‌కి తెలుసు. మెజారిటీయొక్క నిర్ణయాన్ని నెహ్రూ గౌరవిస్తాడని కూడా తెలుసు. తన అధ్యక్షోపన్యాసంలో నెహ్రూ పూర్తి ప్రజాస్వామ్యానికి కాంగ్రెస్ కట్టుబడిఉందని ప్రకటించాడు. క్రమేణా సోషలిజమ్ వైపు దారితీస్తుందని అతని ఆశ.

చిన్నరాష్ట్రాల రాజులు తమ రాష్ట్రాలలో కాంగ్రెస్ యొక్క కార్యకలాపాలు సాగడానికి అంగీకరించడంలేదు. అటువంటి అభిప్రాయాలు స్వాతంత్ర్యసమరానికి నిరోధకాలని సర్దార్ అనుకున్నాడు. కాబట్టి ఆ చిన్న రాష్ట్రాలలో కూడా చట్టబద్ధపరిపాలన ప్రవేశపెట్టాలనుకున్నాడు. కాంగ్రెస్ కమిటీలను లేదా ప్రజామండళ్లను ఏర్పాటుచేసి స్వాతంత్ర్యపోరాటానికి, సృజనాత్మక కార్యాచరణకి ప్రజలను సుశిక్షితుల్ని చేయాలని సర్దార్ సంకల్పం.



# 10. కాంగ్రెస్ మంత్రిత్వశాఖలు

**1937**లో జరిగిన రాష్ట్రశాసనసభా ఎన్నికలలో కాంగ్రెస్ ఘనవిజయం సాధించింది. ఒకే పెద్దపార్టీ పరిపాలన మీద ప్రజలకు గొప్ప నమ్మకం ఉంది. కాంగ్రెస్‌ను పరిపాలన సాగించమని గాంధీజీ కోరాడు. మంత్రిత్వశాఖలన్నీ దేశస్వాతంత్ర్యంకోసం పనిచేయాలనే లక్ష్యంతో ఉండాలని చెప్పాడు. కాంగ్రెస్ మంత్రిత్వశాఖలు ఏర్పడ్డాయి. అస్సాం తప్ప అయిదు రాష్ట్రాలలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయింది. అస్సాం సంయుక్త ప్రభుత్వం ఏర్పడింది. అధికారం కాంగ్రెస్‌దే. సింధ్‌లో అల్లాబక్ష్ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశాడు. పంజాబ్, బెంగాల్‌లలో ముస్లింలీగ్ ప్రభుత్వాలను ఏర్పాటుచేసింది. బొంబాయిలో కాంగ్రెస్ నారిమన్‌కు బదులు బాలాసాహెబ్‌ఖేర్‌ని ఎన్నుకుంది. నారిమన్ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీని కలిశాడు. నెహ్రూ అతని కోరికను తిరస్కరించాడు. నారిమన్ తరఫున పత్రికలవాళ్లు ఆందోళన చేశారు. నారిమన్‌ను ఎన్నిక చేయకపోవడంలో సర్దార్ పాత్ర ఉందని నమ్మకం. కాని సర్దార్‌కి అటువంటి ఉద్దేశం లేదు.

ఈ సమస్యపై గాంధీజీ, బహదూర్‌జీలు విచారణ జరిపారు. కాంగ్రెస్‌యొక్క కార్యకలాపాలలో నారిమన్ విభేదించాడనీ, సర్దార్ ప్రత్యక్షంగాగాని, పరోక్షంగాగాని జోక్యం కలగజేసుకోలేదనీ ఋజువయింది. పక్షపాతవైఖరిని ప్రదర్శించారని నారిమన్ గాంధీ,

బహదూర్, నెహ్రూలను నిందించాడు. నారిమన్ ఆందోళన అంతమయింది. తరువాత నారిమన్ సర్దార్‌ను క్షమాపణ కోరి కాంగ్రెస్‌లో మరల చేరాడు. బొంబాయి కార్పొరేషన్ అతడు కాంగ్రెస్ లీడరయ్యాడు.

సెంట్రల్‌ప్రావిన్స్‌లలో రెండు భాషాప్రయుక్త ప్రదేశాలున్నాయి. మరాఠీ, హిందీ ఆ రెండింటి మధ్య సయోధ్యలేదు. ఆ రెండు వర్గాలను కలపాలని ప్రయత్నించాడు సర్దార్. ఒక ఒప్పందానికి వచ్చారు. అయినప్పటికీ సరియైన సయోధ్యలేదు. ఆ విషయం డా॥ ఖేర్ సర్దార్ దృష్టికి తీసుకునివచ్చాడు. ఆ సమస్యని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ముందు పెడదామన్నాడు సర్దార్. కాని ఖేర్ ఆ సమస్యని తానే పరిష్కరిస్తానన్నాడు. మహాకోశల్ మంత్రుల్ని రాజీనామా చేయవలసినదిగా ఖేర్ కోరాడు. కాని వారు అంగీకరించలేదు. ఖేర్ యిద్దరు మంత్రులతో రాజీనామా చేశాడు. గవర్నర్ కూడా మహాకోశల్ మంత్రుల్ని రాజీనామా చేయమన్నాడు. వారు నిరాకరించడంతో వారి పదవుల్ని రద్దుచేసి, ఖేర్‌ని ప్రభుత్వం ఏర్పాటుచేయమని కోరాడు. మహాకోశల్ మంత్రులకు ఆ ప్రభుత్వంలో అవకాశం యివ్వలేదు.

డా॥ ఖేర్ యొక్క చర్యను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తప్పుపట్టింది. వ్యక్తిగత చర్చకు రమ్మని అతనిని పిలిచింది. అతడు తన తప్పును తెలుసుకుని రాజీనామా చేశాడు. తిరిగి ఎన్నికలు జరపమని కోరాడు. కాని వర్కింగ్ కమిటీ, అప్పటి ప్రెసిడెంట్ సుభాష్‌చంద్రబోస్‌లు అంగీకరించలేదు. అతనిని దయతో విడిచిపెట్టారు.


వ్యవసాయదారుల భూముల్ని తీసుకున్న బొంబాయి మంత్రిత్వశాఖల్ని వాటిని తిరిగి ఉచితంగా రైతులకు యిమ్మని సర్దార్ కోరాడు.

1939లో త్రిపురలో కాంగ్రెస్ సమావేశం ఏర్పాటయింది. ప్రెసిడెంటు ఎన్నికలో సర్దార్ కీలకపాత్ర పోషించారు. బోస్ పదవీకాలం ముగియనుంది. మౌలానా ఆజాద్‌ను ప్రెసిడెంట్‌గా ఉండమని గాంధీజీ కోరాడు. కాని బోస్ మళ్లీ అభ్యర్థిగా నిలబడ్డాడు. అతడు వర్కింగ్ కమిటీని నిందించాడు. కాంగ్రెస్‌పార్టీని విడదీయడానికి సిద్ధపడుతున్నాడు బోస్ అనే అనుమానం సర్దార్‌కి కలిగింది. అయితే బోస్ తానే కాంగ్రెస్‌ను విజయపథంవైపు నడిపించగలననుకున్నాడు. గాంధీ, నెహ్రూలు బోస్‌ను అభ్యర్థిత్వాన్ని విడిచిపెట్టమన్నాడు. కాని చివరకు బోస్ ప్రెసిడెంటుగా ఎన్నికయ్యాడు.



అక్కడ రెండు తీర్మానాలు ప్రతిపాదించబడ్డాయి – సామూహిక ఉల్లంఘన, వర్కింగ్ కమిటీపై విశ్వాసం. సమావేశంలో మొదటిరోజున బోస్ అనారోగ్యంతో ఉండడంవలన మౌలానా ఆజాద్ ప్రెసిడెంటుస్థానంలో ఉన్నాడు. పై రెండు తీర్మానాలను మరునాడు ఆమోదించాలని వాయిదావేశారు. బోస్‌యొక్క మొదటి తీర్మానం తిరస్కరించబడింది. రెండవ తీర్మానం ఆమోదించబడింది. ప్రెసిడెంటు వర్కింగ్ కమిటీ సభ్యుల్ని నామినేట్ చేయాలి.

బోస్ నామినేషన్‌ని వాయిదా వేశాడు. పైగా సర్దార్‌ని విమర్శించాడు. తరువాత బోస్ ఆలిండియా కాంగ్రెస్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటుచేశాడు. ఆ సమావేశంలో పండిట్‌పంత్, భూలాభాయిదేశాయ్, ఆచార్య కృపలానీపై దౌర్జన్యం జరిగింది. ఎ.ఐ.సి.సినుండి బోస్‌కి వ్యతిరేకత వచ్చింది. వెంటనే అతడు రాజీనామా చేశాడు. సర్దార్ రాజేంద్రప్రసాద్‌ను ప్రెసిడెంటుగా ఉండమని కోరాడు. బోస్ కాంగ్రెస్‌ను తప్పుపడుతూనే ఉన్నాడు. వర్కింగ్ కమిటీ అతనిని హెచ్చరించినా అతడు మానలేదు. అతడు కాంగ్రెస్‌కు రాజీనామాచేసి, కొత్త ఫార్వర్డ్ బ్లాక్‌ను ఏర్పాటుచేశాడు.



# 11. క్విట్ ఇండియా ఉద్యమం

బ్రిటిష్ జర్మనీపై యుద్ధం ప్రకటించి ఇండియాను భాగస్వామిగా చేసింది. వైస్రాయి కనీసం కేంద్రశాసనసభతో సంప్రదించలేదు. బ్రిటిష్‌వారికి సహకారం అందించమని గాంధీజీ ప్రజల్ని కోరాడు. కాని స్వాతంత్ర్యం దేవుడిచ్చిన వరం కాదని, పోరాడి గెలవాలని సర్దార్ అభిప్రాయం. యుద్ధంలో ఇండియా బ్రిటిష్‌వారికి సహాయం చేస్తే వారు ఇండియాకు స్వాతంత్ర్యం యివ్వాలి. అదీ షరతు. కాని ఇండియా స్వయంపరిపాలన చేయలేదని బ్రిటిష్ మొండిచేయి చూపించింది. అయినా సర్దార్‌కి, నాజీలంటే యిష్టంలేదు కాబట్టి మిత్రపక్షాలకు సహాయం చేయడానికి అంగీకరించాడు.

డొమీనియన్ ప్రతిపత్తికి ఇండియాకు అర్హత ఉందని, అంతర్గత కలహాలను రూపుమాపితే ప్రతిపత్తి యిస్తామని సర్ శామ్యూల్‌హోరె ప్రకటించాడు. వాస్తవానికి కులమతభేదాలు బ్రిటిష్‌వారి వల్లనే ఏర్పడ్డాయి. రాష్ట్రాలలోని కాంగ్రెస్ మంత్రులు రాజీనామా చేశారు.

నెహ్రూ తన ప్రసంగంలో "హిందూస్తాన్ హిందువులకే" అన్నాడు. జిన్నాకు కోపం వచ్చి కాంగ్రెస్‌ను వ్యతిరేకించాడు. రెండుదేశాల సిద్ధాంతాన్ని ప్రారంభించాడు. బ్రిటిష్‌వారు ముస్లింలీగ్‌కు మద్దతు పలుకుతున్నారు. కాంగ్రెస్ రామ్‌ఘుడ్‌లో సమావేశం ఏర్పాటుచేసి సివిల్ డిజొబీడియెన్స్‌ను ప్రారంభించాలని నిశ్చయించింది. అయితే అది అహింసాయుతంగా జరగాలని గాంధీ చెప్పాడు. ముస్లింలీగ్ ఆ ఉద్యమానికి వ్యతిరేకం.



మళ్లీ మతకల్లోలాలు జరగవచ్చు. కాబట్టి ఉద్యమం కొనసాగించడానికి తగిన వ్యక్తుల్ని గాంధీజీ నియమించ వలసి వచ్చింది.

యుద్ధంలో బ్రిటిష్‌వారి పరిస్థితి దిగజారిపోతూంది. అందు వల్ల స్వాతంత్ర్యం యిస్తే సహాయం చేయడానికి ఇండియా సిద్ధపడింది. గాంధీ అహింసకు ప్రాధాన్యత యిస్తాడు కాబట్టి అతడు కాంగ్రెస్‌కు రాజీనామా చేశాడు. బ్రిటిష్‌వారికి ఇండియాకు స్వాతంత్ర్యం యివ్వాలని లేదు. కాబట్టి ఇండియా వారికి సహాయం చేయడానికి యిష్టపడలేదు. గాంధీ మళ్లీ కాంగ్రెస్‌లో చేరాడు.

అయితే ప్రభుత్వం చేసే యుద్ధప్రయత్నాలకు ఇండియా ఆటంకాలు కలిగించలేదు. గాంధీజీ వ్యక్తిగత శాసనోల్లంఘన చేయమని సూచించాడు. వినోబా యుద్ధానికి వ్యతిరేకంగా చేసిన ప్రసంగంతో అది మొదలయింది. వినోబాను అరెస్టు చేశారు. తరువాత నెహ్రూను కూడా అరెస్టు చేసి మూడు సంవత్సరాల జైలుశిక్ష విధించారు. తరువాత సర్దార్‌ని కూడా అరెస్టుచేసి యెరవాడజైలులో నిర్బంధించారు.

సర్దార్ జైలులో ఉన్నప్పుడే అహమ్మదాబాద్‌లో హిందూ-ముస్లిం సంఘర్షణలు మొదలయ్యాయి. సర్దార్ కూడా అహింసాయుతంగానే పోరాడమని చెప్పినా, ప్రత్యర్థి హింసకు పాల్పడితే హింసకు హింసతోనే సమాధానం చెప్పాలన్నాడు. సర్దార్‌కి ప్రేగులజబ్బు తిరగబెట్టింది. అతనిని విడుదల చేశారు.


వ్యక్తిగత ఉల్లంఘనకి దేశంలో స్పందన రాలేదు. ఇండియాకు స్వాతంత్ర్యం యివ్వకూడదనుకున్నాడు చర్చిల్. కాని రూజ్‌వెల్ట్ ఒత్తిడి చేయడంతో సర్ స్టాఫర్డ్‌క్రిప్స్‌ను సమస్యని పరిష్కరించమని పంపాడు. అతడు మొదట మధ్యంతర ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసుకుని, తరువాత పూర్తిగా ప్రభుత్వపగ్గాలు చేపట్టవచ్చునని సూచించాడు. అన్ని రాజకీయపార్టీలు ఆ సూచనను వ్యతిరేకించాయి. జపాన్ ఇండియామీద దాడి చేసినప్పుడు నెహ్రూ గొరిల్లా యుద్ధాన్ని ఆదేశించాడు. ఆ హింసకు గాంధీ బాధపడ్డాడు.



సర్దార్ ప్రజలందర్నీ కలిసికట్టుగా ఉండమని చెప్పాడు.

ఆలిండియా కాంగ్రెస్ కమిటీ సమావేశమయింది. అనారోగ్యంగా ఉన్నా సర్దార్ ఆ సమావేశానికి హాజరయ్యాడు. ఆ సమావేశంలో ''క్విట్‌ఇండియా'' తీర్మానాన్ని ఆమోదించారు. అంటే బ్రిటిష్‌వారు ఇండియానుండి వైదొలగాలి. పూర్తిగా అహింసాయుతంగా, సహాయ నిరాకరణ చేయాలని గాంధీ సూచించాడు. అదేవిధంగా సామూహిక ఉల్లంఘనకు కూడా పిలుపునిచ్చాడు. పోరాటానికి సిద్ధం కమ్మని సర్దార్ పిలుపునిచ్చాడు.

ప్రజలు పన్నులు కట్టవద్దు. ఉద్యమంలో పాల్గొనాలి. ప్రభుత్వకార్యకలాపాలకి ఆటంకం కలిగించాలి. క్విట్‌ఇండియా ఉద్యమం దేశంలో పెనుసంచలనాన్ని సృష్టించింది. మరునాడే చాలామంది నాయకులు అరెస్టయ్యారు. దేశం అంతా అల్లకల్లోలమయింది. ప్రభుత్వం కూడా కఠినచర్యలు తీసుకుంది. పోలీసులు కాల్పులు జరిపారు. చాలామంది చనిపోయారు. చాలామంది గాయపడ్డారు. అహింసాయుతంగా, సహాయనిరాకరణ చేయలేకపోతున్నారు.



# 12. అయోమయ స్థితి

వర్కింగ్ కమిటీ సభ్యుల్ని రైలులో అహమ్మద్‌నగర్ కోటకు తరలించి, అక్కడ నిర్బంధించారు. బయటినుండి ఎటువంటి సమాచారాన్ని వారికి అందనీయడంలేదు. కాని లోపల వారికి అన్ని సౌకర్యాలు సమకూర్చారు. లోపల నెహ్రూ, మౌలానా ఆజాద్, సీతారామయ్య మొదలైనవారున్నారు. సర్దార్‌కి శంకర్‌రావ్‌దేవ్ అన్నా, కృపలానీ అన్నా చాలా యిష్టం.

1942లో జరిగిన అల్లర్లకు వారిని విచారణ చేస్తామని చెప్పారు. బ్రిటిష్‌వారిలో కొంత మార్పు వచ్చిందనుకున్నాడు సర్దార్. మళ్లీ సర్దార్ అనారోగ్యంపాలయ్యాడు. బరువుతగ్గాడు. వైద్యపరీక్షకు అంగీకరించలేదు. వారంతా బ్రిటిష్ ప్రభుత్వానికి క్షమాపణ కోరితే విడిచిపెడతామన్నారు.

జర్మనీ లొంగిపోయింది. జపాన్‌తో యుద్ధం కొనసాగుతూంది. ఇండియా యొక్క సహాయం బ్రిటిష్‌వారికి అవసరమయింది. కాని వారు రాజకీయ అనిశ్చితి నుండి బయటికి రావాలి. భవిష్యత్తులో బారతీయులే రాజ్యాంగాన్ని తయారుచేసుకోవచ్చుననీ, అదీ యుద్ధం తరువాతనేననీ వైస్రాయి ప్రకటించాడు. రాజకీయపార్టీలతో అతడు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌ని ఏర్పాటుచేశాడు. సిమ్లాలో తనను కలుసుకోవలసినదిగా నాయకులను ఆహ్వానించాడు. అందరినీ విడుదలచేశాడు. బ్రిటిష్‌వారు ఇండియాని విడిచివెళతారనే నమ్మకం సర్దార్‌కు కలిగింది. అయితే అంతర్గత కలహాలను, మతకలహాలను రూపు మాపాలి. అంతేకాక, దేశంలో లంచగొండితనం, అవి నీతి కూడా ప్రబలి ఉన్నాయి. సర్దార్ సిమ్లా సమావేశానికి




హాజరయ్యాడు. అన్ని రాజకీయ పార్టీలు అంగీకరించిన సభ్యులతో తాను ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలను కున్నాడు వైస్రాయి. అయితే ముస్లింలీగ్ తాను చెప్పినట్లు ముస్లిం సభ్యుల్ని ఎన్నుకోవాలంది. సమావేశం వృథా అయింది.

బ్రిటిన్‌లో లేబర్‌పార్టీ ఇండియా యెడల సానుభూతితో ఉంది. ప్రధానమంత్రి అట్లీ ఇండియాలో సాధారణ పరిస్థితులు నెలకొనేటట్లు ప్రయత్నించాడు. కేంద్ర, రాష్ట్రశాసనసభలకు ఎన్నికలు ప్రకటించాడు. సర్దార్‌పటేల్ ఎన్నికలకు డబ్బు సేకరించాడు. ఎనిమిది రాష్ట్రాలలో కాంగ్రెస్ మెజారిటీని సాధించింది. బెంగాల్‌లోను, సింధ్‌లోను ముస్లింలీగ్‌కు అధికారం వచ్చింది.

సర్దార్ బొంబాయిలో ఉన్నప్పుడు భారతనావికాదళం తిరుగుబాటు చేసింది. 20 నావలను స్వాధీనం చేసుకుంది. ఆ పరిస్థితుల్లో సర్దార్ వారిని శాంతపరిచాడు.

బ్రిటిష్‌వారు భారత జాతీయసైన్యంలోని ముగ్గురు ఆఫీసర్లను విచారణ చేయడంతో ఆ ప్రభుత్వంపై విరక్తి కలిగింది. ఆ సమస్యను పరిష్కరించడానికి ఒక కేబినెట్ కమిషన్‌ను ప్రభుత్వం పంపింది. కాని అది విఫలమయింది. ప్రభుత్వం యొక్క భవిష్యత్ ప్రణాళికా స్వభావాన్ని ప్రకటించింది. ఒక కాన్‌స్టిట్యుయెంట్ అసెంబ్లీ ఏర్పడింది. ముస్లింలీగ్ కోరిన పాకిస్తాన్‌ను అసెంబ్లీ తిరస్కరించింది. రాజ్యాంగంలో రాష్ట్రాలకు యూనియన్ నుండి విడిపోయే హక్కు ఉంది. కొత్త రాజ్యాంగం తయారయ్యేవరకు మధ్యంతర ప్రభుత్వం ఏర్పడుతుంది.

సర్దార్ ఆ ప్రణాళికను క్షుణ్ణంగా పరిశీలించాడు. ముస్లిం సభ్యుల్ని ఎన్నుకునే అవకాశం ముస్లింలీగ్‌కి యిస్తే మధ్యంతర ప్రభుత్వం ఏర్పడడం సాధ్యంకాదనుకున్నాడు సర్దార్. కాంగ్రెస్ ఆ ప్రణాళికను తిరస్కరించింది. మధ్యంతర ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే ఆలోచనను వైస్రాయి విరమించుకున్నాడు. ముస్లింలీగ్ కూడా అంగీకరించలేదు. ప్రత్యక్షచర్యకు దిగుతామని ప్రకటించింది. మళ్లీ కల్లోలాలు ఆరంభమయ్యాయి. కలకత్తాలో రక్తం ఏరులై పారింది. చాలామంది చనిపోగా, ఎక్కువమంది గాయపడ్డారు. కాంగ్రెస్ కల్లోలాలను అదుపుచేసింది.



# 13. విభజన

ముస్లింలీగ్ ప్రత్యక్షచర్యకు పూనుకుంది. హింసాత్మక సంఘటనలు చెలరేగాయి. కలకత్తా రక్తసిక్తమయింది. బ్రిటిష్‌వారికి ఏంచేయాలో పాలుపోలేదు. ముస్లింలీగ్ సహకారంతో మధ్యంతర ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయవలసినదిగా నెహ్రూను కోరింది. నెహ్రూ జిన్నాతో సంప్రదింపులు జరిపాడు. అయినా జిన్నా లొంగలేదు. ముస్లింలీగ్ లేకుండానే ముందుకు సాగాలనుకున్నాడు నెహ్రూ. ఆరుగురు హిందువులు, ఒక హరిజనుడు, ముగ్గురు ముస్లింలు, ఒక క్రైస్తవుడు, ఒక పార్శీ, ఒక సిక్కుతో నెహ్రూ మధ్యంతర ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశాడు. వైస్రాయి ఆమోదించాడు. సర్దార్ హోమ్ అఫైర్స్, ఇన్‌ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ శాఖలను తీసుకున్నాడు.

జిన్నా ఖంగుతిన్నాడు. వారిని ప్రక్కకు నెట్టివేసినందుకు లీగ్ అవమానంగా భావించింది. జిన్నా వైస్రాయితోను, నెహ్రూతోను సంప్రదింపులు జరిపాడు. ఎగ్జిక్యూటివ్‌కౌన్సిల్‌లో అయిదు స్థానాలు యిమ్మని కోరాడు. దానికి అంగీకారం కుదిరింది. ముస్లింలీగ్ హోమ్ అఫైర్స్ కావాలనుకుంది. వైస్రాయి ఆ పదవినుండి సర్దార్‌ను తొలగమన్నాడు కాని సర్దార్ అంగీకరించలేదు. కాంగ్రెస్ లీగ్‌కు ఆర్థికశాఖ యిచ్చింది.

ప్రభుత్వంలో ఉండి, దానిని సక్రమంగా పనిచేయనీయకుండా చేయాలని ముస్లింలీగ్ అభిప్రాయం. ప్రజలంతా యిద్దరూ కలిసి ఉండటం సాధ్యంకాదని అనుకోవాలని ఆశించింది. ప్రభుత్వ కార్యక్రమాలు సక్రమంగా జరగకుండా ముస్లింలీగ్ అడ్డుపడడం




ప్రారంభించింది. మళ్లీ మతకల్లోలాలు విజృంభించాయి. ఒకప్రక్క ఆహార కొరత, యింకొకప్రక్క నిత్యావసరాల ధరల పెరుగుదల. కాని సర్దార్ యీ పరిస్థితిని చక్కబెట్టగలిగాడు.

జిన్నా అభిప్రాయాలు వేరే విధంగా ఉన్నాయి. కౌన్సిల్‌లో ముస్లిం లీగ్ ప్రత్యేకగ్రూపుగా ఏర్పడింది. ప్రభుత్వ కార్య కలాపాలను అడ్డుకోవడం దాని ఉద్దేశం. ఒక గడువులోగా భారతీయులకు అధికారం యిస్తామని అట్లీ ప్రకటించాడు. అయితే రాజ్యాంగం ప్రతి తయారు కాకపోతే అధికారం ఎవరికి యివ్వాలో ఆలోచిస్తానన్నాడు.

ముస్లింలీగ్ కాన్‌స్టిట్యుయెంట్ అసెంబ్లీని బహిష్కరిస్తూవచ్చింది. ముస్లిం రాష్ట్రాలపై పెత్తనం కోసం ప్రయత్నిస్తూంది. పంజాబ్‌లో అల్లర్లు ప్రారంభమయ్యాయి. అంతవరకు మాలిక్ హిజిర్‌హయ్యత్‌ఖాన్ హిందూ–ముస్లిం–సిక్కులను పాలిస్తున్నాడు. ప్రత్యక్షచర్య వల్ల అది రాజీనామా చేయవలసివచ్చింది. గవర్నర్ ముస్లింలీగ్‌ను ప్రభుత్వం ఏర్పాటుచేయమని కోరాడు. ముస్లింలీగ్‌ను అంతమొందించాలని అకాలీదళ్ నాయకుడు తారాసింగ్ హిందువులకు, సిక్కులకు పిలుపునిచ్చాడు.

కల్లోలాలలో చాలామంది హిందువులు, సిక్కులు మరణించారు. బ్రిటిష్‌వారు ఆ కల్లోలాలను ఆపడానికి ప్రయత్నించలేదు. తటస్థంగా చూస్తూ ఉన్నారు. వైస్రాయి తమకు అండగా ఉంటాడని ముస్లింలు నమ్మారు. దేశం విభజన కాకపోతే అరాచకం సృష్టించబడుతుందనుకున్నాడు సర్దార్. కాంగ్రెస్ వర్కింగ్‌కమిటీ కూడా అదే ఆలోచనలో ఉంది. ముస్లింలీగ్‌ను విడదీయాలనుకుంది.

లార్డ్ మౌంట్‌బాటన్ వైస్రాయిగా వచ్చాడు. అతడు గొప్ప నాయకుడు. స్నేహపూర్వకంగా చాలా సమస్యల్ని పరిష్కరించాడు. రాజకీయాలలో కీలకపాత్ర పోషించాడు. ఆయనకూడా కాంగ్రెస్, ముస్లింలీగ్‌ల మధ్య సామరస్యం కుదర్చలేకపోయాడు. నెహ్రూ, సర్దార్, మౌంట్‌బాటన్లకు దేశాన్ని విభజిస్తేనే మంచిదనే అభిప్రాయం ఉంది. పంజాబ్, బెంగాల్‌లను యిచ్చి, పాకిస్తాన్ ఏర్పాటుచేయడానికి జిన్నా అంగీకరించాడు. మౌంట్‌బాటన్ దానికి ప్రణాళిక వేశాడు. విభజనకు అంగీకరిస్తూ సర్దార్, “వ్యాధిగ్రస్తమైన




అవయవాన్ని తొలగించాలి లేదా శరీరం అంతా బాధపడుతుంది" అన్నాడు. మౌలానా ఆజాద్ సర్దార్ విభజనకు విలన్ అని విమర్శించాడు.

దేశాన్ని విభజించడం గాంధీకి ఇష్టంలేదు. విభజన జరిగిన తరువాత కల్లోలాలు ఆగిపోతాయని రాజకీయవేత్తలు అనుకున్నారు. కాని పాకిస్తాన్ సాంప్రదాయం వేరుగా ఉంది. మతప్రాతిపదికన కల్లోలాలను సృష్టించింది. పోలీసులు, సైన్యం కూడా వాటిని నిరోధించలేకపోయాయి. ఇటువంటి పరిస్థితులో రాడ్‌క్లిఫ్ ఇండియా, పాకిస్తాన్‌ల సరిహద్దుల్ని నిర్ణయించారు. ఇండియాకు గురుదాస్‌పూర్‌ని యిచ్చాడు. పాకిస్తాన్‌కి అది యిష్టంలేదు. వారు మళ్లీ కల్లోలాలను సృష్టించారు. బ్రిటిష్‌వారు వారికి రక్షణ యివ్వలేదు. అటువంటి పరిస్థితులలో దేశంనుండి పారిపోయే స్త్రీ, పురుషులకు రక్షణ యివ్వడం కష్టం. ఇండియా పాకిస్తాన్‌లు అటువంటివారికి సాయుధరక్షణ కల్పిస్తామని ఒప్పందం చేసుకున్నారు.

ఢిల్లీలో కూడా మతకల్లోలాలు చెలరేగాయి. ప్రభుత్వ కార్యకలాపాలు కుంటుపడ్డాయి. కనిపిస్తే కాల్చివేయమని ఆదేశాలు జారీ అయ్యాయి. వారిని అదుపులోకి తీసుకునివచ్చే బాధ్యత తీసుకున్నాడు సర్దార్. గాయపడినవారిని పరామర్శించడానికి గాంధీ ఇర్విన్ హాస్పిటల్‌కి వచ్చాడు. గాంధీ హాస్పిటల్‌నుండి బయటికి వచ్చిన వెంటనే తుపాకీగుండ్ల వర్షం హాస్పిటల్ మీద కురిసింది.

సర్దార్ కఠిన నిర్ణయాన్ని తీసుకుని పరిస్థితిని అదుపులోకి తేగలిగాడు. వారంరోజుల్లో సాధారణ జీవితం నెలకొంది. ముస్లింలకు రక్షణ యిస్తామని ప్రతిజ్ఞ చేయమని ప్రజలను సర్దార్ కోరాడు. గాంధీజీ ముస్లింలు అధికంగా ఉన్న దర్యాగంజ్‌ని సందర్శించాడు. తమ పరిస్థితికి సర్దారే కారణమని వారు గాంధీకి ఫిర్యాదు చేశారు. కాని అది నిజంకాదు. ఇండియా, పాకిస్తాన్‌లలో ఉన్న భారతీయులను, ముస్లింలను మార్పిడి చేయాలనుకున్నాడు సర్దార్.

ఆర్.యస్.యస్. కదలికలపై నెహ్రూ సర్దార్‌ల మధ్య అభిప్రాయభేదాలున్నాయి. వారు నేరస్తులుకారనీ, సరియైన దిశానిర్దేశం లేని దేశభక్తిపరాయణులనీ సర్దార్ చెప్పాడు. వారి ఉత్సాహాన్ని సరియైన మార్గంలో ప్రవేశపెట్టాలనుకున్నాడు. ఆర్.యస్.యస్‌గాని, ఏ యితర వ్యవస్థగాని చట్టాన్ని తమ చేతులలోకి తీసుకోవడం సర్దార్‌కి యిష్టంలేదు. ఆర్.యస్.యస్. కూడా తమ సంస్థ హిందువుల్ని రక్షించడానికే కాని ముస్లింలను చంపడానికి కాదు అని స్పష్టం చేసింది.



# 14. స్వాతంత్ర్యం

కాంగ్రెస్ హైకమాండ్‌లో ఉన్న సభ్యుల మధ్య భేదాభిప్రాయాలున్నాయి. నెహ్రూ, సర్దార్‌లమధ్య భేదాభిప్రాయాలున్నాయి. కాని వారిమధ్య గల అనుబంధం దృఢంగా ఉంది కాబట్టి వారు విడిపోలేదు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రాజ్యాధికారం నెహ్రూ సర్దార్‌లు పంచుకున్నారు. కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఎన్నిక సందర్భంగా ఎక్కువ వోట్లు సర్దార్‌కే వచ్చాయి. గాంధీ ఆజ్ఞ ప్రకారం సర్దార్ తప్పుకున్నాడు. ఐకమత్యంగా ఉండే ఇండియా సర్దార్ కల. ఆ పని నెరవేర్చడానికి సర్దార్‌కి పదవితో నిమిత్తం లేదు.

సర్దార్ ఉపప్రధానిగా నియమించబడ్డాడు. నెహ్రూ అంతర్జాతీయ విషయాలను చూస్తే, తాను అంతర్గత విషయాలు చూస్తాడు. రాష్ట్రాల విలీనీకరణ మొదలైనవాటిని అతడు సమర్థవంతంగా నిర్వహించాడు. మాతృదేశంమీద గల భక్తే నెహ్రూని, సర్దార్‌ని కలిపి ఉంచింది.

కాంగ్రెస్‌లో రఫీ అహమ్మద్ కిద్వాయ్ ఉండేవాడు. అతడు, "రాజకీయాలలో హిందూ, ముస్లిం అనే పదాలకు తావులేదు" అనేవాడు. కాని మౌలానా ఆజాద్ ముస్లింలు మత విషయికంగా మైనారిటీలు కాబట్టి వారిని రక్షించవలసిన అవసరం ఉంది అనేవాడు. ముస్లింలకు సర్దార్ వ్యతిరేకి అనేవాడు. తన ప్రసంగంలో సర్దార్ ఒకసారి "పాకిస్తాన్‌కి వెళ్లదలచినవారు వెళ్లి ప్రశాంతంగా జీవించవచ్చు. కాని రెండు గుర్రాలమీద స్వారీ చేసేవారు హిందూస్తాన్‌ని విడిచిపెట్టండి" అన్నాడు. నెహ్రూ ఎవరైనా తియ్యగా మాట్లాడితే

వారు మంచివారనుకునేవాడు కాని వారి చేతల వల్లకాదు అని సర్దార్ నెహ్రూ గురించి తన అభిప్రాయాన్ని చెప్పాడు. కాశ్మీర్ సమస్య విషయంలో నెహ్రూ షేక్ అబ్దుల్లాని నమ్మాడు కాని సర్దార్ అతనిని శంకించాడు. కాని నెహ్రూయే ఇండియా కాబట్టి సర్దార్ దేశప్రయోజనాలకోసం అతనికి పూర్తి మద్దతు యిచ్చాడు.

సర్దార్ తమను పాకిస్తాన్‌కు తరిమివేయాలని అనుకుంటున్నాడని ముస్లింలు గాంధీ, నెహ్రూలకు ఫిర్యాదు చేశారు. హిందూ-- ముస్లింల హృదయాలు కలిసేవరకు తాను ఉపవాసం చేస్తానన్నాడు గాంధీ.

పాకిస్తాన్‌కి యివ్వవలసిన 55కోట్ల రూపాయలను యివ్వకుండా ఇండియా ఆపింది. సర్దార్‌కి బాధ కలిగింది. ఈ విషయం గాంధీకి తెలిసింది. ఇండియా అన్యాయం చేస్తూందన్నాడు గాంధీ. డబ్బు చెల్లించేవరకు తాను నిరాహారదీక్ష చేస్తానన్నాడు. వెంటనే ఇండియా డబ్బు చెల్లించింది. నిరాహారదీక్ష చేయవద్దని గాంధీని సర్దార్ కోరాడు. కాని గాంధీ వినలేదు. అయితే తాను రాజీనామా చేస్తానన్నాడు. పరిస్థితిని గమనించి ప్రెసిడెంట్ రాజేంద్రప్రసాద్ నాయకులందర్నీ పిలిపించి తాము లక్ష్యాన్ని సాధించడానికి ప్రయత్నిస్తామని ప్రతిజ్ఞ చేయించాడు. గాంధీజీ దీక్షను విరమించాడు. ఐక్యత కోసం పాటుపడతామని హిందువులు ప్రతిజ్ఞ చేశారు. కాని ఆర్.యస్.యస్. హిందూ మహాసభ వ్యతిరేకించాయి. ఈ సమయంలో సర్దార్, నెహ్రూల మధ్య విభేదాలు సృష్టించడానికి కొంతమంది ప్రయత్నించారు.

మౌలానా ఆజాద్ గొప్ప పండితుడు. కాంగ్రెస్‌లో అగ్రస్థానం అతనిదే. ముస్లింలీగ్ ఏర్పడిన తరువాత ముస్లింలమీద అతని ప్రభావం తగ్గిపోయింది. కాంగ్రెస్‌మీద ముస్లింలు పెత్తనం చెలాయిస్తున్నారు.


గాంధీ దీక్షను విరమించిన తరువాత తన ప్రార్థనా సమావేశానికి సాయంకాలం వెళ్తూన్నప్పుడు బిర్లాహౌస్‌కి బయట బాంబు పేలింది. నేరస్తుని పట్టుకుందామని పోలీసులు అంటే గాంధీ అనుమతించలేదు.

నెహ్రూకి తనకి మధ్య అగాధాన్ని సృష్టించడానికి కొంతమంది ప్రయత్నిస్తున్నారు. కాబట్టి తాను రాజీనామా చేస్తానన్నాడు సర్దార్. కాని దేశానికి యిద్దరూ అవసరమన్నాడు. తాను నెహ్రూకి పూర్తి మద్దతు యిస్తానన్నాడు సర్దార్.

సర్దార్ వెళ్లిన తరువాత గాంధీ ప్రార్థనా సమావేశానికి బయలుదేరాడు. అప్పుడు



నాథూరామ్‌గాడ్సే అతని పాదాలను ముట్టుకునే నెపంతో రివాల్వర్‌తో మూడుసార్లు గాంధీపై పేల్చాడు. "హేరామ్ !" అంటూ గాంధీ క్రింద పడిపోయాడు. నెహ్రూ, సర్దార్‌లు గాంధీ ఆశయాలను నెరవేరుస్తామని ప్రతిజ్ఞ చేశారు. కాబట్టి ఇండియా భవిష్యత్తు వారి యిద్దరి చేతులలోనే ఉంది. తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంవల్లనే గాంధీ మరణించాడని మౌలానా సర్దార్‌ని విమర్శించాడు. సర్దార్ తాను తీసుకున్న జాగ్రత్తలను గురించి వివరించాడు. పార్లమెంటు అతని వివరణతో సంతృప్తి చెందింది. ముందే తన మరణం గురించి తెలిసినట్లుగా గాంధీ, "నేను చనిపోవలసివస్తే, ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా లాభంలేదు" అన్నాడు. అది నిజమయింది. గాంధీ చనిపోయిన తరువాత సర్దార్‌కి తీవ్రంగా గుండెనొప్పి వచ్చింది. కాని కోలుకున్నాడు.



# 15. రాజ్యాంగసభ / శాసనసభ

## (కాన్‌స్టిట్యుయెంట్ అసెంబ్లీ)

**కా**న్‌స్టిట్యుమెంట్ అసెంబ్లీలో సర్దార్ ప్రముఖపాత్ర పోషించాడు. రాజ్యాంగాన్ని అసెంబ్లీ తయారుచేయగలదా అని చర్చిల్‌కి అనుమానం. ఇది ముస్లింలకు లాభదాయకం. జిన్నా ఆదేశాల మేరకు ముస్లింలు అసెంబ్లీని బహిష్కరించి ప్రత్యక్ష కార్యాచరణకు దిగింది.

అసెంబ్లీ అంటే అన్ని రంగాలలోను ప్రతిభావంతులైనవారి కలయిక. వారు రాజ్యాంగాన్ని తయారుచేయడానికి పూనుకున్నారు. అసెంబ్లీకి రాజేంద్రప్రసాద్‌ను ప్రెసిడెంటుగా ఎన్నుకున్నారు.

అసెంబ్లీ యొక్క మొదటిపని తన స్వాతంత్ర్యాన్ని నిరూపించుకోవడం. కమిటీ నియమాలను తయారుచేసింది. వాటిని అసెంబ్లీ ఆమోదించింది. ప్రాథమిక హక్కులలో రెండు విషయాలున్నాయి – 1. నాగరిక దేశాలలో అంగీకరించబడిన హక్కులు 2. కొంతమంది ఆ నియమాలను కుదించదలచుకున్నారు. ఈ రెంటినీ సమన్వయపరచడానికి సర్దార్ ప్రయత్నించాడు. ప్రతి ఒక్కరు స్వతంత్ర భారతదేశంలో స్వేచ్ఛగా ఉండాలని సర్దార్ అభిప్రాయం. అయితే రాష్ట్రాలకు కూడా తగినన్ని అధికారాలుండాలని కమిటీకి చెప్పాడు.


ఆస్తిహక్కుల్ని రక్షించడంలో కఠిననియమాలు ఉండాలని సర్దార్ అభిప్రాయం. ప్రభుత్వం ఎవరి భూమినైనా తీసుకోవలసివస్తే తగిన పరిహారం చెల్లించి తీసుకోవాలి. ఎంత పరిహారం యివ్వాలనే విషయంపై శాసనసభకి పూర్తి అధికారాలు ఉండనక్కర్లేదు.



ఈ సమస్యమీద భిన్నాభి ప్రాయాలు వచ్చాయి. 1. రాజ్యాంగంలో పరి హారం హక్కుని నమోదు చేయాలా? 2. అయితే ఆ పరిహారం శాసనసభ నిర్ణయించాలా లేక న్యాయాధికారి నిర్ణయిం చాలా? రాజ్యాంగంలోనే పరిహారం గురించి నిర్ణయం జరగాలని సర్దార్ సూచించాడు. దానిని అంగీక రించారు.

మైనారిటీల సాంఘిక, ఆర్థిక సమస్యల్ని పరిష్కరించాలనుకున్నాడు సర్దార్. ప్రత్యేక నియోజకవర్గాలు అక్కర్లేదన్నాడు. మైనారిటీ కమ్యూనిటీలను ప్రత్యేకంగా కలుసుకుని ఒప్పించాడు. కాని అంబేద్కర్ నాయకత్వంలో షెడ్యూల్డు కులాలవారు వ్యతిరేకించారు. పూనా చట్టం ప్రకారం వారికి రిజర్వ్‌డ్ స్థానాలు కల్పించారు. దానిని మరో పది పొడిగించాలనుకున్నారు. అస్పృశ్యతా నివారణకు సర్దార్ కృషిచేశాడు. ఆవిధంగా అసెంబ్లీలో తీర్మానం చేయించాడు. వారికి ఆలయాలలోను, హాస్టళ్లలోను ప్రవేశాలు కల్పించాడు. కేబినెట్‌లో కూడా మైనారిటీ సభ్యులకు స్థానం కల్పించాలని చెప్పాడు. రాజ్యాంగంలో ఒక రాష్ట్రంయొక్క పనితీరు సంతృప్తికరంగా లేకపోతే ప్రెసిడెంటు దానిని తన ఆధీనంలోకి తెచ్చుకోవచ్చునని ఉంది.

న్యాయవ్యవస్థ పటిష్టంగా ఉండాలని సర్దార్ అభిప్రాయం. ప్రతి వ్యక్తికి రాజ్యాంగం ప్రాథమికహక్కుల్ని కలిగించింది. రాష్ట్రప్రభుత్వాలు న్యాయవ్యవస్థలో జోక్యం చేసుకోకూడదు. ప్రెసిడెంట్‌ని ఎన్నుకోవడంలో సర్దార్‌కి, నెహ్రూకి అభిప్రాయభేదాలు వచ్చాయి. ప్రెసిడెంట్‌ని పార్లమెంటు ఎన్నుకోవాలని నెహ్రూ అన్నాడు. అంటే ప్రధానమంత్రి నామినేట్ చేసిన వ్యక్తి అవుతాడు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలలో ఎన్నికయిన సభ్యులచేత ప్రెసిడెంటు ఎన్నుకోబడాలని సర్దార్ అన్నాడు. అప్పుడతడు స్వతంత్రుడు. అసెంబ్లీలో కె.ఎమ్.మున్షీ, అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, సర్ గోపాలస్వామి అయ్యంగార్లను "త్రీమస్కిటియర్స్"గా పిలుస్తారు.



# 16. హోమ్‌శాఖా మంత్రిగా

ఢిల్లీలో శాంతి నెలకొన్న తరువాత సర్దార్ ప్రభుత్వయంత్రాంగాన్ని సరిచేయాలనుకున్నాడు. పరిస్థితిని పూర్తిగా సమీక్షించాడు. మంచి ఉద్యోగులు లేరు. మధ్యంతర ప్రభుత్వంలో పదవి స్వీకరించిన తరువాత అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రుల్ని ఢిల్లీకి పిలిపించాడు. కేంద్రానికి, రాష్ట్రానికి ఒక సంయుక్త ప్రభుత్వ సర్వీసు ఉండాలని సూచించాడు. ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐ.ఏ.యస్)ను నెలకొల్పాడు. (ఇండియన్ సివిల్ సర్వీసు పద్ధతిలో) పోటీ పరీక్షల ద్వారా అభ్యర్థిని తీసుకోవడం జరుగుతుంది. అలాగే ఇండియన్ పోలీస్ సర్వీస్‌ను కూడా ఏర్పాటుచేశాడు. (ఐ.పి.యస్).


దేశంలో చాలామంది సంఘవ్యతిరేకశక్తులున్నాయి. రాష్ట్రప్రభుత్వాలను సన్నద్ధంగా ఉండమని హెచ్చరించాడు. పోలీసుబలగాలను వృద్ధిచేయాలని చెప్పాడు. నేరాలు తగ్గుముఖం పట్టాయి. రాష్ట్రాల విలీనం చాలా ముఖ్యమైన ఘట్టం. అనుభవం, శిక్షణ లేనివారిని ఆఫీసర్లుగా నియమించారు. వారిని తొలగించి అనుభవజ్ఞులైన వారిని రీజనల్ కమిషనర్లుగా, సలహాదారులుగా, ప్రధాన కార్యదర్శులుగా నియమించాడు. ఎక్కడ ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించేవాడు. ఒక్కసారి నిర్ణయం తీసుకున్న తరువాత రెండవ ఆలోచనకు తావులేదు.

ఉద్యోగుల మానసికస్థితిని మార్చాలనుకున్నాడు. సీనియర్ ఉద్యోగులకు తగిన భరోసా కల్పించాడు. రాష్ట్రాలు విలీనం అయిన తరువాత కొత్త యూనియన్లకు సమర్థులైన ఉద్యోగుల్ని నియమించాడు. చిన్నచిన్న తప్పులు ఎవరు చేసినా క్షమించేవాడు. "సేవలలో

జోక్యం చేసుకోవడం ప్రజాస్వామ్యంలో పెద్ద ప్రమాదం" అనేవాడు. ఆఫీసులలో జాప్యాన్ని నిరోధించాడు.

దేశ సుస్థిరతకు సేవలు చాలా ముఖ్యమని సర్దార్ నమ్మకం. సేవలకు గ్యారంటీ యివ్వడం కుదరదని అసెంబ్లీ అభిప్రాయపడింది. గ్యారంటీ తప్పకుండా యివ్వాలని అసెంబ్లీని ఒప్పించాడు.

సర్దార్‌కు బలమైన వ్యతిరేకులు కమ్యూనిస్టులు. కమ్యూనిస్టులు ఆందోళనకారులనీ, అరాచకాన్ని సృష్టిస్తారని, సర్దార్ అభిప్రాయం. ఆ సంస్థను అతడు బహిష్కరించాడు. బహిష్కరణ ఎత్తివేయమని వారు పార్లమెంటులో ఒత్తిడి తెచ్చారు. కాని సర్దార్ అంగీకరించలేదు. ఎంతకాలం వారు హింసాత్మక చర్యలు కొనసాగిస్తూ ఉంటారో అంతవరకు నిషేధం ఉంటుందని చెప్పాడు. మతఛాందసుల యెడల కూడా అదేవిధంగా కఠినంగానే ఉన్నాడు. రాజకీయాలలో మతప్రసక్తి ఉండకూడదని వారికి చెప్పాడు. అకాలీలు కూడా తమ సామ్రాజ్యాన్ని నెలకొల్పాలని ప్రయత్నించారు. హింసను ప్రేరేపిస్తామని హెచ్చరించారు. వారు తమ హక్కులకోసం సర్దార్ వద్దకు వచ్చారు. అటువంటి అభిప్రాయాలు ఉండకూడదని వారికి నచ్చచెప్పాడు. అసాంఘిక కార్యకలాపాలను అదుపులోకి తెచ్చాడు.




# 17. రాష్ట్రాలకు మంత్రి

## (మినిస్టర్ ఫర్ స్టేట్స్)

హోమ్ అఫైర్స్, ఇన్‌ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ శాఖలతోపాటు, రాష్ట్రాలకు మంత్రిగా బాధ్యతలు స్వీకరించాడు. 554 రాష్ట్రాలను ఇండియన్ యూనియన్ చేర్చడం సర్దార్‌యొక్క పరిపాలనాదక్షతకు, ఐక్యత సాధించాలనే ఉద్దేశానికి గొప్ప ఉదాహరణ. అయితే వైస్రాయి వారికి చేరడానికి లేదా స్వతంత్రంగా ఉండడానికి స్వేచ్ఛయిచ్చాడు. రాజులు తాము రాజ్యాధికారం తమకే ఉండాలనుకున్నారు. వారికి బ్రిటిష్‌వారు మద్దతు యిచ్చారు. రాజులు ప్రజలనుండి వీలయినంత దోచుకుంటున్నారు.

బలమైన, ఐక్యతతో ఉండే భారతదేశం సర్దార్ యొక్క కల. సుస్థిరంగా ఉండాలంటే డొమీనియన్‌లో కలవాలని వైస్రాయి కూడా రాష్ట్రాలకు సలహా యిచ్చాడు. ప్రధానమంత్రి రాష్ట్రాల విలీనం విషయంలో సర్దార్ కార్యక్రమాలలో జోక్యం చేసుకోలేదు. రాష్ట్రాలకు ఒక డిపార్ట్‌మెంటును స్థాపించి, వి.పి. మీనన్‌ను కార్యదర్శిగా నియమించాడు. అతడు కూడా చాకచక్యంగా రాజులను ఒప్పించి, డొమీనియన్‌వారు కలిసేటట్లు ప్రయత్నించాడు. మన సంస్కృతిలో ఉన్న పారదర్శకత గురించి వివరించి ఆ రాష్ట్రాలను, పొరుగు రాష్ట్రాలను ఆలోచింపచేశాడు. అందరూ ఒకటేనని నిరూపించాడు. కాని రాష్ట్రాలు విలీనం కావడానికి జిన్నా వ్యతిరేకించాడు. కొంతమంది రాజుల్ని తనవైపు తిప్పుకుందామనుకున్నాడు. కాని సాధ్యంకాలేదు. మౌంట్‌బాటన్ కూడా పాకిస్తాన్ వలలో పడవద్దని రాజులను హెచ్చరించాడు. ఒక్కొక్కరుగా రాజులందరూ విలీనమయ్యారు.



విలీనం కావడంతో సరిపోదు. ఇండియాకి, వారికి మధ్య సమన్వయం కావాలి. హైదరాబాద్, కాశ్మీర్, జునాగడ్‌లు తప్ప మిగిలిన రాష్ట్రాలు విలీనం కావడానికి సంతకాలు చేశాయి. ఇది సర్దార్‌కి ఘనవిజయం.

విలీనం కానప్పుడు రాష్ట్రాలలో ప్రజాస్వామ్యం లేదు. పాలకులదే యిష్టారాజ్యం. అందువల్ల ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవాలనుకున్నారు. అరాచకం ప్రబలడానికి సిద్ధంగా ఉంది. అయితే తిరుగుబాటు శాంతియుతంగా చేయాలని సర్దార్ చెప్పాడు. పాలకులకు బాధ్యతగల ప్రభుత్వాన్ని ప్రజలకు అందివ్వమని సర్దార్ సలహా యిచ్చాడు. లేకపోతే తిరుగుబాటు వస్తుందని హెచ్చరించాడు. పాలకులు ప్రమాదాన్ని గుర్తించారు. వారు తమ ఖర్చుల్ని తగ్గించుకోవలసివచ్చింది. కాని సర్దార్ వారికి ప్రీవీ పర్సులు యిచ్చాడు. వారి ఆస్తులమీద హక్కులు యిచ్చాడు. వారి భోగభాగ్యాలకు అనుమతినిచ్చాడు. సర్దార్ పెట్టిన షరతులకు పాలకులు అంగీకరించారు.

చిన్న రాష్ట్రాలు స్వతంత్రంగా ఉండలేకపోయాయి. వారికి ఉన్న వనరులు ప్రజల అవసరాలను తీర్చలేవు. కాబట్టి ప్రక్కనున్న రాష్ట్రాలతోగాని, యూనియన్‌తోగాని విలీనం కావాలి. యూనియన్ ఆఫ్ స్టేట్స్ కేంద్రప్రభుత్వం యొక్క పర్యవేక్షణను అంగీకరించింది. 554 రాష్ట్రాలలో 310 రాష్ట్రాలు 6 యూనియన్లుగా ఏర్పడ్డాయి. 5 రాష్ట్రాలు పూర్తిగా

కేంద్ర పర్యవేక్షణలో ఉన్నాయి. 21 రాష్ట్రాలు హిమాచల్ ప్రదేశ్‌గా ఏర్పడ్డాయి. రెండు రాష్ట్రాలు ప్రత్యేకంగా ఉన్నాయి. మొత్తం 554 రాష్ట్రాలు 14 యూనియన్లుగా, రాష్ట్రాలుగా ఏర్పడ్డాయి.

జూనాగడ్ పాకిస్తాన్‌లో చేరతానంది. దీనివల్ల కొన్ని కష్టాలు ఎదురవుతాయి. ఇండియా దీనిని వ్యతిరేకించింది. కతియవాడ్ దీనివల్ల నష్టపోతుంది కాబట్టి సర్దార్ అంగీకరించలేదు. శ్యామల్‌దాస్ గాంధీ జునాగడ్‌ని నవాబ్‌నుండి విడదీయడానికి కతియవాడ్ పీపుల్స్‌ఫ్రంట్‌ను స్థాపించాడు. జునాగడ్ ప్రజలు తిరుగుబాటు చేశారు. పాకిస్తాన్ నవాబ్‌కు సహాయం చేయలేకపోయింది. అందువల్ల నవాబ్ సర్వస్వం దివాన్‌కు విడిచిపెట్టి కరాచీకి పారిపోయాడు. అక్కడనుండి పరిపాలన చేయలేక తన రాష్ట్రాన్ని ఇండియాలో విలీనం చేసుకొమ్మని కోరాడు. రాజ్‌కోట్‌లో ఉన్న రీజనల్ కమిషనర్ ఆ రాష్ట్రాన్ని స్వాధీనం చేసుకుని దానిని సౌరాష్ట్రంలో విలీనం చేశాడు.

ప్రజలకు నిజాంతో యిబ్బందులు వచ్చాయి. నిజాం పేరాశ కలవాడు. చాలా డబ్బు సంపాదించాడు. ప్రజలను దోచుకున్నాడు. తాను స్వతంత్రంగా ఉండదలచుకున్నాడు. పరిపాలించడానికే భగవంతుడు తనను సృష్టించాడని చెబుతాడు. అతనికి ప్రజాస్వామ్యం నచ్చదు. విలీనం కావడానికి అంగీకరించలేదు. హైదరాబాద్ ఇస్లామిక్‌స్టేట్‌గా ఉండాలని అతని ఉద్దేశం. నిజాంతో సంప్రదింపులు జరిపారు. కాని అతడు లొంగలేదు. రక్షణ, బయట వ్యవహారాలు, సమాచారం మొదలైనవాటిలో ఒప్పందానికి సిద్ధమని చెప్పాడు. నిజాం ఒక ప్రతినిధిబృందాన్ని ఒప్పందం మీద సంతకం చేసి ఢిల్లీ పంపించాడు. కాని ఆ బృందాన్ని రజాకర్లు అడ్డుకుని ఢిల్లీకి చేరనీయలేదు. అతడు ప్రతినిధిబృందాన్ని మార్చాడు.

జిన్నా రికమండేషన్ మీద, లైక్ ఆలీఖాన్‌ని హైదరాబాద్‌కు ప్రధానమంత్రిగా నియమించారు. రజ్వీ సర్దార్‌ని ఢిల్లీలో కలుసుకున్నాడు. చివరకు నిజాం పాకిస్తాన్‌లో విలీనం కానని చెప్పాడు. అయినా లోలోపల ఇండియాకి నిజాం వ్యతిరేకంగానే ఉన్నాడు. సర్దార్ కె.ఎమ్ మున్షీని నియమించి ఆ వ్యవహారాలను దర్యాప్తు చేయమన్నాడు. యూనియన్ గవర్నమెంటుతో సంప్రదించకుండా నిజాం రెండు ఆర్డినెన్సులు జారీచేశాడు. ఒకటి – హైదరాబాద్‌నుండి విలువైన లోహాలను ఎగుమతిచేయకుండా ఉండడం, రెండవది ఇండియా ద్రవ్యం హైదరాబాద్‌లో చెలామణికాకుండా ఉండడం. ఇవి ఒప్పందాన్ని ఉల్లంఘించినట్లే. ఇండియా రజాకర్లను ఆందోళన చేయమని ప్రేరేపించింది.


నిజాం వాళ్లని అదుపులో పెట్టలేకపోయాడు. హైదరాబాద్‌లో పూర్తి బాధ్యతగల ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తానన్నాడు. నిజాం ఇండియాతో సత్సంబంధాలు కావాలన్నాడు. కాని విలీనం కాదలచుకోలేదు. ఇండియాతో సంబంధాలు తెంచుకుంటానని నిజాం మౌంట్‌బాటన్‌కి లేఖరాశాడు. ఈలోగా రజాకర్లు మతయుద్ధాలు ప్రారంభించారు. శాశ్వత పరిష్కారం కోసం ఇండియా ప్రయత్నిస్తుంది.

రజాకర్లు, కమ్యూనిస్టులు ఆందోళనలు మొదలుపెట్టారు. ప్రభుత్వం మిలిటరీని దింపవలసివచ్చింది. నిజాం ఒక ప్రేక్షకుడిగా మిగిలిపోయాడు. నిజాం యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్‌కు ఇండియా ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఫిర్యాదు చేశాడు. రజాకర్ల ఆగడాలు మితిమీరుతున్నందువల్ల శాంతిభద్రతలకోసం హైదరాబాద్‌కి సైన్యాన్ని పంపుతానన్నాడు సర్దార్. సైన్యం హైదరాబాద్‌లోకి ప్రవేశిస్తే హిందువులందరినీ కాల్చివేస్తానని రజ్వీ హెచ్చరించాడు.

సైన్యం హైదరాబాద్ చేరింది. హైదరాబాద్‌లో ఉన్న సైన్యం ఆపలేకపోయింది. 108 గంటలు పోలీసు చర్య జరిగింది. హైదరాబాద్ భారతసైన్యానికి లొంగిపోయింది. తన ఐశ్వర్యానికి ముప్పులేదని చెప్పడంతో నిజాం భారతరాజ్యాంగాన్ని అంగీకరించాడు. సర్ సాలార్‌జంగ్ మున్షీతో, "మా జీవితాలు, మా ఆస్తులు రజ్వీ దయమీద ఆధారపడిఉన్నాయి. నాకు ప్రాణహాని కూడా కలగవచ్చు" అన్నాడు.

తాను ఏ రాజుని బలవంతం చేయలేదని, పరిస్థితుల ప్రభావంవల్ల వారే విలీనం అయ్యారని సర్దార్ అన్నాడు. కొత్త యూనియన్లకు అనుభవం రావడానికి తగిన సహాయం సర్దార్ చేశాడు. వారు కలిసికట్టుగా పనిచేసేటట్టు చేశాడు. తనకు యిచ్చిన పనిని శరవేగంతో పూర్తిచేయడమే సర్దార్ యొక్క విజయరహస్యం. రాజులయెడల చాలా ఉదారంగా ఉన్నాడని సర్దార్‌ని విమర్శించారు.

రాజులు విలీనం కాకముందు వారి ప్రీవీపర్సులు 20 కోట్లు. తరువాత వారికి 5.8 కోట్లు మాత్రమే వస్తున్నాయి. రాష్ట్రాలు విలీనం అయిన తరువాత కొత్త ప్రభుత్వాలకు వచ్చినది 77 కోట్లు, 500 గ్రామాలు, వేలాది ఎకరాల భూమి, సర్దార్ భారతదేశ ఐక్యత సాధించారు. రాష్ట్రాల మధ్య సరిహద్దులు చెరిపివేశాడు. ఆధునిక పద్ధతులలో ప్రభుత్వం నడుస్తుంది.



# 18. చివరి సంవత్సరాలు

**భా**రతదేశానికి స్వాతంత్ర్యం సంపాదించాలనే సర్దార్ ఆశయం నెరవేరింది. ఒకప్పుడు అతడు కఠినంగా ఉండేవాడు. కాని చివరకు ఒక నిర్మాతగా మారాడు. అతనికి ప్రశాంతత లభించింది. రైతు అలవాట్లు అతనిని అంటిపెట్టుకునే ఉన్నాయి. అతడు ఉదయాన నడకకు వెళ్లినప్పుడు చాలామంది కలిసి తమ కష్టాలను చెప్పుకునేవారు. వారికి తగిన సలహాలు యిచ్చేవాడు. తాజావార్తల్ని విమర్శించేవాడు. ఇంటికి వచ్చి స్వల్పంగా అల్పాహారం తీసుకునేవాడు. తరువాత ఇంటర్‌వ్యూలు ఉండేవి. పదకొండు గంటలకు ఆఫీసుకి వెళ్లేవాడు. సాయంత్రం 7.30కు భోజనం చేసి 10 గంటలకు నిద్రపోయేవాడు.

గుండెపోటు వచ్చిన తరువాత ఉదయం నడకను ఆపివేశాడు. రాత్రి త్వరగా నిద్రపోయేవాడు. ఇంటర్‌వ్యూలు కూడా తగ్గించాడు. తరుచుగా కడుపునొప్పి వచ్చేది. దానిని భరించి ఆఫీసు పనులను చూసేవాడు. ఆరేళ్ల బాలిక లీలాతో పేకాట ఆడేవాడు. ఆమె వి.శంకర్ కుమార్తె, సర్దార్ ఆఫీసు ఫైళ్లు చూసేవాడు కాదు కాని తన కార్యదర్శులతో చర్చలు జరిపేవాడు. సమావేశాల్లో ఎటువంటి భావోద్వేగాలు ప్రదర్శించేవాడు కాదు. వెంటనే చర్య తీసుకోవలసిన సందర్భాలలో ఆలస్యం చేసేవాడు కాదు. రజాకర్లను అణచడానికి సైన్యాన్ని పంపడంలో వెంటనే చర్య తీసుకున్నాడు.

దేశవిభజన వల్ల అల్లర్లు చెలరేగినప్పుడు అతడు నేరుగా అమృత్‌సర్ వెళ్లాడు. అతడు అక్కడ ప్రసంగించి, శాంతిని నెలకొల్పగలిగాడు. రాష్ట్రాలను విలీనం చేసే



సందర్భంలో కూడా నేరుగా రాజులతోనే చర్చించి ఐక్యభారత్‌కు తోడ్పడవలసినదిగా వారిని కోరాడు. ఒక్కొక్కటిగా అన్ని రాష్ట్రాలు పర్యటించి రాష్ట్రాలను విలీనం చేయించాడు. భారతదేశ కీర్తి యినుమడింపచేసిన సైన్యాన్ని అభినందించాడు. గాంధీ హృదయాల కలయికకోసం నిరాహారదీక్ష చేస్తే, అభ్యంతరం తెలియజేశాడు.

గాంధీజీ హత్య సర్దార్‌ని కలచివేసింది. వ్యక్తిగతంగా అతనికి గాంధీజీ మరణం నష్టదాయకం. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినా, స్వాతంత్ర్యం యొక్క సారాంశమైన సమానత్వం, ఐకమత్యం, జాతీయభావనలు యింకా అనుభవంలోకి రాలేదు. గ్రామాలే దేశానికి వెన్నెముకలు కాబట్టి గ్రామాలయొక్క స్థితిని మెరుగుపరచాలని చెప్పేవాడు.

గాంధీ మరణానంతరం సర్దార్‌లో మార్పుని గమనించింది అతని కుమార్తె మణిబెన్. గాంధీజీ తాను ఒకేసారి మరణించాలనుకున్నాడు సర్దార్. అందువల్ల ఏ విషయాన్నీ పట్టించుకోవడంలేదు. గాంధీజీకి తగిన రక్షణ కల్పించలేకపోయాడని అతనిని విమర్శించారు. అతనికి గుండెపోటు వచ్చి స్పృహ కోల్పోయాడు. అతడు కోలుకున్న తరువాత, “నేను గాంధీజీ వద్దకు వెళ్తూ ఉంటే ఎందుకు ఆపారు ?” అని అడిగాడు.

సర్దార్ ట్రెయిన్‌లో వెళ్తూన్నప్పుడు రట్లాం స్టేషన్లో ట్రెయిన్ ఆగింది. ప్రజలంతా అతనిని చూద్దామని అనుకున్నారు. కాని అతడు అంగీకరించలేదు. వారు రైలుపట్టాలమీద కూర్చున్నారు. అతడు బయటికి వచ్చి వారికి నమస్కరించాడు. అటువంటి ప్రదర్శనలు మాని పని చేయవలసినదిగా వారిని కోరాడు.

పంజాబ్, నాగపూర్, ఉస్మానియా విశ్వవిద్యాలయాలు సర్దార్‌కి డాక్టర్ ఆఫ్ లా యిచ్చి గౌరవించాయి. సర్దార్ అనేక రాష్ట్రాలు సందర్శిస్తూ బరోడా వచ్చాడు. మహారాజు అక్కడ అతనిని ప్రసంగించవద్దని నిషేధించాడు. ఏదో ఒకరోజు మహారాజే అక్కడ ప్రసంగించమని కోరుతాడన్నాడు. బరోడా వెళ్లడమంటే సర్దార్‌కి తీర్థయాత్రకు వెళ్లినంత సంతోషం కలుగుతుంది.

సర్దార్ విమానంలో జైపూర్ బయలుదేరాడు. కాని విమానంలో ఏదో సాంకేతికలోపం వచ్చింది. విమానం పాలం విమానాశ్రయానికి తిరిగివచ్చింది. కొన్ని మరమ్మత్తులు చేసి బయలుదేరారు. కాని మళ్లీ ఒక ఇంజను ఆగిపోయింది. పైలట్ విమానాన్ని సముద్రతీరంలో ఆపాడు. కె.బి.లాల్ అనే ఐ.సి.యస్ ఆఫీసరు ఆ దారిన వెళ్తూ వారిని చూసి, జైపూర్‌కి తీసుకునివెళ్లాడు. దేశం అతని క్షేమం గురించి కంగారుపడింది. మరునాడు వార్తల్లో అతడు సురక్షితంగానే ఉన్నాడని రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పార్లమెంటు అతడు సురక్షితంగా చేరినందుకు అతనిని అభినందించింది. విమానం చెక్కబడిన ఒక వెండిట్రోఫీని అతనికి బహూకరించారు.

మళ్లీ సర్దార్ ఆరోగ్యం క్షీణించింది. వాతావరణ మార్పు కావాలని డాక్టర్లు చెప్పారు. సర్దార్ బొంబాయి వెళ్లాడు. సముద్రపు గాలివల్ల కొంత తేరుకున్నాడు కాని 1950వ సంవత్సరమే అతని చివరి సంవత్సరం అయింది. 1950 జనవరిలో ఇండియా పాకిస్తాన్‌ల మధ్య సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. దేనికయినా సిద్ధంగా ఉండమని సర్దార్ ప్రజలను కోరాడు. ముఖ్యంగా ఆర్థికసంబంధాలు దెబ్బతిన్నాయి. తూర్పుబెంగాల్‌లో ఆందోళనలు మళ్లీ ప్రారంభమయ్యాయి. హిందువులు భయపడి పారిపోయారు. సర్దార్ పాకిస్తాన్‌ను హెచ్చరించాడు. 1950, ఏప్రిల్ 8వతేదీన యిద్దరు ప్రధానమంత్రులు ఒప్పందం చేసుకున్నారు.


పశ్చిమబెంగాల్‌లో ఉన్న హిందువులకు యిది నచ్చలేదు. తీవ్రమైన చర్య తీసుకోవాలన్నారు. సర్దార్ కలకత్తా వెళ్లి అక్కడి ప్రజలను శాంతపరిచాడు. 12 లక్షలమంది ముస్లింలు పాకిస్తాన్ నుండి పశ్చిమ బెంగాల్‌కు వచ్చారు. భారతప్రభుత్వం వారికి పదిమిలియన్లు ఖర్చుపెట్టి పునరావాసం కల్పించింది. కొంతమంది హిందువులు తూర్పుపాకిస్తాన్‌కు చేరారు. కాని వారిని రెండవతరగతి పౌరులుగానే గుర్తించారు.

పార్టీసభ్యులలో కూడా భేదాభిప్రాయాలు వచ్చాయి. సర్దార్ లక్నో వెళ్లి ఆ భేదాలు

సమసిపోయేటట్లు చేశాడు. తాత్కాలికంగా వారు సమాధానపడ్డారు. "కీర్తిమందిర్" అనే స్తూపాన్ని గాంధీస్మారకంగా గాంధీ స్వస్థలమయిన పోరుబందర్‌లో ప్రతిష్ఠించాడు సర్దార్. పాకిస్తాన్‌తో శాంతి కావాలనే కోరుకున్నాడు సర్దార్. సర్దార్ పుట్టినరోజు కానుకగా అహమ్మదాబాద్ పౌరులు 15 లక్షల రూపాయిలు అతనికి బహూకరించారు. స్వామిదయానంద్ స్మారకోపన్యాసం చేయడానికి కేంద్ర ఆర్యసమాజ్ సర్దార్‌ని ఢిల్లీకి ఆహ్వానించింది. తన ప్రసంగంలో టిబెట్, నేపాల్‌లపై చైనా వైఖరిని విమర్శించాడు. చైనావల్ల ఉత్తరసరిహద్దుకి ప్రమాదం ఉందని హెచ్చరించాడు.

విరామంలేని ప్రయాణాలు, పనివల్ల సర్దార్ ఆరోగ్యం బాగా క్షీణించింది. కడుపునొప్పి తిరగబెట్టింది. చాలా నీరసించిపోయాడు. విశ్రాంతి కోసం బొంబాయి వెళ్లాడు. అంత అనారోగ్యంలోను చైనానుండి ఇండియాకు రాబోయే ప్రమాదం గురించే ఆలోచించాడు.

14వ తేదీ రాత్రి సర్దార్ ఆరోగ్యం బాగా క్షీణించింది. 15 ఉదయం గుండెనొప్పి వచ్చింది. ఆక్సిజన్ యిచ్చారు. ఉదయం 8 గంటలకు స్పృహవచ్చింది. కాని 97 నిముషాల తరువాత ప్రశాంతంగా మరణించాడు. దేశం అంతా విచారగ్రస్తమయింది. నవభారతానికి ఐక్యత సాధించిన వ్యక్తి సర్దార్ అని నెహ్రూ అన్నాడు. జాతీయ విపత్తుగా సర్దార్ మరణాన్ని ప్రభుత్వం ప్రకటించింది.



# 19. సర్దార్ రాజకీయాలు

మన ఆధునిక రాజకీయ సంస్కృతి మన గొప్ప నాయకులనుండి మనకు సంక్రమించిన వారసత్వ సంపద. అధికారం కావాలని అడగడానికి ముందు కాంగ్రెస్ దానికి అర్హత సంపాదించాలి. ఆ మార్పుకి సర్దార్ ఒక శిల్పి అయ్యాడు. సంస్థ ఒక ప్రణాళికాబద్ధంగా లేదు. వారిలో ఐక్యతకు కృషిచేశాడు సర్దార్.

## I

వల్లభ్‌భాయి తండ్రి ఆధ్యాత్మిక మనస్తత్వం కలవాడు. బాల్యంలో తండ్రినే అనుసరించాడు వల్లభ్. కాని పెద్దవాడయిన తరువాత తల్లియొక్క క్రియాశీలత అబ్బింది. సనాతన సాంప్రదాయాలను విడిచిపెట్టాడు.

వల్లభ్ మితభాషి. బాల్యంలో ఎవరికీ లొంగేవాడుకాడు. ఏ పనినైనా ముక్కుకు సూటిగా చేసేవాడు. బాల్యంలోనే అతనిలో నాయకత్వలక్షణాలు కనిపించాయి. అతడు తన కుటుంబం గురించి, సాంప్రదాయాల గురించి ఎక్కువగా ఆలోచించేవాడు. అతడు బారిస్టర్‌గా మంచిపేరు తెచ్చుకున్నాడు. రాజకీయాలలో ఆసక్తి లేదు.

వల్లభ్‌భాయిని "ఉక్కుమనిషి" ఇండియన్‌బిస్మార్క్ అనేవారు. ఎక్కడ ఏ తప్పు జరిగినా రాజకీయంగా అనగా ప్రభుత్వపరంగా దానిని సరిచేయాలి అనేవాడు. అతడు పక్కా గాంధేయవాది. సర్వస్వమూ అతనికి గాంధీయే. రాజకీయాలలో సరియైన చర్య తీసుకోవాలంటే మంచి ఆలోచన కావాలి. జాతియొక్క గతంలో రాజకీయ భావాలు వేళ్లూనుకుని ఉన్నాయి.



అందరి భారతీయుల మాదిరిగానే సర్దార్‌కి భగవంతునిమీద నమ్మకం ఉంది. రాజకీయ లబ్ధి కావాలంటే అధికారం కావాలి. మర్యాదని, అవమర్యాదని కూడా రాజకీయవేత్త సమానంగా స్వీకరించాలి.

## II

అహ్మదాబాద్‌లో ప్రసంగిస్తూ సర్దార్, "నేను రాజకీయవేత్తను కాను, వక్తను కాను. నేను సాధారణ రైతుని. నాది ఒకే సాధారణ పద్ధతి. నేను అనుకున్నది సాధించేవరకు అన్నింటికీ లేదు, కాదు అని చెబుతాను" అన్నాడు.

రాజకీయవేత్తగా అతనికి యీ క్రింది గుణాలు ఆపాదించారు 1. బ్రిటిష్‌వారి యెడల అతని అభిప్రాయం 2. కాంగ్రెస్‌పార్టీని బలోపేతం చేయడం 3. రాజులు 4. ముస్లిల సమస్య.


పటేల్ రాజీపడని మనస్తత్వం కలవాడనీ, కాంగ్రెస్ నాయకులలో గొప్పవాడనీ వేవెల్ చెప్పాడు. పటేల్ చర్చిల్‌ని, లిన్‌విత్‌గోని, బ్రిటిష్‌క్యాబినెట్‌ని, క్రిప్స్‌ని ఎదుర్కొన్నాడు. అతడు ఇంగ్లీషు దుస్తులు ధరించడం మానివేశాడు. ఖాదీయే కట్టాడు. కార్మికుల్ని, రైతుల్ని బానిసత్వం నుండి విముక్తి కలిగించడానికి కృషిచేశాడు. సోషలిస్టులు క్రియాశీలత లేనివారనీ, ఆర్.యస్.యస్. వారు దేశభక్తులే కాని సరియైన మార్గదర్శకత్వం లేనివారనీ అనేవాడు. చాలామంది ముస్లింలు ఇండియాకు విధేయులుగా లేరని అతని అభిప్రాయం.

రెండుదేశాల విధానాన్ని నమ్మేవారు. ఇండియాని విడిచిపెట్టి వారి దేశానికి పోయి సంతోషంగా ఉండమని చెప్పేవాడు. మధ్యంతర ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడంద్వారా కాంగ్రెస్‌యొక్క రాజకీయలక్ష్యాలను నెరవేర్చగలిగాడు. సత్యాగ్రహ ఉద్యమాల ద్వారా ప్రజలకు చేరువయ్యాడు.

క్విట్‌ఇండియా ఉద్యమం సరియైనదని, తప్పనిసరిగా ఉద్యమించాలని పటేల్ అభిప్రాయం. గాంధీజీ ఎటువంటి పద్ధతిని సూచించినా, తాను మాత్రం సరియైన పద్ధతినే పాటిస్తానని చెప్పేవాడు.

మొదటి ప్రధానమంత్రిని ఎన్నుకున్న 25 సంవత్సరాల తరువాత సి. రాజగోపాలాచారి, "నెహ్రూని విదేశాంగమంత్రిగాను, పటేల్‌ని ప్రధానమంత్రిగాను ఎన్నుకుంటే యింకా బాగుండేది" అన్నాడు.

దేశానికి జీవితాంతం సేవచేస్తూ నెహ్రూ, పటేల్‌లు ఉన్నారనడంలో సందేహం ఎంతమాత్రమూ లేదు.



# ౨౦. వ్యవహార దక్షత కలవాడు

**1931**లో జరిగిన కరాచీ కాంగ్రెస్ సమావేశంలో గాంధీజీ, "జవహర్‌లాల్ భావుకుడు, సర్దార్ క్రియాశీలి, సర్దార్ కూడా ఆలోచనాపరుడే కాని ఊహాలోకంలో విహరించడు. అతడు పొలంలో దుక్కి దున్నాడు. పశువుల్ని మేపాడు. కష్టపడి పనిచేయడం యొక్క విలువ అతనికి తెలుసు. అతనికి ఓర్పు కూడా ఎక్కువే" అన్నాడు. ఒక లాయరుగా అనేకరకాల మనుష్యులతో సంబంధం ఉంది. అతని జీవితానుభవం అతనిని ఒక క్రియాశీలునిగా చేసింది. ఐక్యభారతం కోసం అతడు ముందుకు సాగాడు. ప్రజలలో ఉన్న మంచిని గుర్తించాడు. వారిలో ఉన్న చెడుని నిరసించాడు. ఎల్లప్పుడూ ప్రతి విషయంలోను జాగ్రత్తగా ఉంటాడు. ఉద్రేకానికి తావు యివ్వడు. తొందరపడి ఏ పనీ చేయడు. బాల్యం నుండి ఎదిరిస్తేనే రక్షణ ఉంటుందనే నమ్మకం కలవాడు. బారిస్టరుగా కీర్తి సంపాదించాడు. అతని జీవితమంతా పోరాటాలమయం.

గాంధీజీకి అతడు అనుయాయి. చంపారణ్‌లో మేజిస్ట్రేటు యొక్క ఆదేశాలను ధిక్కరించడం వల్ల పటేల్ గాంధీ యెడల ఆకర్షితుడయ్యాడు. గాంధీజీ విధానం అహింస, శాంతి, ప్రభుత్వానికి సహాయనిరాకరణ చేస్తే స్వాతంత్ర్యం లభిస్తుందని గాంధీ విశ్వాసం. వల్లభ్‌భాయి కూడా సత్యాగ్రహాన్నే ఆయుధంగా వాడి విజయాన్ని సాధించాడు. గాంధీజీకి పటేల్ మంచి సలహాదారుడు కూడా.

అధికారం వచ్చిన తరువాత గాంధేయమార్గాన్ని అనుసరించడంలో కొంత భేదం వచ్చింది. సర్దార్‌కి గాంధీజీకి కొన్నింటిలో అభిప్రాయభేదాలు వచ్చాయి. కాని వ్యక్తిగతంగా వారిద్దరిదీ గురుశిష్యసంబంధం. ఇద్దరూ ఒకే జైలులో గడిపినప్పుడు గాంధీజీకి సేవచేస్తూ సౌకర్యాలు కలిగించాడు.

తన నిర్ణయాత్మక శక్తివల్ల చాణుక్యునిలాగ వ్యవహారాలను చక్కబెట్టాడు. తాను చెప్పినదే ఎవరైనా అంగీకరించేటట్లు పరిస్థితిని కల్పిస్తాడు. ఇతరులను మాట్లాడనిస్తాడు, తాను నిశ్శబ్దంగా వింటాడు. తాను అనుకున్నది సాధించడానికి తగిన పథకాలను వేస్తాడు. పార్టీమీద అతనిదే అధికారం.

నెహ్రూ ప్రెసిడెంటు పదవికి రాజీనామా చేస్తానన్నాడు. సర్దార్ ఆచార్య కృపలానీ పేరు సూచించాడు. కృపలాని విద్యా సంబంధించిన విషయాలకు అంకితమయితే సర్దార్ పార్టీని క్రమపద్ధతిలో పెట్టే పనిలో ఉండేవాడు. నెహ్రూ, సర్దార్‌లు రాజేంద్రప్రసాద్‌ని ప్రెసిడెంటుగా ఉండమని కోరారు. అయిష్టంగానే అతడు అంగీకరించాడు. తరువాత డా॥ పట్టాభి సీతారామయ్య, పురుషోత్తమదాస్‌టాండన్‌లు ప్రెసిడెంటుగా చేశారు. చివరకు నెహ్రూ ఆ బాధ్యతని స్వీకరించాడు.

సర్దార్ ముస్లింలకు విరోధి అనీ, తిరుగుబాటుదారుడని, పెట్టుబడిదారుల స్నేహితుడనీ, సమాజద్వేషి అని అతనిపై విమర్శలు ఉన్నాయి. సోషలిజం మీద నమ్మకం ఉందా అని అడిగితే ఆస్తి లేకుండా ఉండడమే సోషలిజం అన్నాడు. అది గాంధీజీ ఆశ్రమంలోనే ఉందన్నాడు. సంఘాన్ని మార్చడానికి అహింసయే మార్గమని సర్దార్ నమ్మకం. సంఘంయొక్క అవసరాలను తీర్చడం చాలా ముఖ్యమని చెప్పాడు. ఉత్పత్తులు పెరగడం అవసరం. ధనికులస్వభావం మారితే వారికి ఎక్కువగా మిగిలినది దేశానికోసం ఉపయోగిస్తారంటాడు.

సర్దార్ ఎప్పుడూ మన భవిష్యత్తుని మార్చేవాడు భగవంతుడే అనుకునేవాడు. కాని ఆ భావాన్ని బహిరంగపరచలేదు. మతం అనేది వ్యక్తిగతం. దానికి రాజకీయాలలో తావులేదు అనేవాడు. సర్దార్ ముస్లింలకు శత్రువు కాడు. మతమౌఢ్యంకలవారికి శత్రువు. భారతదేశంలో నివసిస్తున్న ముస్లింలకు ఒక చిన్న పరీక్ష పెట్టాడు. వారు నిజమైన భారతీయులమనుకుంటే, కాశ్మీరుని పాకిస్తాన్ ఆక్రమించినప్పుడు ఎందుకు నోరు విప్పలేదు అని అడిగాడు.

నెహ్రూ ప్రసంగాలను ఎంత ఆసక్తితో పాకిస్తానీయులు వింటారో పటేల్ ప్రసంగాలను కూడా అంతే ఆసక్తితో వింటారు. బార్డోలి వీరుడిగా సర్దార్ పేరుపొందాడు. పార్లమెంటరీ సబ్‌కమిటీకి అధ్యక్షుడయినప్పుడు అతని పద్ధతులకు విమర్శించబడ్డాడు. ఒక నిర్ణయానికి రావడానికి సర్దార్ టైము తీసుకుంటాడు. ఒకసారి నిర్ణయం చేసిన తరువాత సందేహాలకు తావు యివ్వడు. క్రమశిక్షణకు పెద్దపీట వేస్తాడు. క్రమశిక్షణ అమలుజరపడంతో అతడు చాలామందికి శత్రువయ్యాడు. అతడు ఎటువంటి ఒత్తిళ్లకు లొంగడు. నిర్మొహమాటంగా మాట్లాడతాడు, నిజాయితీపరుడు. ఎవరినీ పొగడడు. నాయకులు స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలని చెబుతాడు.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నాయకులు పదవులకోసం ప్రాకులాడారు. వారి ఆశ దేశంమీదగల విధేయత మసకబారింది. భారతీయులు యుద్ధవీరులని సర్దార్‌కి తెలుసు. కాని వారిలో ఐక్యత లేదు. అందరూ ఓర్పు వహించాలని, స్నేహపూర్వకంగా ఉండాలని చెప్పేవాడు. మత విషయికమయిన భావాలతో ఉండేవారిని కొన్ని గ్రూపులు ఆకర్షించడం సర్దార్‌ని బాధించింది. దేశాన్ని భాషాప్రయుక్తరాష్ట్రాలుగా విభజించడం అతనికి యిష్టంలేదు. జాతీయసమైక్యతను అది విచ్ఛిన్నం చేస్తుంది. ఇండియా స్వయంసమృద్ధిగా ఉండాలని అతని ఆకాంక్ష.


జీవన ప్రమాణం పెరగడంవల్ల బోనస్ అడిగారు వస్త్రయంత్రాలవద్ద పనిచేసే కార్మికులు. కాని యజమానులు అంగీకరించలేదు. గాంధీజీ అహింసాయుతంగా వారిని సమ్మె చేయమన్నాడు. అయినా యజమానులు దిగిరాలేదు. గాంధీజీ నిరాహారదీక్ష పూనాడు. అప్పుడు యజమానులు ఒక ఒప్పందానికి వచ్చారు.

తన ప్రసంగాలలో సర్దార్ కఠినపదాలు ఉపయోగించడు. ముఖంలో ఎటువంటి భావాన్ని ప్రకటించడు. ప్రజల్ని సంతోషపరచడానికి సుకుమారంగా మాట్లాడడు. పార్లమెంటులో కూడా అతడు గొప్ప వక్త. రాజులకు ప్రీవీపర్సులు ఉదారంగా యిచ్చాడనే విమర్శ వచ్చినప్పుడు అది చాలా తక్కువే అని వాదించి, నిరూపించాడు. సిక్కుల చేతుల్లో ఎప్పుడూ కత్తులు ఉంటాయి కాబట్టి యితర సమాజాలవారికి కూడా కత్తులు చేతుల్లో ఉండేటట్లు అనుమతించండి. ఒక సభ్యుడు అడిగాడు. “అయితే మీరు సిక్కుమతం తీసుకోండి. అప్పుడు మీరు ఏ ఆయుధాన్నైనా ఉంచుకోవచ్చు” అని సర్దార్ బదులిచ్చాడు. సర్దార్ జవాబులు చమత్కారంగా ఉంటాయి.

నెహ్రూకి, సర్దార్‌కి ఉన్న భేదాభిప్రాయాలు వారి స్వభావాలను బట్టి ఏర్పడినవే. కాని ఒకరినొకరు గౌరవించుకుంటారు. వారి దేశభక్తే వారిని కలిపి ఉంచింది.

ఇండియన్ మర్చంట్స్ ఛాంబర్, బొంబాయిలో ఉన్న సర్దార్ విగ్రహం క్రింద యీక్రింది మాటలు చెక్కబడి ఉన్నాయి.

“సత్యానికి ప్రవక్త వంటివాడు
వ్యవహారదక్షుడు – దేశభక్తుడు”



# 21. సమాజ శ్రేయస్సు

## 1. విషవలయంనుండి తప్పించడం :

పశ్చిమబెంగాల్‌నుండి వలసపోతున్న వారి విషయంలో శ్రద్ధ తీసుకుని శాంతిని నెలకొల్పవలసినదిగా సర్దార్ శిక్కు నాయకులను కోరాడు. అప్పుడే వారు తమ బంధువులను మరల కలుసుకోగలుగుతారు. దాడులనుండి వారిని కాపాడడానికి ఐచ్ఛిక దళాలను ఏర్పాటుచేయవలసిందిగా కోరాడు. తనకు శిక్కుల యెడల అభిమానం ఉందని చెప్పాడు. పగలు, ప్రతీకారాలు సమసిపోయేటట్లుగా చూడాలని వారిని కోరాడు.

## 2. ప్రతీకారం వద్దు :

జలియన్‌వాలాబాగ్ మృతవీరుల సంస్మరణార్థం ఒక స్మారకచిహ్నాన్ని అమృత్‌సర్‌లో నిర్మించడం కోసం సర్దార్ అక్కడి ప్రజలతో చర్చించాడు. అక్కడున్న హిందువులు, శిక్కులు, ముస్లింలు స్వాతంత్ర్యం సాధించడానికి కృషిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కాని పరిస్థితులు తారుమారయ్యాయి. ముస్లింలు అమృత్‌సర్‌లో ప్రవేశించలేకపోయారు. అలాగే హిందువులు, శిక్కులు లాహోర్‌లో నివసించలేకపోయారు. స్వాతంత్ర్యం సంపాదించడం విధ్వంసానికి కాదనీ, అభివృద్ధికోసమనీ చెప్పాడు. కాబట్టి హింస, ప్రతీకారంతో ప్రజల్ని బాధ పెట్టవద్దని చెప్పాడు. శరణార్థులు సుఖంగా ప్రయాణం చేయడానికి తోడ్పడ వలసిందిగా కోరాడు.

పోలీసుచర్య సర్దార్‌కి యిష్టంలేదు. సరిహద్దుల్ని కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వానిదే. ముస్లిం శరణార్థులకు రక్షణ అవసరంలేదు కాని వారి ప్రయాణానికి ఆటంకం కలగకూడదు. హిందువులుగాని, శిక్కులుగాని, ముస్లింలు గాని వలసలు పోతే వారికి ఎటువంటి అడ్డంకులు రాకూడదు.

## 3. సలహా :

శిక్కులకు తాను స్నేహపూర్వకంగా సలహా యిస్తే వారు సంతోషంగా స్వీకరించారు అన్నాడు సర్దార్. తొందరపాటుతో ఏ పనీ చేయవద్దని చెప్పాడు. భవిష్యత్ కార్యాచరణ కోసం జాగ్రత్తగా ఆలోచించాలన్నాడు. వారి పేరుప్రతిష్టలకు భంగం కలగకూడదని చెప్పాడు. ప్రచారాలను నమ్మవద్దన్నాడు. చెడును చెడుతో కాక మంచితోనే ప్రతిఘటించాలని చెప్పాడు. తమ బాధ్యతలను గుర్తించి నిర్ణయాలు తీసుకోమని చెప్పాడు.

## 4. పరస్పర కలహాలను మరిచిపోండి :

అనేక కష్టనష్టాలకు ఓర్చి, మనం స్వాతంత్ర్యాన్ని సంపాదించుకున్నాం. స్వరాజ్యం వచ్చిన తరువాత సుపరిపాలన ఉంటుందని అనుకున్నాం. "మనం మనస్ఫూర్తిగా దేశాభివృద్ధికోసం శ్రమించాలి. అభివృద్ధినిరోధకులు కొంతమంది ఉండవచ్చు. అయినా మనం ముందుకు సాగిపోవాలి. ప్రజలందరూ మన సోదరులే. కాని విరుద్ధప్రచారాలు, రెండుదేశాల విధానం ప్రజల మనస్సుల్ని విషపూరితం చేశాయి. ఫలితంగా హిందువుగాని, శిక్కుగాని పాకిస్తాన్‌లో నివసించే పరిస్థితి పోయింది. అలాగే ఏ ముస్లిమూ తూర్పు పంజాబ్‌లో ఉండలేడు. కాని మనం కంగారుపడవలసిన పనిలేదు. అందరం ఒకే కుటుంబానికి చెందినవారమని భావిస్తే ఎలాంటి కలహాలు ఉండవు. మనకి రాజులతో కలహాలు లేవు. బాధ్యతాయుతమైన ప్రభుత్వం ఏర్పాటుచేయమని కోరగలం. వారు ఎలా స్పందిస్తారో చూడాలి" అన్నాడు సర్దార్.

ప్రజలు నైతిక విలువల్ని పాటించాలి నిస్వార్థంగా పనిచేయాలి. తగాదాలలోకి చొరవద్దు. అంతకంటే చేయవలసిన ముఖ్యమైన పనులున్నాయి. బాధ్యతాయుతంగా, నిజాయితీగా ప్రవర్తించాలి అని సర్దార్ ప్రజలకు బోధచేశాడు.

ముస్లింలను అంతమొందించాలని పాకిస్తాన్ ప్రధానమంత్రి ప్రణాళిక వేశాడు. కాని బహలీల్‌పూర్‌లో జరిగినదేమిటి ? ముస్లిమేతరులు ఎక్కువ నష్టాలకు లోనయ్యారు. ప్రధానిది వితర్కం. ముస్లింలు బాధపడుతున్నప్పుడు భారతప్రభుత్వం తటస్థంగా ఉందని అతడు ఆరోపించాడు.

## 5. సరియైన వాతావరణం :

సామాన్య వ్యక్తి అభివృద్ధి చెందాలంటే అంతర్గత శాంతి, కల్లోలాలు లేకుండా ఉండడం జరగాలి. పేదరికం తగ్గలేదంటే స్వాతంత్ర్యం సంపాదించినందువల్ల ఏం లాభం? కల్లోలాలతోనే కాలం గడిచిపోయింది. దేశాభివృద్ధికి సరియైన వాతావరణాన్ని సృష్టించాలి. విదేశాలలో మన కల్లోలాలు మనకి చెడ్డపేరు తెచ్చాయి. మనం మనదేశాన్ని పాలించు

కోలేమని విదేశీయులు అనుకుంటారు. కల్లోలాల వల్ల మనం ఆర్థికంగా కూడా నష్టపోయాం. అయినా మన దేశంలో ఏ ముస్లిమూ బాధపడకూడదు. అటువంటి వాతావరణాన్ని కల్పించాలి.

## 6. రెండు గుర్రాలస్వారీ అసాధ్యం :

మనదేశం పటిష్టంగా ఉండడానికి యువతరం నడుం కట్టాలని సర్దార్ యువకులకు చెప్పాడు. సమాజం కల్లోలాలు లేకుండా ఉండాలి. పారిశ్రామికంగా కూడా ప్రశాంతత ఉండాలి. అప్పుడే ఆసియా దేశాలకు ఇండియా నాయకత్వం వహించగలదు. వాటికి పరిపాలన నుండి విముక్తి కలిగించగలదు. ఇండియాలో ఉన్న ముస్లింలు మన రాజ్యాంగానికి బద్ధులై ఉండాలి. నిజంగా వారు బద్ధులై ఉంటే పాకిస్తాన్ ఆక్రమణలను గురించి ఎందుకు మాట్లాడలేదు ? ఆర్.యస్.యస్.ని కూడా కాంగ్రెస్‌లో చేరమని సర్దార్ చెప్పాడు. పాకిస్తాన్ వైఖరి మారాలి. ముస్లింలీగ్ దేశవిభజన కావాలంది. దాని గురించి ప్రచారం కూడా చేసింది. ఇండియా విభజనకు అంగీకరించింది. సర్దార్ తమకు శత్రువని పాకిస్తాన్ నిందించింది. మరి పాకిస్తాన్ ఇండియాలో నివసిస్తూన్న ముస్లింలను గురించి ఆలోచించిందా ? పంజాబ్ అల్లర్లు దేశానికి అపకీర్తి తెచ్చిపెట్టాయి. తరువాత జునాగడ్, కాశ్మీర్ సమస్యలు తలెత్తాయి. కాశ్మీర్‌ను పాకిస్తాన్ ఆక్రమించినప్పుడు ముస్లింలు మౌనంగా ఎందుకు ఉండిపోయారు ? కాబట్టి ముస్లింలు రెండుగుర్రాల మీద స్వారీ చేయలేరు. ఏదో ఒక గుర్రాన్ని ఎంచుకోవాలి అన్నాడు సర్దార్.

తమ దేశంలో ఉన్న మైనారిటీలను గురించి తాము రక్షణచర్యలు తీసుకుంటామని పాకిస్తాన్ చెప్పింది. సింధ్‌లో ఉన్న హిందువులు, శిక్కుల సంగతి ఏమిటి ? ఇండియా పునర్నిర్మాణం కావడానికి రెండు విషయాలున్నాయి - బలమైన సైన్యం, పటిష్టమైన కేంద్రప్రభుత్వం, కార్మికనాయకులను సమ్మెలు చేయవద్దని చెప్పాడు.

గాంధీజీని విమర్శించే తెలివితేటలు గాని, హక్కుగాని ఎవరికీ లేదని చెప్పాడు. గాంధీజీ చేపట్టే తపస్సు యింకెవరికీ సాధ్యంకాదు. గాంధీజీ సూచించిన కార్యక్రమాలను చేపట్టాలని చెప్పాడు. గాంధీజీ మనకు స్వాతంత్ర్యాన్ని సంపాదించిపెట్టాడు. మనం గాంధీజీ కలలుగన్న రామరాజ్యాన్ని ఎలా సాధించగలం? ఒక్క హిందూ-ముస్లింల సఖ్యతవల్ల మాత్రమే సాధించగలం. రెండవది అస్పృశ్యతని తొలగించడం ద్వారా. మూడవది స్వయంసమృద్ధిని సాధించడంద్వారా. మన సంస్కృతిని కాపాడుకోవడం మన కర్తవ్యం.

## 7. అందరూ స్వాతంత్ర్య పోరాట సైనికులే :

సర్దార్ అహమ్మదాబాద్ మునిసిపాలిటీలో చేసిన సేవలకు, చాలాసార్లు జైలుకి వెళ్లినందుకు ప్రజల మెప్పుని పొందాడు. జైలుకు వెళ్లినవారిలో తాను కూడా ఒకడినని,

దానిలో ప్రత్యేకత ఏమీ లేదన్నాడు. అందరూ స్వాతంత్ర్య పోరాటంలో సైనికులే అన్నాడు. వారు జైలులో ఉన్నా బయట ఏం జరుగుతూఉందోనని బాధపడ్డారు. విదేశీపాలననుండి విముక్తి పొందితే శాంతి లభిస్తుందనుకున్నారు. కాని స్వాతంత్ర్యం వచ్చిన తరువాత జరిగిన సంఘటనలు ఇండియాకి మచ్చ తెచ్చాయి. హిందూ-ముస్లింల సఖ్యత కోసం గాంధీజీ నిరాహారదీక్ష చేపట్టాడు. ప్రభుత్వం ప్రజలకు ట్రస్టీగా పనిచేయాలి. పరిస్థితులు చూస్తే మనం పాలనకు అర్హులమా అనే సందేహం వచ్చింది. నేరస్తులను శిక్షించి శాంతిని నెలకొల్పడం ప్రభుత్వ బాధ్యత.

దేశం విభజించబడిన తరువాత ఇండియా పాకిస్తాన్‌కి యివ్వవలసిన 55 కోట్లు యిచ్చివేసింది. ఇది చాలా ఔదార్యంతో చేసిన పని అని పాకిస్తాన్ కూడా అంగీకరించింది. ఇండియాలో నివసిస్తూన్న ముస్లింలు అందరిలాగే భద్రంగా ఉంటారన్నాడు సర్దార్. మన రాజ్యాంగం చాలా గొప్పది. అందరికీ వోటుహక్కు కల్పించింది.

## 8. చైతన్యవంతులు కండి :

అల్లర్లు తూర్పు, పశ్చిమబెంగాల్‌కు, సరిహద్దుదేశాలైన జమ్ము, కాశ్మీర్‌లకు ప్రాకాయి. స్త్రీలమీద, పిల్లలమీద అరాచకాలు మొదలయ్యాయి. వారిని తమ బంధువుల నుండి విడదీశారు. అటువంటి అకృత్యాలు అరికట్టబడాలి. వారిని బంధువుల చెంతకు చేర్చాలి. కొంతమంది అటువంటి ప్రయత్నం చేశారు. వారి ధైర్యసాహసాలను మెచ్చుకోవాలి. ప్రభుత్వం అటువంటివారికి మద్దతు యివ్వాలి.

అటువంటి అరాచకాలు, అకృత్యాలు చేసేవారు చైతన్యవంతులు కావాలి. వారు ఎంత తప్పుచేస్తున్నారో తెలుసుకోవాలి. వారు పశ్చాత్తాపపడాలి. వారు తమ అంతరాత్మ ప్రబోధాన్ని వినాలి. బాధలు పడుతూన్న స్త్రీలను గురించి, పిల్లలగురించి సర్దార్ బాధపడ్డాడు.

## 9. మనది మతాతీత రాజ్యం :

ఒకే ఒక్క రాజు దేశాన్ని పాలించడం చాలా తేలిక, కాని ప్రజాపాలన సులభం. ఇండియాకు బలమైన సైన్యం కావాలి. పాకిస్తాన్‌తో యుద్ధంకోసం కాదు, ఆత్మరక్షణకోసం అవసరం.

ఇండియా యొక్క ఆర్థికపరిస్థితి బాగుపడాలంటే స్వంతంగా బట్టలు తయారు చేసుకోవాలి. ఒకే జాతీయభాష ఉండాలి. గాంధీజీయొక్క చివరికోరిక తాను కరాచీ వెళ్లి అక్కడున్న ముస్లింలకు హిందువుల్ని సోదరులుగా చూసుకొమ్మని చెప్పాలని.

కాశ్మీర్ ప్రజలు ఇండియాతోనే కలిసి ఉండాలనుకున్నారు. వలసదారుల విషయమై ఇండియా పాకిస్తాన్‌లు ఒక ఒప్పందానికి వచ్చాయి. మన మతాతీత దేశంలో ముస్లింలకు సమానహక్కులివ్వడం జరిగింది. భారతపౌరులవలె వారు ఉండవచ్చు. హైదరాబాద్‌లో ఉన్న ముస్లింలు కూడా క్షేమంగా ఉండాలి.

చాలామంది నిరుద్యోగులున్నారు. వారంతా ఉత్పాదకత వైపు మరలాలి. వ్యవసాయంలోను, పరిశ్రమలలోను ఉత్పత్తి పెరగాలి. తుంగభద్రప్రాజెక్టు, గోదావరి ప్రాజెక్టు నిర్మించబడాలి.

## 10. మంచితనంలో విశ్వాసం ఉంచండి :

సర్దార్ కలకత్తా వెళ్లాడు. అక్కడ ముఖ్యమంత్రి ఎదుర్కొంటున్న సమస్యలకు తగిన సూచనలిచ్చాడు. బెంగాల్ ప్రజల కష్టాలను తొలగించడానికి ప్రయత్నించాడు. అతడు అనారోగ్యంతో ఉన్నా వారితోనే కలిసి ఉన్నాడు. బెంగాల్ విభజన తరువాత సరిహద్దుల్లో అల్లర్లు మొదలయ్యాయి. విమర్శకులు చాలామంది ఉన్నారు. వారుకూడా శాంతిభద్రతలను నెలకొల్పడానికి సహకరించవలసినదిగా ప్రభుత్వం కోరాలి.

పశ్చిమబెంగాల్‌లో ఉన్న ప్రజలు ఇస్లామిక్ స్టేట్‌కి సుముఖంగా లేరు. రెండు దేశాలమధ్య జరిగిన ఒప్పందానికి పాకిస్తాన్ కట్టుబడి ఉంటుందని సర్దార్ నమ్మాడు. కాబట్టి ప్రజలు పాకిస్తాన్ ప్రధానమంత్రిని కలిసి ఒప్పందాన్ని గుర్తుచేయాలి. లక్షలాది మంది ప్రజల భవితవ్యాన్ని గుర్తుంచుకుని చేసే ప్రసంగాలు మృదువుగా ఉండాలి గాని రెచ్చగొట్టేవిధంగా ఉండకూడదు.

ఇండియా, పాకిస్తాన్‌ల మధ్య జరిగిన ఒప్పందం సరిగా అమలుజరిగితే, అంతా శాంతియుతంగానే ఉంటుంది. ఇండియా ఒప్పందాన్ని నిజాయితీగా అమలు జరుపుతూంది.

## 11. ఉత్పత్తి సాధించు, సమానంగా పంచు :

సర్దార్ తన అభిప్రాయాలను ప్రజలకు చెప్పాడు. శ్యాంప్రసాద్ ముఖర్జీ కాంగ్రెస్‌వాది కాడు. కాని అతడు పరిశ్రమల మంత్రి. అతడు అంకితభావంతో పనిచేస్తాడు. మంత్రులు ప్రజాప్రతినిధులు. కార్మికులు లేకుండా పరిశ్రమలు లేకుండా దేశం అభివృద్ధి చెందదు. మనకి చాలా వనరులున్నాయి. అయితే పరిశ్రమలలో మాత్రం బాల్యదశలోనే ఉంది. “మనం ఆహారం, బట్ట, ఇనుము, ఉక్కు, సిమెంటు మొదలైనవి అధికంగా ఉత్పత్తి చేయాలి. అవి సామాన్యులకే కాదు, రక్షణశాఖకు కూడా ఉపయోగ పడతాయి. కార్మికులు

అయోమయస్థితిలో ఉన్నారు. వారు సరియైనమార్గాన్ని ఎంచుకుని పనిచేస్తే ఇండియాకి మంచి భవిష్యత్తు ఉంది.


సమ్మెలు నాశనానికి కారణమవుతాయని ప్రభుత్వం పదేపదే చెబుతూనే ఉంది. కార్మికులకు ఎక్కువ వేతనాలు కావాలంటే వారు ఉత్పత్తిని పెంచాలి. దానికి పరిశ్రమలు కావాలి. మతసామరస్యం ఉండాలి. అప్పుడే దేశానికి స్థిరత్వం కలుగుతుంది. ప్రభుత్వం వ్యాపారుల సహకారం కోరింది. అన్ని పరిశ్రమలూ ఒకేసారి స్థాపించడానికి మనకి తగిన వనరులు లేవు.

ఇండియా వ్యవసాయాధారిత దేశం. అధునాతన పద్ధతుల్ని ఉపయోగిస్తే, పారిశ్రామికంగా ఎదిగిన దేశాల సరసన ఇండియా కూడా నిలుస్తుంది. ఇండియాలో పారిశ్రామిక విప్లవం జరగలేదు. కొంతమంది జాతీయ భావాలు కల పారిశ్రామికవేత్తలు అక్కడక్కడా కొన్ని పరిశ్రమల్ని స్థాపించారు. ఉత్పత్తిని పెంచడానికి రెండు పద్ధతులున్నాయి. మన పారిశ్రామిక సామర్థ్యాన్ని ఉపయోగించుకోవాలి. దానితో తృప్తిపడి ఉండిపోకూడదు.

## 12. సుస్థిరత - ప్రణాళిక :

ప్రణాళికలను రూపొందించడం తేలికే. కాని మన వనరుల పరిధిలో రూపొందించాలి. సర్దార్ ప్రభుత్వంలోకి రాగానే బాహ్య, అంతర్గత భద్రత ముఖ్యమని తెలుసుకున్నాడు. ఆహార ఉత్పత్తి పెరిగితే లోటు ఉండదు. బాధ్యత ఉంటే ప్రణాళికలు ఆచరణలోకి వస్తాయి.

కొంతమంది అల్లర్లు, అరాచకాలు సృష్టిస్తున్నారు. దానిగురించి మొదట ఆలోచించాలి. చాలావరకు పరిస్థితి చక్కబడింది. ఆసియాలో సుస్థిరంగా ఉన్న దేశం ఇండియా ఒక్కటే. పరిశ్రమలు అభివృద్ధికావాలి. లేకపోతే యితర దేశాలమీద ఆధారపడవలసి ఉంటుంది.



# 22. రక్షణ దళాలకు

రక్షణదళాలకు సర్దార్ చేసిన ప్రసంగం –

"ఇంతవరకు మీరు విదేశీయుల కొరకు పోరాడారు. వీరులుగా భారతదేశపు ఖ్యాతిని యినుమడింపజేశారు. దేశానికి గౌరవాన్ని తెచ్చారు. మీ భుజస్కంధాల మీద దేశరక్షణ ఆధారపడి ఉంది. ఒక సైనికుని ధర్మం దేశంకోసం జీవించడం, మరణించడం. అది అతని విధి. మీరు మీ ధర్మాన్ని నిర్వర్తిస్తారని ఆశిస్తున్నాను. మీరు బాహ్య, అంతర్గత భద్రతలను గురించి శ్రద్ధ తీసుకోవాలి.

ఈరోజు మిమ్మల్నందరినీ కలుసుకోవడం నాకు చాలా ఆనందంగా ఉంది. మనకు స్వాతంత్ర్యం వచ్చింది, దానితో పాటు బాధ్యతలు కూడా పెరిగాయి. కష్టాలూ పెరిగాయి. కష్టాలకు మనం ఎప్పుడూ భయపడలేదు. మనం యిప్పుడు సంధికాలంలో ఉన్నాం. మనదేశం విభజించబడింది. మనది చాలాపెద్ద దేశం. దానిని ఐక్యంగా ఉంచాలంటే మనం కష్టపడాలి.

మీరు పార్టీ రాజకీయాలకు అతీతులుగా ఉండాలి. కుల, మతభేదాలు ఉండకూడదు.

మనకు ఇండోనేషియాతో ప్రాచీనకాలంనుండి సంబంధాలున్నాయి. ఆ దేశం యింకా విదేశీ పరిపాలనలోనే ఉంది. మనం ఆ దేశం గురించి సానుభూతితో ఉండాలి. ఆ దేశం స్వాతంత్ర్యంకోసం పోరాడుతూంది. మనం ఆ దేశానికి మద్దతు యివ్వాలి.

నేను రాజులకు వారి హక్కుల్ని పరి రక్షిస్తానని హామీయిచ్చాను. కతియ వాడ్ పాలకుడు బాధ్యతాయుతమైన ప్రభుత్వాన్ని నెలకొల్పినందుకు సంతోషంగా ఉంది. ఒరిస్సా, మధ్య ప్రదేశ్‌లలో ఉన్న 40 రాష్ట్రాలు వారి అధికారాలను ఇండియాకి అప్ప గించాయి. ప్రజలు తమ బాధ్యతల్ని గుర్తెరగాలని కోరుకుంటున్నాను. ఆదర్శప్రభుత్వం అంటే మహాత్మాగాంధీ నిర్వచనం చెప్పాడు. 1. కుటీర పరిశ్రమల అభివృద్ధి 2. పంచాయితీల పాలన 3.




అస్పృశ్యతానివారణ 4. హిందూ-ముస్లిం సఖ్యత ఉండా లన్నాడు.

దూరశ్రవణం భారతదేశానికి యిటీవలే వచ్చింది. 1940లో పాట్నాలో రేడియోస్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కాని అది ఆలస్యమయింది. గ్రామీణ ప్రాంతాలలో కమ్యూనిటీ రేడియోలు ఏర్పాటుచేయాలనుకున్నాం.

గాంధీజీ మరణానంతరం, అతనిని గురించి, అతని జీవితం గురించి దేశ, విదేశాలలో అనేకులు ప్రసంగాలు చేశారు. కాని మనం ఆవిధంగా ప్రసంగాలు చేయలేకపోయాం. మన మనస్సులు గాంధీ జ్ఞాపకాలతో నిండిపోయాయి. కాబట్టి మనకి మాటలు రాలేదు. "చెయ్యి. లేకపోతే మరణించు" (do or die) అనేది అతని ఆదర్శం. గొప్పవారు వారు చనిపోయిన తరువాత ప్రశంసించబడతారంటారు. కాని గాంధీజీ విషయంలో అతడు జీవించియుండగానే ప్రశంసించబడ్డాడు. అతడు తన మనస్సు విప్పి మాట్లాడతాడు కాబట్టి ప్రజలు అతనికి విధేయులై ఉన్నారు. అతడు బోధించినదే ఆచరించాడు. గతాన్ని మరిచిపోదాం. మహాత్ముడు జన్మించిన పుణ్యభూమి యిది. అతని అడుగుజాడల్లో నడుద్దాం".

ఇంకొక ప్రసంగంలో మన మొదటి గవర్నర్ జనరల్ అయిన రాజగోపాలచారి గురించి పటేల్ యిలా అన్నాడు.

"శ్రీ రాజగోపాలాచారి ప్రముఖ నాయకుడు. చాలా తెలివైన వ్యక్తి. వ్యవహార దక్షతకలవాడు. మంచి వక్త. మద్రాస్ నుండి పార్లమెంటుకు పునాదివేసిన వ్యక్తి. ఈరోజు మన భవిష్యత్తుకి మనమే యజమానులం. మనల్ని నడిపించే మార్గదర్శిగా అతడు ఉండడం మన అదృష్టం. అతడు మనదేశానికి మొదటి గవర్నర్-జనరల్‌గా ఉండడం మనకి గౌరవప్రదం. అతడు చాలా సమర్థుడు. మనదేశాన్ని సుస్థిరంగా చేస్తాడని ఆశిద్దాం.

సర్దార్‌కి యూనివర్శిటీ డిగ్రీ యిచ్చినప్పుడు "నాకిచ్చిన యీ గౌరవానికి కృతజ్ఞుడను. కాని నిర్మొహమాటంగా చెప్పాలంటే యిటువంటి గౌరవాలు నాకు నచ్చవు. ఈ యూనివర్శిటీ చేసిన విధంగా మన సంస్కృతు లన్నింటినీ ఏకంచేస్తే, ఇండియా యింకొక విధంగా ఉండేది. ఇప్పుడు మన భవిష్యత్తు మనచేతుల్లోనే ఉంది. దీనిని ఎలా మార్చుకుంటామో భగవంతునికే తెలుసు. భగవంతుని సృష్టి అయిన ముస్లింలు, హిందువులు ఒకేచోట నివసించాలి. అన్ని మతాలలోని మంచిని మనం గ్రహించాలని గాంధీజీ అనేవాడు. అన్ని మతాలు మంచివే. ప్రస్తుతం వైస్-ఛాన్సలర్‌గారు నా గురించి కొన్ని మంచి విషయాలు చెప్పారు. నేను ఎప్పుడూ భారతదేశపు విధేయుడిగా ఉన్న



సైనికుడిగానే ఉండాలనుకుంటున్నాను. భగవంతుని చేతిలో మనం కీలుబొమ్మలం. మనదేశానికి అపకీర్తి రాకుండా చూడవలసిన బాధ్యత మనమీద ఉంది. మిమ్మల్ని భగవంతుడు ఆశీర్వదించుగాక !

పోలీసులకు యిలా చెప్పాడు –

''స్వతంత్రభారతదేశంలో మీరు పోలీసులు. ప్రభుత్వం యొక్క కీర్తి, ప్రజల గౌరవం మీమీద ఆధారపడి ఉంది. మీ బాధ్యత చాలా ఎక్కువే. కాని మీ వృత్తి చాలా గౌరవప్రదమైనది. మీరు ప్రజల ప్రాణాలను వారి ఆస్తులను కాపాడుతారు. ఎవరి చేతా మీరు రెచ్చగొట్టబడవద్దు. అందరితోను మర్యాదగా మెలగండి. పోలీసులకు, ప్రజలకు మధ్య కొన్ని కారణాలచేత సహకారం కొరవడింది. మనకి అపకీర్తి రాకుండా చూడండి.


## స్వామిదయానంద గురించి :

"గాంధీజీ లాగే స్వామి దయానందసరస్వతి కూడా గుజరాత్‌కి చెందిన వ్యక్తే. అతడు లాహోర్‌లో మొదటగా ఆర్యసమాజాన్ని స్థాపించాడు. తరువాత దానిని ఢిల్లీకి మార్చారు. హిందూమతం మీద ప్రజలకు విశ్వాసం సన్నగిల్లిన సమయంలో దయానంద జన్మించాడు. విదేశీ మిషనరీలు ప్రజల్ని వారి మతంలోకి మార్చడం మొదలుపెట్టారు.

హిందూమతంలో చాలా మూఢనమ్మకాలు ఉన్నాయి. ప్రజల అపోహల్ని తొలగించి వారిలో మార్పు తెచ్చాడు దయానంద. అస్పృశ్యతానివారణకు కృషిచేశాడు. ఇతర మతాలలోకి ప్రజలు మారకుండా ఆపగలిగాడు. "మనలో భయాన్ని తొలగిస్తే మనం ఐక్యతగా ఉండి, మనల్ని మనం రక్షించుకోగలుగుతాం" అన్నాడు దయానంద".

## లాలాలజపతిరాయ్ గురించి

''దేశభక్తిలో లాలాలజపతిరాయ్‌ని మించినవారు ఎవరూ లేరు. అతనిని "పంజాబ్‌సింహం" అని పిలుస్తారు. ఈరోజు ప్రజలు తమ తప్పుల్ని కప్పిపుచ్చుకుని ఎదుటివ్యక్తి యొక్క తప్పుల్ని ఎంచుతారు. లాలాలజపతిరాయ్ అటువంటి వారిమీద ఆగ్రహించేవాడు. అప్పుడు వారు తప్పులు ఎంచడం మానివేసేవారు. మనదేశానికి లజపతిరాయ్ వంటి వారు అవసరం. లాలాలజపతిరాయ్‌యొక్క ఆదర్శం మీ యెదుట ఉంచుతున్నాను. మనంకూడా ఆ ఆదర్శాన్ని పాటించాలి.



# 23. సమీకరణకు సమయం ఆసన్నమైంది

మొదటగా మనం అంతా సమీకరించబడి, స్థిరంగా పటిష్టంగా ఉండాలి. "ఓడిపోతామని గాని, భయంచేతగాని, నేను దేశవిభజనకు అంగీకరించలేదు. అప్పుడున్న పరిస్థితులను బట్టి విడిపోవడమే మంచిదనుకున్నాను" అన్నాడు సర్దార్. ఇంకా యిలా అన్నాడు.

"గతాన్ని మరిచిపొమ్మని మిమ్మల్ని కోరుతున్నాను. ఇండియాను పటిష్టం చేయడం మనముందున్న కర్తవ్యం అప్పుడే మనం ఆనందంగా జీవించగలం. పాకిస్తాన్‌లో ఉన్న మైనారిటీల భద్రత గురించి చర్యలు తీసుకుంటామని లయఖత్ అలీఖాన్ అన్నమాటలకు సంతోషిస్తున్నాను. రాజులందరూ ఇండియన్ యూనియన్‌లో విలీనం కావడం ఖాయం. ఇండియా విభజించబడి ఉండకపోతే యింకా సంతోషంగా ఉండేవాళ్లం. అయినా విడిపోవడమే మంచిదయింది. లేకపోతే ముస్లింలు అల్లర్లు సృష్టించి ఉండేవారు. అటువంటివి జరగకూడదు. అల్లర్ల వల్ల చాలా నష్టం కలిగింది. ఆర్థికంగా బాగా దెబ్బతిన్నాం. అయినా పాకిస్తాన్ యెడల మనకు ద్వేషం లేదు.

సంపదను వృద్ధి చేయడమే మన లక్ష్యం. దానికి ఎక్కువ ఉత్పాదన జరగాలి. సృజనాత్మకత పెరగాలి. రాజులందరి సహకారం కావాలి. కాంగ్రెస్ తప్ప యింక ఏ పార్టీ ఐక్యతను సాధించలేదు. స్వాతంత్ర్యపోరాటం ముగిసింది కాబట్టి విద్యార్థులు తమ చదువులకు అంకితం కావాలని కోరుతున్నాను. మనకు స్వాతంత్ర్యం వచ్చింది.



కష్టాలు గట్టెక్కాయి. ఇక మనం విచారించవలసిన పనిలేదు. యువకులు సోషలిజమ్ కావాలనుకుంటున్నారు. కాని అంతకుముందు మనలో ఐక్యత కావాలి. దానికి మనం తగిన ప్రణాళిక వేయాలి. మనకు సమర్థుడైన ప్రధానమంత్రి ఉన్నాడు. అనుభవజ్ఞుడైన గవర్నర్ ఉన్నాడు. వారి సేవల్ని మనం పూర్తిగా ఉపయోగించుకోవాలి.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మనం ఎన్ని కష్టాలు ఎదురుకున్నామో మీకు తెలుసు. విభజన తరువాత బెంగాల్ పడిన కష్టాలు మనకి తెలుసు. మనం చెడునుండి మంచిని గ్రహించాలి. పునర్నిర్మాణం, పునరావాసం కల్పించాలి. ఇండియా ప్రస్తుతం క్లిష్టపరిస్థితుల్లో ఉంది. మన మిలిటరీని బలోపేతం చేయాలి. దానికి పరిశ్రమలనుండి మద్దతు కావాలి. పారిశ్రామికంగా ఇండియా వెనకబడి ఉంది. కార్మికుల సహాయం కూడా కావాలి. పరిశ్రమలవల్ల కార్మికులకు నష్టం కూడా ఉంది.

ప్రస్తుతం పరిపాలన చేస్తున్న మంత్రుల కార్యకలాపాలు మీకు సంతృప్తిగా లేకపోతే వారిని తొలగించండి. కాని చట్టాన్ని మీ చేతుల్లోకి తీసుకోవద్దు. మీరు బాధ్యత తీసుకుంటే అన్నీ చక్కబడతాయి. నేను రాజులకు స్నేహితుడనని నామీద నింద ఉంది. కాని నేను కార్మికులకు స్నేహితుడిని. ఎంత రక్షణ ఉన్నప్పటికీ, హిందువులను, శిక్కులను సింధ్‌నుండి బయటికి తీసుకురావాలి. కాశ్మీర్లో ఒక అంగుళం కూడా బయటికి పోనీయం.

మనం ప్రస్తుత దేశాన్ని పాలించే బాధ్యతని తీసుకున్నాం. యువత ముందుకు వచ్చి బాధ్యతలను స్వీకరించాలి. ఇండియా యిప్పుడే చిట్టిపొట్టి అడుగులు వేస్తూంది. ఇండియా బలంగా ఉండాలి. మనం దానిని పెంచి పోషించాలి. ఇండియా పటిష్టంగా ఉండాలంటే ఐక్యత, శాంతి ఉండాలి. ఐకమత్యమే బలం.

ప్రభుత్వం శాంతియుతంగా పరిపాలించడం మన ధ్యేయం. పరిపాలన సజావుగా జరిగేటట్లు చూడాలి. ఆటంకాలు కలిగించకూడదు. నేను ఆర్.యస్.యస్.తోను, కమ్యూనిస్టులతోను మాట్లాడాను. వారిని పాలనాబాధ్యతను స్వీకరించమని చెప్పాను. మన కష్టనష్టాలను అందరం కలిసి పంచుకుందాం.


కాంగ్రెస్‌లోను, బయటా ఉన్నవారు కూడా మనల్ని విమర్శిస్తున్నారు. బ్రిటిష్‌వారి పరిపాలనే బాగా ఉందంటున్నారు. ఇది చాలా దురదృష్టకరం. అంటే మనకి బానిసత్వం కావాలనుకుంటున్నామని అర్థం. మనం యింకా పూర్తిగా నడవలేని పరిస్థితిలో ఉన్నాం. పరుగెత్తడానికి ప్రయత్నిస్తే కాళ్ళు విరుగుతాయి. ఆర్థికాభివృద్ధి జరగాలంటే మనం త్యాగాలు చేయాలి.

బెంగాల్ విభజన తరువాత చాలామంది శరణార్థులు ఇండియాలో ప్రవేశించారు. కొంతమంది వారిని నిరుత్సాహపరిచారు. ప్రభుత్వం ఎటువంటి సహాయం చేయదని చెప్పారు. అటువంటి ప్రచారాల వల్ల వాళ్లకి వచ్చే లాభం ఏమిటి ? చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడడం తప్ప. మనం ఏంచేయాలి ? దేశపునర్నిర్మాణానికి మీరంతా కలిసి పనిచేయాలి. భేదాలు మరిచి కలిసికట్టుగా పనిచేయమని నేను కాంగ్రెస్ కార్యకర్తలకు చెప్పాను. మనకు స్వయంపోషకత్వం ఉంటేనే విదేశాలలో మనకు గౌరవం ఉంటుంది.

మీరంతా బాగా ఆలోచించండి. మీలో మీకు విశ్వాసాన్ని కలిగించుకోండి. ఆత్మవిశ్వాసంతో దేశభవిష్యత్తుకి, దేశసౌభాగ్యానికి ఐకమత్యంతో పనిచేయండి.



# సర్దార్ వల్లభ్‌భాయి పటేల్





**విక్టరీ పబ్లిషర్స్**

డోర్.నెం. 29-2-34,
రామమందిరం వీధి, ఏలూరు రోడ్డు,
విజయవాడ - 520 002.

డోర్.నెం. 2-4-1085, ప్లాట్ నెం. 3,
సాయిలక్ష్మీ నికేతన్, రామకృష్ణా హాస్పటల్ ఎదురువీధి,
నింబోలిఅడ్డ, హైదరాబాదు - 500027.
ఫోన్ : 040 - 65528228, సెల్: 93901 68228

VPBS026